తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org

గురువారం 20.08.2026 | సంపుటి :13 సంచిక : 31 | పేజీలు :12 వెల : రూ. 4/-

RNI NO.TELTEL / 2013 /50370

హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698




## 10 వికెట్లతో సుతార్ సునామి

600వ టెస్టులో భారత్ ఘన విజయం
165 పరుగుల తేడాతో శ్రీలంకపై టీమ్ఇండియా గెలుపు



వార్త 2 లో


## నా జీవితం గురించి రాయడం అంత ఈజీగా లేదు':సోనియా



వార్త 2 లో

## రూ.కోటి విరాళమిస్తేనే రేట్ల పెంపుకు అనుమతి

తెలంగాణలో సినిమా టికెట్ల ధరల రాష్ట్ర ప్రభుత్వం కీలక ఉత్తర్వులు



వార్త 2 లో



న్యూఢిల్లీలో బుధవారం ఏఐసీసీ ప్రధాన కార్యాలయం ఇందిరాభవన్‌లో కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశంలో పాల్గొన్న కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే , లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ, సోనియాగాంధీ, ప్రియాంక గాంధీ వాద్రా, జైరాం రమేశ్, కేసీ వేణుగోపాల్ సహా పలువురు సీనియర్ నేతలు

# విద్య, యువత సమస్యలపై కాంగ్రెస్ పోరుబాట

800 నగరాల్లో 'ఛాత్రోన్ కీ గూంజ్' కార్యక్రమం

- అయోధ్య విరాళాలపై పోరాటం
- డీలిమిటేషన్‌కు వ్యతిరేకంగా సీడబ్ల్యూసీ తీర్మానం
- ప్రస్తుత సీట్లలోనే మహిళా రిజర్వేషన్లు ఇవ్వాలని డిమాండ్
- చైనా ఆక్రమణలపై కేంద్రం సమాధానం చెప్పాలి
- కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ కీలక నిర్ణయాలు



కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశంలో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, కర్ణాటక సీఎం డీకే శివకుమార్

విద్యార్థులు, యువత ఎదుర్కొంటున్న సమస్యలపై దేశవ్యాప్తంగా ఉద్యమాన్ని విస్తరించాలని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశం నిర్ణయించింది. పరీక్షల నిర్వహణలో అవకతవకలు, పేపర్ లీకులు, నియామకాల్లో జాప్యం, నిరుద్యోగం, విద్య ఖర్చుల పెరుగుదల వంటి అంశాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని నిర్ణయించింది

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**విద్యార్థులు, యువత ఎదుర్కొంటున్న సమస్యలపై దేశవ్యాప్తంగా ఉద్యమాన్ని విస్తరించాలని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశం నిర్ణయించింది. పరీక్షల నిర్వహణలో అవకతవకలు, పేపర్ లీకులు, నియామకాల్లో జాప్యం, నిరుద్యోగం, విద్య ఖర్చుల పెరుగుదల వంటి అంశాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని నిర్ణయించింది. రాహుల్‌గాంధీ చేపట్టిన 'ఛాత్రోం కీ గూంజ్' కార్యక్రమాన్ని దేశవ్యాప్తంగా 800 నగరాలకు విస్తరించాలని నిర్ణయించారు.న్యూఢిల్లీలో బుధవారం ఏఐసీసీ ప్రధాన కార్యాలయం ఇందిరాభవన్‌లో కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశం జరిగింది. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ,

మిగతా 2లో..

## 22ఏ బాధితులకు ఆందోళన వద్దు

ఫాస్ట్‌ట్రాక్ విధానంలో పరిష్కరిస్తాం • ప్రతి కేసును వేగంగా పరిష్కరించాలి

అధికారులకు టెలికాన్ఫరెన్స్‌లో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆదేశం



**హైదరాబాద్,ఆగస్టు19(జనంసాక్షి):** నిషేధిత జాబితాలో ఉన్న భూములకు సంబంధించి ప్రజల్లో నెలకొన్న గందరగోళానికి త్వరితగతిన తెరదించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఫాస్ట్‌ట్రాక్ విధానంలో చర్యలు చేపట్టిందని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. 22/ఏ జాబితాలో భూమి ఉందనే ఒక్క కారణంతోనే రిజిస్ట్రేషన్ దరఖాస్తులను తిరస్కరించవద్దని, ప్రతి కేసును సమగ్రంగా పరిశీలించి అర్హులైన వారికి ఎలాంటి జాప్యం లేకుండా న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. బుధవారం ఖమ్మం జిల్లా పర్యటనలో ఉన్న మంత్రి పొంగులేటి 22/ఏ అంశంపై ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తూ, రెవెన్యూ శాఖ కార్యదర్శి లోకేష్ కుమార్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ కమిషనర్ రాజీవ్ గాంధీ హనుమంతు, హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లాల కలెక్టర్లతో నిరంతరం సంప్రదింపులు జరిపారు. మంత్రి ఆదేశాల మేరకు కలెక్టర్లు సబ్ రిజిస్ట్రార్లతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించడంతో పాటు క్షేత్రస్థాయిలో పరిస్థితిని పర్యవేక్షించారు. అనంతరం అధికారులతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో మంత్రి మాట్లాడుతూ. 22/ఏ జాబితాలో భూమి ఉందనే కారణంతో మాత్రమే రిజిస్ట్రేషన్‌ను నిలిపివేయడం లేదా తిరస్కరించడం చేయవద్దని ప్రతి కేసును సమగ్రంగా పరిశీలించాలని

మిగతా 2లో..

## 'సర్' పేరుతో భారీగా ఓట్ల తొలగింపు

- కేంద్ర ప్రభుత్వానివి కుట్రపూరిత రాజకీయాలు
- ప్రతి గ్రామం అభివృద్ధి చెందాలి
- ప్రతి కుటుంబం ఆర్థికంగా బలోపేతం కావాలి : మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

2 లో..



## నీట్ పరీక్షల వ్యవస్థ మరింత పకడ్బందీగా..

క్వశ్చన్ బ్యాంకులు.. వాహనాలకు జీపీఎస్ ట్రాకర్లు

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**నీట్ పరీక్షల నిర్వహణ కోసం సరికొత్తగా తీసుకువచ్చిన భద్రతా నిబంధనలు అత్యంత పకడ్బందీగా ఉన్నాయని కేంద్రం సుప్రీం కోర్టుకు వెల్లడించింది. వాటిని ఛేదించడం కష్టమని పేర్కొంది. 'పలువురు నిపుణులు కలిసి క్వశ్చన్ బ్యాంకును తయారు చేస్తారు. అందులో నుంచి పరీక్షలో ఏ ప్రశ్నలు వస్తాయనే విషయం వారికి కూడా తెలియదు. నీట్ ప్రశ్నపత్రాలను రవాణా చేసే వాహనాలకు జీపీఎస్ వ్యవస్థలు అమర్చాం. ఇవి వాహనంలోని చిన్న కదలికలను కూడా రికార్డ్ చేస్తాయి. దీనివల్ల రవాణా

మిగతా 2లో..

## 'నీట్'లో సంస్కరణలపై సుప్రీంలో విచారణ

వార్త 2 లో

## బాలికల అక్రమ రవాణా కేసులో 33 మందికి శిక్షలు

ఐదుగురికి జీవిత ఖైదు.. మరో 28 మందికి వివిధ శిక్షలు

9 మంది బాధిత బాలికలకు ఒక్కొక్కరికి రూ.5 లక్షల పరిహారం

సీఐడీ మహిళా భద్రత విభాగం దర్యాప్తుతో కేసులో కీలక తీర్పు



**హైదరాబాద్(జనంసాక్షి):**బాలికల అక్రమ రవాణా, వ్యభిచారంలోకి నెట్టడం, లైంగిక దోపిడీకి పాల్పడిన కేసులో 33 మంది నిందితులను దోషులుగా నిర్ధారిస్తూ హైదరాబాద్ హకా భవన్‌లోని పోక్సో ప్రత్యేక సెషన్స్ కోర్టు (ఎఫ్‌టీఎస్‌సీ)బుధవారం తీర్పు వెలువరించింది. వీరిలో ఐదుగురికి జీవిత ఖైదు విధించింది. మరో 28 మందికి వివిధ కాలపరిమితులతో కఠిన కారాగార శిక్షలు విధించింది .సీఐడీ హైదరాబాద్ పోలీస్‌స్టేషన్ లో 2015 లో నమోదైన క్రైం నంబర్ 14/ 2015కు సంబంధించిన కేసులో విచారణ పూర్తయింది. మహిళల భద్రత విభాగం ఆధ్వర్యంలో దర్యాప్తు జరిగిన ఈ కేసులో పోక్సో చట్టం, ఐపీసీ, ఇమ్మోరల్ ట్రాఫిక్ (ప్రివెన్షన్) యాక్ట్, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీస్ నిరోధక చట్టంలోని వివిధ సెక్షన్ల కింద అభియోగాలు నమోదయ్యాయి.2015 జులై 17న బాధితురాలు సీఐడీని ఆశ్రయించి ఫిర్యాదు చేసింది. గ్రామంలో వ్యవసాయ పనులు చేసుకుంటున్న ఆమెకు పరిచయస్తుడైన వ్యక్తి ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మబలికాడు. అనంతరం ఆమెను ఏ1 నుంచి ఏ3 నిందితులకు పరిచయం చేసి వివిధ ప్రాంతాలకు తీసుకెళ్లినట్లు ఫిర్యాదులో పేర్కొంది. అక్కడ ఆమెను బలవంతంగా వ్యభిచారంలోకి నెట్టడంతోపాటు పలువురితో లైంగికంగా సంబంధాలు పెట్టుకునేలా ఒత్తిడి చేసినట్లు

మిగతా 2లో..



తెలంగాణ ఇంటర్ బోర్డు కార్యాలయంలో

## విజిలెన్స్ సోదాలు

రేవంత్‌పై అనుచిత వ్యాఖ్యలు.. కొండా సురేఖ కుమార్తెకు

## కాంగ్రెస్ నోటీసులు

## సిమ్ కార్డు రూల్స్ కఠినతరం..

ఫొటో చెక్ తప్పనిసరి

వార్త 2 లో

## విద్యార్థులే ప్రిన్సిపాల్ హంతకులు

- రూపారెడ్డి హత్య కేసులో సంచలన విషయాలు
- దారుణానికి ఒడిగట్టిన అదే స్కూల్‌లోని ఇద్దరు టెన్త్ స్టూడెంట్స్
- జల్సాలకు అలవాటు పడి డబ్బుల కోసం ప్రిన్సిపల్ హత్య
- వివరాలు వెల్లడించిన నల్గొండ జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్

సంచలనం సృష్టిం చిన నల్గొండ జిల్లా కొండమల్లేపల్లిలోని నాగా ర్జున స్కూల్ ప్రిన్సిపల్ రూపారెడ్డి హత్య కేసులో నల్గొండ జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్ కీలక విషయాలు వెల్లడించారు. జల్సాలకు అలవాటు పడిన ఇద్దరు విద్యార్థులు ప్రిన్సిపల్ ఇంటికి దొంగతానికి వెళ్లారని చెప్పారు. ఈ క్రమంలో గోడదూకి ఇంట్లో ప్రవేశించి చోరీకి పాల్పడిన విద్యార్థిని రూపారెడ్డి గుర్తించడంతో తన వెంట తీసుకెళ్లిన కత్తితో ఆమెను హత్య చేశాడన్నారు. స్కూల్ ఫీజుల వసూళ్లు జరుగుతుండటంతో ప్రిన్సిపల్ ఇంట్లో డబ్బు ఉంటుందని భావించి ఐదు రోజుల ముందు నుంచే చోరీకి ప్లాన్ చేశా రన్నారు. నల్గొండలో నిర్వహించిన మీడియా సమావేశంలో హత్య కేసు వివరాలను ఎస్పీ వెల్లడించారు.'





వివరాలు 8లో..



## ప్రజల ఆస్తులకు రక్షణగా నిలుస్తాం

22ఏ భూముల అంశంలో పొంగులేటిని బర్తరఫ్ చేయాలి: హరీశ్‌రావు

**హైదరాబాద్(జనంసాక్షి):** ప్రభుత్వం మెడలు వంచి ప్రజల ఆస్తులకు రక్షణగా ఉంటామని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. 22ఏ నిషేధిత భూముల జాబితా అంశంపై తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. 30, 40 ఏళ్లుగా లేని సమస్య ఇప్పుడే ఎందుకు వస్తోందని ప్రశ్నించారు. "22ఏ జాబితా నుంచి తొలగించి రిజిస్ట్రేషన్లు

మిగతా 2లో..



ఆస్పత్రిలో చిక్సిత కోసం వచ్చి..

## అగ్నికి ఆహుతై..

కోల్‌కతా హోటల్‌లో అగ్నిప్రమాదంలె 9మంది మృత్యువాత

మృతులంతా చికిత్స కోసం వచ్చిన బంగ్లాదేశీయులుగా గుర్తింపు

**కోల్‌కతా,ఆగస్ట్19(జనంసాక్షి):** పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలోని మీర్జా గాలిబ్ వీధిలో ఉన్న ఓ హోటల్‌లో మంగళవారం అర్ధరాత్రి అగ్నిప్రమాదం జరిగింది. ఆ దుర్ఘటనలో 9 మంది చనిపోయినట్లు పోలీసులు వెల్లడించారు. రాత్రి 1.45 నిమిషాలకు ప్రమాదం చోటుచేసుకున్నది. అగ్నిమాపక సిబ్బంది తో పాటు పోలీసులు, డిజాస్టర్ మేనేజ్మెంట్ శాఖ సిబ్బంది రెస్క్యూ ఆపరేషన్ చేపట్టారు. గాయపడ్డవారిని సమీప ఆస్పత్రికి తీసుకెళ్లారు. దట్టమైన పొగ కమ్ముకోవడం వల్ల పై అంతస్తులకు చేరుకోవడానికి అగ్నిమాపక సిబ్బంది ఇబ్బందిపడింది.

మిగతా 9లో..

## యుద్ధం ముదిరితే ఐరోపానూ వదలం



అక్కడి అమెరికా సైనిక స్థావరాలపైనా దాడికి ఇరాన్ సన్నాహాలు?

**టెహ్రాన్(జనంసాక్షి):** అమెరికా, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. ఒకవేళ యుద్ధం మరింత తీవ్ర రూపం దాల్చితే.. ఐరోపాలోని అమెరికా సైనిక లక్ష్యాలపైనా దాడులు చేసేందుకు ఇరాన్ సన్నాహాలు చేస్తోందని అంతర్జాతీయ మీడియాలో కథనాలు వచ్చా యి. బల్గేరియా, సైప్రస్ సహా ఆగ్నేయ ఐరోపాలోని అమెరికా ఆస్తులపై దాడులకు గల అవకాశాలను టెహ్రా న్ బలగాలు అంచనా వేస్తున్నట్లు సంబంధిత వర్గాలను ఉటంకిస్తూ తెలిపాయి.అమెరికా భారీ దాడులు చేపడితే.. పశ్చిమాసియాను దాటి ఆ దేశ సైనిక ఆస్తు లు, మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకునే అవకా శాలు లేకపోలేవని ఇరాన్ కమాండర్లు హెచ్చరించారు. తమ 'బెజ్‌మెర్' వైమానిక స్థావరాన్ని వినియోగించుకునేందుకు యూఎస్ ఇంధన విమానాలకు బల్గేరియా ఇటీవల అనుమతినిచ్చింది. ఈ నేపథ్యంలో బల్గేరియాలోని అమెరికా ఆస్తులను ఇరాన్ లక్ష్యంగా చేసుకునే అవకాశం ఉన్నట్లు మీడియా కథనాలు తెలిపాయి. సైప్రస్‌ను కూడా టార్గెట్‌గా పరిగణించినట్లు సమాచారం. అదేవిధంగా.. హర్మూజ్ జలసంధి గుండా వెళ్లే సముద్రగర్భ కేబుళ్లపై దాడి చేసే అవకాశాన్ని కూడా ఇరాన్ దళాలు పరిశీలించాయని పేర్కొన్నాయి.ఇదిలా ఉండగా.. ఈ ఏడాది మొదటి నాలుగు నెలల్లో ఇరాన్‌కు రూ.70 వేల కోట్లకుపైగా చమురు సంబంధిత విదేశీ మారకద్రవ్యం సమకూరినట్లు స్థానిక వార్తాసంస్థ తెలిపింది. గత ఏడాది ఇదే కాలంలో వచ్చిన ఆదాయంతో పోలిస్తే ఇది 1.5 రెట్లు అధికమని ఇరాన్ చమురుశాఖ సమాచారాన్ని ఉటంకించింది.

రైలు, రహదారి మౌలిక సదుపాయాలకు

## పెద్దపీట

రూ.13,041 కోట్ల విలువైన ప్రాజెక్టులకు కేబినేట్ ఆమోదం

**న్యూఢిల్లీ,ఆగస్ట్19(జనంసాక్షి):** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. దేశంలో రైలు, రహదారి మౌలిక సదుపాయాలను మరింత బలోపేతం చేసేలా మొత్తం రూ.13,041 కోట్ల విలువైన ఐదు ప్రాజెక్టులకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. వీటిలో నాలుగు రైల్వే బహుళ మార్గాల ప్రాజెక్టులు కాగా, మరొకటి బిహార్‌లో రహదారి ప్రాజెక్టు. కేంద్ర కేబినెట్ ఆమోదించిన నాలుగు రైల్వే ప్రాజెక్టుల మొత్తం వ్యయం సుమారు రూ.9,450 కోట్లు. ఇవి నాలుగు రాష్ట్రాల్లో రైల్వే మార్గాల సామర్థ్యాన్ని పెంచడంతో పాటు రద్దీని తగ్గించేందుకు ఉద్దేశించినవి.

మిగతా 9 లో..



## జమ్మూకశ్మీర్ భారతదేశంలో అంతర్భాగం

అమెరికా రాయబారి సెర్గియో

కశ్మీర్ సమస్యను అమెరికా పరిష్కరించదు : ఒమర్ అబ్దుల్లా

**శ్రీనగర్(జనంసాక్షి):** జమ్మూకశ్మీర్ భారత్‌లో అంతర్భాగమని అమెరికా రాయబారి సెర్గియో గోర్ స్పష్టం చేశారు. కేంద్రం, జమ్మూకశ్మీర్ యంత్రాంగం భద్రతను మెరుగుపరిచేందుకు తీసుకుంటున్న చర్యలను ప్రశంసించారు. ఈ నేపథ్యంలోనే అమెరికా తన ప్రయాణ హెచ్చరికను మరోసారి సమీక్షించే అవకాశం ఉందని వెల్లడించారు. జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లాతో శ్రీనగర్‌లో భేటీ అనంతరం గోర్ మీడియాతో మాట్లాడారు. 2019లో ఆర్టికల్ 370 రద్దు తర్వాత, అలాగే 2025లో పహల్గాంలో ఉగ్రదాడి

మిగతా 9లో..

## రూ.కోటి విరాళమిస్తేనే రేట్ల పెంపుకు అనుమతి

హైదరాబాద్(జనంసాక్షి):తెలంగాణలో సినిమా థియేటర్ల టికెట్ రేట్లకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం కీలక ఉత్తర్వులు జారీ చేసింది. నాన్ ఏసీ, ఏసీ థియేటర్లతోపాటు స్పెషల్ థియేటర్లు, మల్టీప్లెక్స్‌ల్లో టికెట్ల ధరలపై కనిష్ఠ, గరిష్ఠ పరిమితులు నిర్ణయించింది. ఉత్తర్వుల్లో పేర్కొన్న వివరాల ప్రకారం టికెట్ల ధరలు ఇలా ఉన్నాయి. నాన్ ఏసీ థియేటర్లలో.. నాన్ ప్రీమియం కేటగిరీ టికెట్ల ధర కనిష్ఠంగా రూ.30, గరిష్ఠంగా రూ.70. ప్రీమియం టికెట్ల ధర కనిష్ఠంగా రూ.50, గరిష్ఠంగా రూ.100.ఏసీ థియేటర్లలో.. నాన్ ప్రీమియం కేటగిరీ టికెట్ల ధర కనిష్ఠంగా రూ.50, గరిష్ఠంగా రూ.150. ప్రీమియం కేటగిరీ టికెట్ల ధర కనిష్ఠంగా రూ.100, గరిష్ఠంగా రూ.200.స్పెషల్ థియేటర్లలో.. నాన్ ప్రీమియం కేటగిరీ టికెట్ రేట్లు కనిష్ఠంగా రూ.100, గరిష్ఠంగా రూ.250. ప్రీమియం రిక్లయినర్లకు కనిష్ఠంగా రూ.200, గరిష్ఠంగా రూ.300.మల్టీప్లెక్స్‌ల్లో.. రెగ్యులర్ టికెట్లు కనిష్ఠంగా రూ.100, గరిష్ఠంగా రూ.250. రిక్లయినర్లకు కనిష్ఠంగా రూ.200, గరిష్ఠంగా రూ.300గా ప్రభుత్వం నిర్ణయించింది.
ఉత్తర్వుల్లో పేర్కొన్న మరికొన్ని అంశాలు..
7.1 సరౌండ్ సౌండ్ వ్యవస్థ, 2ఐ/4ఐ ప్రొజెక్షన్, కనీసం 75 అడుగుల తెర ఉండే థియేటర్లకు స్పెషల్ థియేటర్లుగా గుర్తింపు.ప్రతి థియేటర్లో ఉదయం 8 గంటల నుంచి అర్ధరాత్రి 1 గంట వరకు ఐదు షోలకు అనుమతి.ఉదయం 11 నుంచి రాత్రి 9 గంటల మధ్య ఒక షోలో చిన్న సినిమా ప్రదర్శనకు అవకాశం ఇవ్వాలి.పరిమిత బడ్జెట్‌తో తీసే చిన్న సినిమాలకూ పండుగల సమయంలో ప్రాధాన్యం ఇవ్వాలి.రూ.100 కోట్లకుపైగా పెట్టుబడితో తీసే చిత్రాలకు సూపర్ హై బడ్జెట్ సినిమాలుగా గుర్తింపు.సూపర్ హై బడ్జెట్ చిత్రాలకు మొదటి 10 రోజులపాటు మాత్రమే టికెట్ ధరలు పెంచుకునే అవకాశం.సినీ కార్మిక సంక్షేమ నిధికి రూ.1 కోటి విరాళం ఇచ్చే చిత్రాలకే టికెట్ ధరల పెంపు.పేద, మధ్య తరగతి ప్రేక్షకుల కోసం మల్టీప్లెక్స్‌లు సహా ప్రతి థియేటర్లో 25 శాతం సీట్ల కేటాయింపు.ఆన్లైన్ టికెట్ బుకింగ్లో ఏసీ థియేటర్లకు రూ.5, నాన్ ఏసీ థియేటర్లకు రూ.3 నిర్వహణ ఛార్జీలుగా ఖరారుఎయిర్ కూల్డ్ థియేటర్లను రెండేళ్లలో ఏసీ థియేటర్లుగా మార్చుకోవాలి.

## కొండా సురేఖ కుమార్తెకు కాంగ్రెస్ నోటీసులు

హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మంత్రి కొండా సురేఖ కుమార్తె సుస్మితా పటేల్‌కు కాంగ్రెస్ పార్టీ నోటీసులు జారీ చేసింది. దీనిపై మూడు రోజుల్లోగా వివరణ ఇవ్వాలని టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ ఆదేశించింది. కొండా సురేఖ జన్మదిన వేడుకల్లో సుస్మిత చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశమయ్యాయి. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ అధిష్ఠానం పార్టీ టికెట్ ఇవ్వకుంటే ఇండిపెండెంట్‌గా పరకాల నుంచే బరిలో దిగుతానని ఆమె అన్నారు. ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిని ఉద్దేశించి కూడా పలు విమర్శలు చేశారు. ఈ నేపథ్యంలో వివరణ కోరుతూ టీపీసీసీ నోటీసులు జారీ చేసింది.మరోవైపు వనపర్తి నియోజకవర్గంలో ఇటీవల జరిగిన పరిణామాల నేపథ్యంలో ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డికి సైతం టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ నోటీసులు జారీ చేసింది. మూడు రోజుల్లో వివరణ ఇవ్వాలని ఆదేశించింది. ఎల్బీ నగర్ నియోజకవర్గ కాంగ్రెస్ సీనియర్ నేత జక్కిడి ప్రభాకర్‌రెడ్డిపై టీపీసీసీ సస్పెన్షన్ వేటు వేసింది. పలువురిని వ్యక్తిగతంగా దూషించడంతో ఆయన్ను సస్పెండ్ చేసింది.

## ప్రజల ఆస్తులకు రక్షణగా నిలుస్తాం

చేసి మళ్లీ 22ఏ జాబితాలో పెట్టారట. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొంగులేటికి రియల్ ఎస్టేట్ తెలిస్తే.. బీఆర్ఎస్‌కు పోరాటం తెలుసు. సమస్యను పరిష్కరిస్తారా.. ప్రజల కాళ్ల కింద నలిగిపోతారా?ఒక్క ఎకరా కూడా 22ఏ కింద పెట్టలేదని 10 రోజుల క్రితం పొంగులేటి చెప్పారు. ఇప్పుడు అధికారులు తప్పు చేశారంటున్నారు. నిషేధిత జాబితా గురించి 4 నెలల క్రితమే సీఎం రేవంత్‌కు చెప్పానని మంత్రి కోమటిరెడ్డి చెప్పారు. ఆయన చెప్పినపుడే సీఎం ఎందుకు స్పందించలేదు?రేవంత్, పొంగులేటికి తెలిసే జరిగిందని స్పష్టంగా అర్థమవుతోంది. కోట్లాది ప్రజల ఆస్తులను ఇలా పెట్టే ధైర్యం అధికారులకు ఉంటుందా?చీటికి మాటికి విచారణలు చేసే రేవంత్‌రెడ్డి.. దీనిపై ఎందుకు స్పందించడం లేదు?సీఎంకు సంబంధం లేకపోతే పొంగులేటిని బర్తరఫ్ చేయాలి. 22ఏలో ఏయే భూములు పెట్టారో వాటిని తొలగిస్తే సరిపోతుంది. ప్రభుత్వం స్పందించకపోతే సీఎం ఇంటిని ముట్టడిస్తాం" అని హరీశ్‌రావు హెచ్చరించారు.

## మరింత పకడ్బందీగా నీట్ పరీక్షల వ్యవస్థ

సమయంలో అధికారులు పర్యవేక్షించగలుగుతారు' అని కేంద్రం వెల్లడించింది.పేపర్ లీక్‌లు అనేవి వ్యవస్థాగత సమస్య అని.. వాటిని నివారించడానికి సంస్థాగత మార్పులు అవసరమని రాధాకృష్ణన్ కమిటీ చెప్పిందని ధర్మాసనం వ్యాఖ్యానించింది. వారు చెప్పింది అక్షరసత్యమని పేర్కొంది. నీట్ పరీక్ష సంస్కరణలపై రాధాకృష్ణన్ ప్యానెల్, నందన్ నీలేకని కమిటీ చేసిన సిఫార్సులను అమలు చేయడానికి ఏం చర్యలు తీసుకున్నారని జాతీయ పరీక్షల సంస్థ (ఔెం)ను ప్రశ్నించింది. వాటిని వివరిస్తూ అఫిడవిట్ దాఖలు చేయాలని ఆదేశించింది. ప్రశ్నపత్రాల లీకేజీ, పరీక్షల్లో అవకతవకలు బయటపడుతున్న నేపథ్యంలో పరీక్షల వ్యవస్థ సమూల ప్రక్షాళనకు జాతీయ పరీక్షల సంస్థ (ఔెం) శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా ఇప్పటికే 50మందికిపైగా సిబ్బందిని తొలగించింది. సైబర్ భద్రత, సైకోమెట్రిక్స్, ప్రశ్నపత్రాల రూపకల్పన, ఇతర ప్రత్యేక విభాగాల కోసం ప్రైవేట్ రంగం నుంచి కూడా నిపుణులను తీసుకువస్తున్నట్లు వెల్లడించింది. ప్రశ్నపత్రాల గోప్యతను దృష్టిలో ఉంచుకొని ప్రత్యేక గదులు, ఎయిర్-గ్యాప్డ్ సిస్టమ్స్ (ఇంటర్నెట్‌తో సంబంధం లేని వ్యవస్థలు), పరికరాలను భద్రపరిచే విధానాలను పూర్తిగా పునర్ వ్యవస్థీకరిస్తున్నట్లు తెలిపింది.

### 'నీట్'లో సంస్కరణలపై సుప్రీంలో విచారణ

న్యూఢిల్లీ,ఆగస్టు19(**జనంసాక్షి**):నీట్ ప్రశ్నపత్రం లీకేజ్ వ్యవహారం, జాతీయ పరీక్షల సంస్థలో సంస్కరణలకు సంబంధించిన పిటిషన్లపై సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. పరీక్షల నిర్వహణలో శాశ్వత, సమగ్ర సంస్కరణలు తీసుకురావాల్సిన అవసరాన్ని కోర్టు స్పష్టం చేసింది. పరీక్షల నిర్వహణకు పటిష్ఠ వ్యవస్థ అవసరమని అభిప్రాయపడింది. ఎన్‌టీఏలో చేపట్టిన సంస్థాగత సంస్కరణలు, ప్రశ్నపత్రాల భద్రత, పరీక్షల పారదర్శకత, సైబర్ భద్రత తదితర అంశాలపై పూర్తి వివరాలను అఫిడవిట్‌లో పొందుపరచాలని సుప్రీంకోర్టు కోరింది. కేవలం తాత్కాలిక చర్యలు కాకుండా శాశ్వత వ్యవస్థను ఏర్పాటు చేయాలని కోర్టు స్పష్టం చేసింది. జస్టిస్ పి.ఎస్. నరసింహ, జస్టిస్ అలోక్ ఆరాధే ధర్మాసనం ఈ వ్యవహారాన్ని విచారిస్తోంది. ఎన్‌టీఏలో సంస్కరణలను తాము పర్యవేక్షిస్తామని ధర్మాసనం స్పష్టం చేసింది. పరీక్షల నిర్వహణలో పదేపదే తలెత్తుతున్న సమస్యలకు తాత్కాలిక పరిష్కారాలు కాకుండా వ్యవస్థాగత మార్పులు అవసరమని పేర్కొంది. ఎన్టీఏను సంస్థాగతంగా బలోపేతం చేయాలని, నీట్ పరీక్షల భద్రతకు శాశ్వత కమిటీ అవసరమని సుప్రీంకోర్టు తేల్చి చెప్పింది. విద్యార్థుల భవిష్యత్తు, విశ్వసనీయత కోసం ఎన్టీఏలో నిర్మాణాత్మక మార్పులు చేయాలని సూచించింది. నీట్-2026 ప్రశ్నపత్రం లీక్ నేపథ్యంలో పరీక్ష రద్దు చేయాల్సి రావడం, విద్యార్థులు ఎదుర్కొన్న ఇబ్బందుల తర్వాత ఎన్టీఏ పనితీరుపై తీవ్ర విమర్శలు వచ్చాయి. ఈ నేపథ్యంలో భవిష్యత్తు లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఎన్టీఏలో శాశ్వత సంస్కరణలు అమలు చేయడంపై సుప్రీంకోర్టు దృష్టి సారించింది.

### తెలంగాణ ఇంటర్ బోర్డు కార్యాలయంలో విజిలెన్స్ సోదాలు

హైదరాబాద్(**జనంసాక్షి**): నాంపల్లిలోని తెలంగాణ ఇంటర్ బోర్డు కార్యాలయంలో విజిలెన్స్ సోదాలు జరుగుతున్నాయి. గత నాలుగు గంటలుగా విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం తనిఖీలు కొనసాగిస్తోంది. 2019 ఇంటర్ ఫలితాల వ్యవహారంలో గ్లోబరీనా సంస్థ అవకతవకలకు పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. మార్కుల్లో తప్పులు దొర్లడంతో పలువురు విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. ఈ నేపథ్యంలో సీఎం ఆదేశాలతో విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం రంగంలోకి దిగింది. ఇంటర్ బోర్డు మాజీ కార్యదర్శి అశోక్‌ను విజిలెన్స్ అధికారులు విచారిస్తున్నారు.

# విద్య,యువత సమస్యలపై కాంగ్రెస్ పోరుబాట



సోనియాగాంధీ, ప్రియాంక గాంధీ వాద్రా, జైరాం రమేశ్, కేసీ వేణుగోపాల్ సహా పలువురు సీనియర్ నేతలు పాల్గొన్నారు. కాంగ్రెస్ పాలిత తెలంగాణ, కేరళ, కర్ణాటక, హిమాచల్‌ప్రదేశ్ ముఖ్యమంత్రులు విద్యావేత్తలు, విద్యార్థి సంఘాలు, ఇతర వర్గాలతో నెలరోజుల పాటు సంప్రదింపులు నిర్వహించి తమ రాష్ట్రాలకు అనుగుణంగా విద్యా సంస్కరణల ప్రణాళిక రూపొందించాలని సీడబ్ల్యూసీ సూచించింది. మరోవైపు హల్ద్వానీలో మల్లికార్జున ఖర్గే సభ అనంతరం జరిగినట్లు కాంగ్రెస్ ఆరోపించిన 'శుద్ధీకరణ' ఘటనపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ క్షమాపణ చెప్పాలని సీడబ్ల్యూసీ డిమాండ్ చేసింది. ఈ ఘటన సామాజిక వివక్షను ప్రతిబింబిస్తోందని కాంగ్రెస్ విమర్శించింది.లోక్‌సభ స్థానాల సంఖ్యను 543కే పరిమితం చేసి, అదే సంఖ్యలో మహిళలకు మూడో వంతు రిజర్వేషన్ తక్షణమే అమలు చేయాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. అలాగే పార్టీ కార్యక్రమాల్లో ఇకపై వందేమాతరం తొలి రెండు చరణాలను మాత్రమే ఆలపించాలని నిర్ణయించింది. యువత, విద్యార్థుల సమస్యలను జాతీయ రాజకీయ అజెండాగా మార్చడంతో పాటు రాబోయే ఎన్నికలకు పార్టీని సన్నద్ధం చేసే దిశగా సీడబ్ల్యూసీ సమావేశం కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి.

**పలు కీలక అంశాలపై నిర్ణయాలు**

కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సమావేశంలో పలు కీలక అంశాలపై పార్టీ నిర్ణయాలు తీసుకుంది. జాతీయ గీతం 'వందేమాతరం' విషయంలో 1937లో తీసుకున్న నిర్ణయాన్నే కొనసాగించాలని కాంగ్రెస్ నిర్ణయించింది. పార్టీ కార్యక్రమాల్లో ఇకపై వందేమాతరంలోని తొలి రెండు పద్యాలను మాత్రమే ఆలపించాలని స్పష్టం చేసింది. అదే సమయంలో రామమందిరం విరాళాల అంశంపై దేశవ్యాప్తంగా ఆందోళనలు చేపట్టాలని సీడబ్ల్యూసీ నిర్ణయించింది. ఈ అంశాన్ని క్షేత్రస్థాయికి తీసుకెళ్లాలని, రాష్ట్ర కాంగ్రెస్ కమిటీలకు ఆదేశాలు ఇవ్వాలని నిర్ణయించింది. సీడబ్ల్యూసీ సమావేశంలో మొత్తం 88 మంది నాయకులు పాల్గొన్నారని, 33 మంది నేతలు చర్చల్లో తమ అభిప్రాయాలను వెల్లడించారని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి (సంస్థాగత వ్యవహారాలు) కేసీ వేణుగోపాల్ తెలిపారు. కార్యసమితి సభ్యులతో పాటు శాశ్వత ఆహ్వానితులు, ప్రత్యేక ఆహ్వానితులు, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు కూడా సమావేశానికి హాజరయ్యారు. ఈ సమావేశానికి కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రుల్లో తెలంగాణ సీఎం ఎ. రేవంత్‌రెడ్డి, కేరళ ముఖ్యమంత్రి వీడీ సతీశన్, హిమాచల్‌ప్రదేశ్ సీఎం సుఖ్విందర్ సింగ్ సుక్కు, కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ పాల్గొన్నారు. రామమందిరం విరాళాల అంశంపై దేశవ్యాప్త పోరాటం సీడబ్ల్యూసీ సమావేశం అనంతరం కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ మీడియాతో మాట్లాడుతూ.. రామమందిరానికి సంబంధించిన విరాళాల చోరీ అంశాన్ని తీవ్ర ఆందోళన కలిగించే విషయంగా అభివర్ణించారు. ఈ అంశం ప్రజల భావోద్వేగాలతో ముడిపడి ఉందని ఆయన పేర్కొన్నారు. రామమందిరాన్ని ఉపయోగించుకుని ప్రజలను విభజించేందుకు ప్రయత్నిస్తున్న వారు ఇప్పుడు పూర్తిగా బయటపడిపోయారని ఆరోపించారు. ఈ అంశాన్ని కాంగ్రెస్ క్షేత్రస్థాయికి తీసుకెళ్లనుందని వేణుగోపాల్ తెలిపారు. రామమందిరం విరాళాల అంశంపై దేశవ్యాప్తంగా నిరసనలు నిర్వహించాలని సీడబ్ల్యూసీ రాష్ట్ర కాంగ్రెస్ కమిటీలకు సూచించినట్లు వెల్లడించారు.

**పేపర్ లీకుల అంశంపై కాంగ్రెస్ చర్చ**

సీడబ్ల్యూసీ సమావేశంలో పేపర్ లీకుల అంశంపైనా సుదీర్ఘంగా చర్చ జరిగినట్లు కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ తెలిపారు. పేపర్ లీకులకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా జరిగిన ఉద్యమాలు, వాటిని ఎదుర్కొనే విషయంలో ప్రభుత్వం వ్యవహరించిన తీరుపై సమావేశంలో చర్చించినట్లు చెప్పారు. విద్యార్థులు, యువత భవిష్యత్తుతో ముడిపడి ఉన్న పేపర్ లీకుల సమస్యపై ప్రభుత్వం సరైన చర్యలు తీసుకోవడంలో విఫలమైందని కాంగ్రెస్ ఆరోపించింది. పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో ప్రతిపక్షాలు విజయవంతంగా పనిచేశాయని, ప్రభుత్వం అనేక అంశాల్లో ఒత్తిడికి గురైందని కేసీ వేణుగోపాల్ పేర్కొన్నారు. ప్రజా సమస్యలను పార్లమెంట్‌లో బలంగా లేవనెత్తడంలో ప్రతిపక్ష కూటమి కీలక పాత్ర పోషించిందని తెలిపారు.

**అరుణాచల్‌ప్రదేశ్‌లో చైనా అంశంపై చర్చ**

సీడబ్ల్యూసీ సమావేశంలో అరుణాచల్‌ప్రదేశ్‌లో చైనా చొరబాట్ల అంశంపైనా చర్చ జరిగింది. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానంపై కాంగ్రెస్ విమర్శలు చేసింది. చైనా విషయంలో కేంద్రం 'లొంగుబాటు విధానం' అవలంబిస్తోందని కాంగ్రెస్ ఆరోపించింది. అరుణాచల్‌ప్రదేశ్ సరిహద్దు అంశాన్ని కూడా కేంద్ర ప్రభుత్వంపై రాజకీయ పోరాటంలో భాగంగా తీసుకెళ్లాలని పార్టీ నిర్ణయించింది. ఈ అంశంపై ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు ప్రభుత్వ వైఖరిని ప్రశ్నించాలని కాంగ్రెస్ భావిస్తోంది.

**మహిళా రిజర్వేషన్‌పై కాంగ్రెస్ వైఖరి**

మహిళా రిజర్వేషన్ అంశంపైనా సీడబ్ల్యూసీ సమావేశంలో చర్చ జరిగింది. మహిళలకు రిజర్వేషన్ కల్పించాలన్న తమ డిమాండ్‌కు కాంగ్రెస్ కట్టుబడి ఉందని పార్టీ పునరుద్ఘాటించింది. ప్రస్తుతం ఉన్న లోక్‌సభలోని 543 స్థానాల ప్రాతిపదికన మహిళా రిజర్వేషన్ అమలు చేయాలని కాంగ్రెస్ డిమాండ్ చేస్తోంది. మహిళా రిజర్వేషన్ అమలులో జాప్యం చేయకుండా తక్షణమే చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది.

**ఓబీసీ కాలమ్ లేకపోవడంపై కాంగ్రెస్ అభ్యంతరం**

కుల గణనకు సంబంధించిన ప్రశ్నావళిలో ఓబీసీ కాలమ్ లేకపోవడంపై కాంగ్రెస్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ మాట్లాడుతూ.. కుల గణనలో ఓబీసీలకు ప్రత్యేక కాలమ్ లేకపోవడంపై గతంలోనూ పార్టీ ఆందోళన వ్యక్తం చేసిందని తెలిపారు. ఈ అంశంపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఇప్పటికే ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాసినట్లు చెప్పారు. ఓబీసీలకు సంబంధించిన పూర్తి వివరాలు సేకరించకుండా కుల గణన నిర్వహించడం వల్ల ప్రభుత్వ ఉద్దేశాలపై అనుమానాలు తలెత్తుతున్నాయని వేణుగోపాల్ ఆరోపించారు. కుల గణన ప్రక్రియను కేంద్ర ప్రభుత్వం బలహీనపరిచే ప్రయత్నం చేస్తోందా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయని అన్నారు. ఈ అంశంపై కేంద్ర ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. కుల గణనలో ఓబీసీలకు ప్రత్యేక ప్రాధాన్యం కల్పించాల్సిన అవసరం ఉందని కాంగ్రెస్ పేర్కొంది. ఈ అంశాన్ని మరోసారి బలంగా లేవనెత్తుతామని వేణుగోపాల్ తెలిపారు.

**కేంద్ర ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టేందుకు వ్యూహం**

సీడబ్ల్యూసీ సమావేశంలో కేంద్ర ప్రభుత్వ విధానాలపై పోరాటాన్ని మరింత ఉధృతం చేయాలని కాంగ్రెస్ నిర్ణయించింది. వందేమాతరం అంశం నుంచి రామమందిరం విరాళాలు, పేపర్ లీకులు, విద్యా వ్యవస్థ, చైనా అంశం, మహిళా రిజర్వేషన్, కుల గణన వరకు పలు అంశాలపై పార్టీ తన వైఖరిని స్పష్టం చేసింది. ప్రజా సమస్యలను క్షేత్రస్థాయికి తీసుకెళ్లి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలని కాంగ్రెస్ భావిస్తోంది. రాష్ట్ర కాంగ్రెస్ కమిటీలను మరింత చురుకుగా పనిచేయించాలని, గ్రామ స్థాయి నుంచి పార్టీ కార్యక్రమాలను విస్తరించాలని సమావేశంలో నిర్ణయించినట్లు తెలుస్తోంది.

**రాబోయే ఎన్నికలపై దృష్టి**

సీడబ్ల్యూసీ సమావేశంలో రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పార్టీ వ్యూహంపైనా చర్చ జరిగినట్లు సమాచారం. ప్రజల్లో చర్చ జరుగుతున్న అంశాలను రాజకీయంగా ముందుకు తీసుకెళ్లాలని కాంగ్రెస్ భావిస్తోంది. విద్యార్థులు, యువత, మహిళలు, ఓబీసీలు, రైతులు వంటి వర్గాలకు సంబంధించిన అంశాలను ప్రధానంగా ప్రస్తావించాలని నిర్ణయించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ప్రజా సమస్యలపై ఉద్యమాలు నిర్వహిస్తూ పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయాలని నేతలకు సూచించినట్లు వెల్లడించారు.

**సీడబ్ల్యూసీ సమావేశంలో తెలంగాణకు ప్రాధాన్యం**

న్యూఢిల్లీలో జరిగిన ఈ సమావేశంలో కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రుల పాల్గొనడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా సమావేశానికి హాజరయ్యారు. కాంగ్రెస్ పాలనలో ఉన్న రాష్ట్రాల పనితీరు, ప్రజా సంక్షేమ కార్యక్రమాలు, పార్టీ బలోపేతంపై కూడా చర్చ జరిగినట్లు సమాచారం. రాష్ట్రాల్లో ప్రభుత్వాలు చేపడుతున్న కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ నాయకత్వం సూచించినట్లు తెలుస్తోంది.

**'శుద్ధీకరణ' ఘటనపై సీడబ్ల్యూసీలో చర్చ**

ఉత్తరాఖండ్‌లో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కార్యక్రమం అనంతరం జరిగినట్లు ఆరోపిస్తున్న 'శుద్ధీకరణ' ఘటనపై కూడా సీడబ్ల్యూసీలో చర్చ జరిగింది. ఈ వ్యవహారంపై ప్రధాని నరేంద్ర మోదీ దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని జైరాం రమేశ్ డిమాండ్ చేశారు.

## నా జీవితం గురించి రాయడం అంత ఈజీగా కాలేదు'

న్యూఢిల్లీ(**జనంసాక్షి**): దశాబ్దాలపాటు ప్రజా జీవితంలో ఉన్న కాంగ్రెస్ అగ్రనాయకురాలు సోనియాగాంధీ తన వ్యక్తిగత జీవితం గురించి తొలిసారి మనసు విప్పనున్నారు. 'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్' పేరిట తన ఆత్మకథను తీసుకొస్తున్నట్లు ప్రకటించారు. అది నవంబర్ 10న ప్రచురితం కానుంది. ఈ నేపథ్యంలో సోనియా మాటలను ప్రచురణకర్త ఆల్ఫ్రెడ్ గుర్తుచేసుకున్నారు.సోనియా అనూహ్యంగా రాజకీయాల్లోకి ప్రవేశించారు. అప్పటివరకు ప్రజాజీవితానికి దూరంగా ఉన్న తనను.. హృదయవిదారక ఘటనలు, నష్టాలు రాజకీయాలవైపు లాగాయని సోనియా గుర్తుచేసుకున్నారు. ఈ ఆత్మకథ రాయడం, తన మనసులోతుల్లో దాచుకున్న అనుభవాలను రాబట్టడం అంత సులువుగా జరగలేదన్నారు. తన ప్రయాణంలోని ఆనందాలు, నిరాశల సమాహారమే ఈ పుస్తకం అని పేర్కొన్నారు. మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జీవిత భాగస్వామిగా, కాంగ్రెస్ పార్టీ అగ్రనేతగానే సోనియాగాంధీ అందరికీ సుపరిచితురాలు. రాజీవ్‌తో ప్రేమ, పెళ్లి, భారత్‌కు రావడం, ఇలా తన జీవితానికి సంబంధించి ఎన్నో విశేషాలను ఈ పుస్తకం రూపంలో వెల్లడించనున్నారు. తన అత్త, మాజీ ప్రధాని ఇందిరా గాంధీ హత్య, ఆ తర్వాత భర్త రాజీవ్‌గాంధీ హత్య తన జీవితాన్ని ఎలా మార్చాయో పుస్తకంలో ప్రస్తావించారు.

### 10 వికెట్లుతో సుతార్ సునామి..

**గాలె(జనంసాక్షి):**శ్రీలంకతో తొలి టెస్టులో భారత్ ఘన విజయం సాధించింది. 372 పరుగుల లక్ష్య ఛేదనలో శ్రీలంక 206 పరుగులకే ఆలౌటైంది. దీంతో 165 పరుగుల తేడాతో టీమ్ఇండియా గెలిచింది. రెండు టెస్టుల సిరీస్‌లో 1-0 ఆధిక్యం సాధించింది. మానవ్ సుతార్ ఫైఫర్ (6/55) నమోదు చేశాడు. భారత్‌కు ఇది 600వ టెస్టు మ్యాచ్. ఇక, రెండో ఇన్నింగ్స్‌లో శ్రీలంక బ్యాటర్లలో సోనాల్ దినుష (84), ధనంజయ డిసిల్వా (59) హాఫ్ సెంచరీలతో రాణించారు. భారత బౌలర్లలో మానవ్ సుతార్ 6, ప్రసిద్ధ్ కృష్ణ 2.. సిరాజ్, జడేజా చెరో వికెట్ తీశారు. తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 462 పరుగులు చేయగా.. శ్రీలంక 284 పరుగులకే పరిమితమైంది. రెండో ఇన్నింగ్స్‌లో టీమ్ఇండియా 193 పరుగులు చేసింది. రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి మానవ్ సుతార్ 10 వికెట్లు పడగొట్టాడు. దేవదత్ పడిక్కల్‌కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు వరించింది. ఇక డబ్ల్యూటీసీ పాయింట్ల పట్టికలో భారత్ స్థానం మారనప్పటికీ.. పర్సంటేజీని మాత్రం బాగా పెంచుకుంది.

# 22ఏ బాధితులకు ఆందోళన వద్దు

ఆదేశించారు. సంబంధిత భూమి 22/ఏ నిషేధిత జాబితాలోకి ఎందుకు వచ్చింది? అందుకు సంబంధించిన రికార్డులు ఏమి చెబుతున్నాయి? ప్రస్తుతం భూమి వాస్తవ పరిస్థితి ఏమిటి? హక్కుదారుడి వద్ద ఉన్న పత్రాలు ఏమిటి? గతంలో జరిగిన రిజిస్ట్రేషన్లు, ప్రభుత్వ రికార్డుల్లోని వివరాలు ఏమిటి? వంటి అన్ని అంశాలను సమగ్రంగా పరిశీలించిన తర్వాతే తుది నిర్ణయం తీసుకోవాలని సూచించారు. రిజిస్ట్రేషన్‌కు అవకాశం లేని వాటికి రిజిస్ట్రేషన్ ఎందుకు సాధ్యం కాదో దరఖాస్తుదారులకు స్పష్టంగా తెలియజేయాలని, నిబంధనల ప్రకారం ముందుగా చెల్లించిన రిజిస్ట్రేషన్ ఫీజును తిరిగి చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. 22/ఏభూముల విషయంలో ప్రజలు ఎలాంటి అపోహలకు, ఆందోళనలకు గురికావాల్సిన అవసరం లేదని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ప్రజల హక్కులను కాపాడుతూనే ప్రభుత్వ భూములను కూడా పరిరక్షిస్తూ, ప్రతి కేసును చట్టబద్ధంగా, పారదర్శకంగా పరిష్కరించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. 22/ఏ సమస్యను ఫాస్ట్‌ట్రాక్ విధానంలో పరిష్కరిస్తున్న ప్రభుత్వ చర్యలకు లబ్ధి పొందిన కొందరు తమ అనుభవాన్ని వెల్లడించారు.

## 'సర్' పేరుతో భారీగా ఓట్ల తొలగింపు

ఖమ్మం,ఆగస్టు19(జనంసాక్షి): కేంద్రంలోని భాజపా ప్రభుత్వం ప్రజాస్వామ్య వ్యవస్థలను దుర్వినియోగం చేస్తున్నదని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. ఎస్ఐఆర్ అనే పక్రియను అడ్డం పెట్టుకుని రాష్ట్రంలో ప్రతిపక్షంలో ఉన్న బిఆర్ఎస్ పార్టీతో కలిసి భాజపా కుట్రలు చేస్తోందన్నారు. అందులో భాగంగానే కాంగ్రెస్ పార్టీని దెబ్బతీసేందుకు ఎస్ఐఆర్ అనే భూతాన్ని చూపి భారీగా ఓట్ల తొలగింపుకు తెరలేపిందన్నారు. ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన పీఏసీ సమావేశంలో ఎఐసిసి కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల కో ఇన్చార్జి సచిన్ సావంత్, ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి, జిల్లా డిసిసి అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్, వైరా శాసనసభ్యులు మాలోతు రాందాస్ నాయక్ ,పార్టీ ముఖ్య నాయకులతో కలిసి మంత్రి పొంగులేటి శ్రీనివసా రెడ్డి పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా స్థానిక రాజకీయ పరిస్థితులు, పార్టీ బలోపేతం, భవిష్యత్ కార్యాచరణపై సుదీర్ఘంగా చర్చించారు. కాంగ్రెస్ పార్టీకి అండగా నిలిచే దళిత, గిరిజన, మైనారిటీ వర్గాల ఓట్లే లక్ష్యంగా సుమారు 67 నుంచి 68 లక్షల ఓట్లను తొలగించేందుకు శ్రీకారం చుట్టడమే కాకుండా, మరో 70 లక్షల ఓట్లను గాలిలో పెట్టి ఓటర్లను గందరగోళానికి గురిచేస్తున్నారు. కుట్రలను తిప్పికొట్టేందుకు రాబోయే 4-5 రోజుల్లో బూత్ స్థాయి కార్యకర్తలకు ప్రత్యేక శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు.

ప్రతి గ్రామం అభివృద్ధి చెందాలి..

గ్రామీణ ప్రజలకు అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉండాలనే లక్ష్యంతో ప్రజా ప్రభుత్వం నిరంతరం పనిచేస్తోందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. కోట్లాది రూపాయల నిధులను కేటాయిస్తూ పల్లెల ప్రగతికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. బుధవారం పాలేరు నియోజకవర్గంలో పర్యటనలో భాగంగా కూసుమంచి మండలం క్యాంప్ కార్యాలయంలో అర్హులైన 12 మంది దివ్యాంగులకు వందశాతం సబ్సిడీపై మూడు చక్రాల మోటార్ వాహనాలను పంపిణీ చేయడం జరిగింది. అనంతరం ఖమ్మం రూరల్ మండలం పల్లెగూడెంలో రూ. 20లక్షలతో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ కార్యాలయ భవనాన్ని ప్రారంభించి అనంతరం ఏర్పాటు చేసిన సభలో పాల్గొన్నారు. రూ. 61.76 కోట్లతో పల్లెగూడెంలో సీసీ, బీటీ రోడ్ల తో పాటు వివిధ అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. పల్లెగూడెంలో ప్రభుత్వ మరియు అసైన్డ్ భూములను ఆక్రమించిన వారి నుంచి వెంటనే స్వాధీనం చేసుకుని, గ్రామంలోని అర్హులైన నిరుపేద కుటుంబాలకు ఇళ్ల స్థలాలుగా కేటాయించాలి. ప్రభుత్వ భూముల ఆక్రమణలపై క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ జరిపి, వెంటనే ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించడం జరిగింది. అదేవిధంగా గ్రామస్థుల విజ్ఞప్తి మేరకు రూ.12 లక్షల నూతన అంగన్‌వాడీ భవనాన్ని కూడా తక్షణమే మంజూరు చేయడం జరిగింది. ఈ సందర్భంగా సభలో పింఛన్లు కావాలని అడిగిన మహిళలకు నెల 31వ తేదీలోగా అర్హులైన వయోవృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్లు అందేలా చూస్తానని హామీ ఇవ్వడం జరిగింది.

## బాలికల అక్రమ రవాణా కేసులో 33 మందికి శిక్షలు

తెలిపింది.సుమారు నాలుగు నెలల పాటు నిందితుల నియంత్రణలో ఉన్న బాధితురాలు వారి నుంచి తప్పించుకుని సీఐడీ కార్యాలయానికి చేరుకుని ఫిర్యాదు చేసింది. దీంతో కేసు నమోదు చేసిన పోలీసులు వ్యభిచార గృహాలపై దాడులు నిర్వహించారు.దాడుల సందర్భంగా ఏ1 నుంచి ఏ45 వరకు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. తొమ్మిది మంది మైనర్ బాలికలతో పాటు పలువురు బాధితులను రక్షించారు. నేరానికి సంబంధించిన కీలక ఆధారాలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం శాస్త్రీయ, సమగ్ర దర్యాప్తు చేపట్టి నిందితులపై ఛార్జిషీట్ దాఖలు చేశారు.నిందితుల దారుణ చర్యల కారణంగా శారీరక, మానసిక వేదనకు గురైన తొమ్మిది మంది బాధిత బాలికలకు ఒక్కొక్కరికి రూ.5 లక్షల చొప్పున మొత్తం రూ.45 లక్షల పరిహారం చెల్లించాలని న్యాయస్థానం ఆదేశించింది. చట్ట ప్రకారం ఇప్పటికే అందిన పరిహారానికి అదనంగా ఈ మొత్తాన్ని చెల్లించాలని పేర్కొంది. పరిహారం చెల్లింపు ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని డీఎల్ఎస్ఏ కార్యదర్శిని ఆదేశించింది. నిందితులపై విధించిన జరిమానా మొత్తాన్ని కూడా బాధితులకు పరిహారంగా అందించాలని కోర్టు సూచించింది.ఈ కేసులో డీఎస్పీలు సురేశ్‌బాబు, కె. శ్రీనివాసరావు, ఇన్‌స్పెక్టర్ కె. బాలరాం రెడ్డి దర్యాప్తు అధికారులు గా వ్యవహరించారు. కోర్టు డ్యూటీ అధికారిగా హెడ్ కానిస్టేబుల్ శాంతి శ్రీనివాస్‌రెడ్డి (హెచ్‌సీ-2044), కేసు మానిటరింగ్ అధికారిగా సీఐడీ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ కె. సత్యనారాయణరెడ్డి వ్యవహరించారు. ప్రభుత్వ న్యాయవాది, అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ మరెల్ల రమాదేవి కేసును వాదించారు .మహిళలు, బాలికల అక్రమ రవాణా, లైంగిక దోపిడీ వంటి తీవ్రమైన నేరాల్లో శాస్త్రీయ దర్యాప్తు, సమర్థవంతమైన ప్రాసిక్యూషన్‌తో నిందితులకు శిక్షలు పడేలా చేసిన ఈ తీర్పు కీలకమని సీఐడీ మహిళా భద్రత విభాగం పేర్కొంది. బాధితులకు రక్షణ, పునరావాసం, పరిహారం అందించడంతో పాటు నేరస్థులను చట్టం ముందు నిలబెట్టడమే లక్ష్యమన్నారు

## మహిళా అధికారులంటే అంత చులకనా..?: సుప్రీం కోర్టు

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**

ఓ మహిళా అధికారికి శాశ్వత కమిషన్ ఇవ్వకపోవడంపై భారత కోస్ట్ గార్డ్‌పై సుప్రీం కోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. మహిళా అధికారులను అవమానించడాన్ని తాము సహించబోమని పేర్కొంది. శాశ్వత కమిషన్ విషయంలో మంగళవారం ఐసీజీ విడుదల చేసిన విధానం అస్పష్టంగా, ఏకపక్షంగా ఉందని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చీ, జస్టిస్ వి.మోహనలతో కూడిన ధర్మాసనం వ్యాఖ్యానించింది. ప్రియాంక త్యాగి అనే అధికారిణికి శాశ్వత కమిషన్ ఇచ్చే అంశంపై రెండు వారాల్లోగా నిర్ణయం తీసుకోవాలని ఐసీజీని ఆదేశించింది. లేనిపక్షంలో.. కోర్టు స్వయంగా ఆదేశాలు జారీ చేస్తుందని స్పష్టం చేసింది.షార్ట్ సర్వీస్ కమిషన్ కింద ప్రియాంక త్యాగి ఐసీజీలో 14 ఏళ్లకుపైగా సేవలు అందించారు. అయితే, తనకు శాశ్వత కమిషన్ నిరాకరించి, సర్వీస్ నుంచి తొలగించాలనే అధికారుల నిర్ణయాన్ని సవాలు చేస్తూ ఆమె గతంలో సుప్రీం కోర్టు ను ఆశ్రయించారు. ఆమెను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని 2024లో సర్వోన్నత న్యాయస్థానం ఐసీజీని ఆదేశించింది. ఈ మేరకు బుధవారం ఆమె అండమాన్ నికోబార్‌లోని యూనిట్‌లో బాధ్యతలు స్వీకరించారు. అయితే.. శాశ్వత కమిషన్ మంజూరుకు సంబంధించి ఐసీజీ మంగళవారం ఓ విధానాన్ని ప్రకటించిందని.. అది చాలా అస్పష్టంగా, ఏకపక్షంగా ఉందని ఆమె తరఫు న్యాయవాది సుప్రీం కోర్టులో వాదించారు.దేశ తూర్పు ప్రాంతంలో సముద్ర గస్తీ కోసం మోహరించిన డోర్నియర్ విమానంలో మొట్టమొదటి మహిళా సిబ్బంది బృందానికి ప్రియాంక త్యాగి కెప్టెన్‌గా వ్యవహరించారు. సీనియారిటీ ప్రకారం అన్ని దళాల్లోనూ పురుష, మహిళా అధికారులతో పోలిస్తే ఆమెకే అత్యధికంగా దాదాపు 4,500 గంటల ఫ్లయింగ్ అనుభవం ఉందని ఆమె తరఫు న్యాయవాది ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. సముద్రంలో 300 మందికిపైగా ప్రాణాలను ఆమె కాపాడారని పేర్కొన్నారు. అయితే, ఈ వ్యవహారాన్ని స్త్రీ-పురుష వివక్ష అంశంగా పరిగణించవద్దని, మహిళా అధికారులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడంలో ఐసీజీకి కొన్ని పరిమితులు ఉన్నాయని అటార్నీ జనరల్ వెంకటరమణి వాదించారు."ఇటువంటి సాంకేతికపరమైన అభ్యంతరాలు చెప్పడం కుదరదు. ఆ మహిళా అధికారికి శాశ్వత కమిషన్ ఇవ్వాలని ఉన్నతాధికారులు ఎప్పటి నుంచో సిఫార్సు చేస్తూ వచ్చారు. కాబట్టి ఐసీజీ ఈ విషయాన్ని పరిగణించి ఉండాల్సింది. పురుషులకు శాశ్వత కమిషన్ ఇస్తున్నప్పుడు.. మహిళా అధికారులకు ఎందుకు ఇవ్వకూడదు? మహిళా అధికారులు ఈ విధంగా అవమానానికి గురికావడాన్ని అనుమతించలేం. కొద్దిగా క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించండి. రెండు వారాల్లోపు దీనిపై నిర్ణయం తీసుకోండి. లేదా మేమే తగిన ఆదేశాలు జారీ చేస్తాం" అని త్యాగి పిటిషన్‌పై విచారణను వాయిదా వేస్తూ ధర్మాసనం పేర్కొంది.

## ఎత్తం పంచాయతీ నిధుల దుర్వినియోగంపై
# ఇద్దరు కార్యదర్శుల సస్పెన్షన్

- ఎత్తం సర్పంచ్, ఉపసర్పంచ్‌లకు షోకాజ్ నోటీసులు
- జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్ చర్యలు



**నాగర్‌కర్నూల్ జిల్లా బ్యూరో న్యూస్, ఆగస్టు 19 (జనంసాక్షి):** గ్రామపంచాయతీ నిధుల వినియోగంలో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించారన్న ఆరోపణలపై నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్ చర్యలు చేపట్టారు. కొల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని కోడేరు మండలం ఎత్తం, ఎర్రన్నబావి తాండ గ్రామ పంచాయతీలకు చెందిన ఇద్దరు పంచాయతీ కార్యదర్శులను సస్పెండ్ చేస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇదే వ్యవహారంలో ఎత్తం గ్రామపంచాయతీ సర్పంచ్ బి.లక్ష్మి, ఉపసర్పంచ్ బి.ధర్మరా జులకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ప్రస్తుతం ఎత్తం గ్రామపంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న రమేష్‌తో పాటు, గతంలో ఎత్తం గ్రామపంచాయతీ కార్యదర్శిగా పనిచేసి ప్రస్తుతం ఎర్రన్నబావి తాండ గ్రామపంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న బి.నరసింహాను సస్పెండ్ చేశారు. ఎత్తం గ్రామపంచాయతీకి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి మంజూరైన అభివృద్ధి నిధుల వినియోగంలో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించారన్న ఆరోపణలు రావడంతో అధికారులు సమగ్రంగా విచారణ చేపట్టారు. నిధుల వినియోగం, అభివృద్ధి పనుల అమలు, బిల్లులు, చెల్లింపులు తదితర అంశాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించిన అనంతరం జిల్లా కలెక్టర్ ఈ చర్యలు తీసుకున్నట్లు జిల్లా పంచాయతీ అధికారి శ్రీరాములు తెలిపారు. గ్రామపంచాయతీలకు ప్రభుత్వం మంజూరు చేసే నిధులను ప్రజల అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన కోసం నిబంధనల మేరకు వినియోగించాల్సి ఉంటుందని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ప్రభుత్వ నిధుల వినియోగంలో పారదర్శకత, జవాబుదారీతనం తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఎత్తం గ్రామపంచాయతీ నిధుల వినియోగానికి సంబంధించిన రికార్డులు, బిల్లులు, చెల్లింపుల వివరాలు, అభివృద్ధి పనుల అమలు తదితర అంశాలపై విచారణ కొనసాగుతోందని జిల్లా పంచాయతీ అధికారి శ్రీరాములు తెలిపారు. విచారణలో నిధుల వినియోగంలో నిబంధనల ఉల్లంఘనలు నిర్ధారణ అయితే బాధ్యులపై మరిన్ని శాఖాపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉందని వెల్లడించారు.

# అన్‌ఫిట్ కోసం అప్లయ్ చేసుకున్న 2 వేల మందిని మెడికల్ ఆన్ ఫిట్ చేయాల్సిందే..

- వారి వారసులకు ఉద్యోగాలు వచ్చే వరకు పోరాడుతాం
- ఒక్క నెల మెడికల్ బోర్డు పెడితే సరిపోతుందా?
- అలియాస్ పేర్లతో ఇబ్బంది పడుతున్న కార్మికులకు కూనంనేని అన్యాయం చేస్తున్నరు?
- వాళ్ల సమస్యను పరిష్కరించాల్సింది పోయి దీక్ష చేస్తున్న వాళ్లను విరమింపజేస్తారా?
- ప్రభుత్వంతో మాట్లాడి అలియాస్ పేర్ల సమస్య పరిష్కరించాలి
- తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత




హైదరాబాద్ (జనంసాక్షి) : సింగరేణిలో అన్ ఫిట్ కోసం దరఖాస్తు చేసుకున్న 2 వేల మందిని అన్ ఫిట్ చేయాల్సిందేనని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. వారందరి అప్లికేషన్స్ పరిష్కారమయ్యే వరకు ప్రతినెలా మెడికల్ బోర్డు నిర్వహించాల్సిందేనన్నారు. ఈ అంశానికి సంబంధించి హెచ్ఎంఎస్ జనరల్ సెక్రటరీ రియాజ్ అహ్మద్, మాజీ మంత్రి బోడ జనార్దన్‌తో కలిసి బుధవారం వీడియో మెసేజ్ విడుదల చేశారు. గత నెలలో హెచ్ఎంఎస్, టీఆర్ఎస్ హెచ్చరికలతో ప్రభుత్వం దిగి వచ్చి మెడికల్ బోర్డు నిర్వహించిందన్నారు. కానీ.. ఒక్క నెలకు మాత్రమే దాన్ని పరిమితం చేయడం సరికాదన్నారు. మెడికల్ బోర్డు కోసం తాము నిరవధిక దీక్ష చేస్తామని హెచ్చరించిన కారణంగానే మెడికల్ బోర్డు ఏర్పాటు చేశారని చెప్పారు. డిపెండెంట్ ఉద్యోగాల విషయంలో కార్మికులకు అన్యాయం చేస్తే ఎట్టి పరిస్థితుల్లో ఊరుకునేది లేదని హెచ్చరించారు.

అలియాస్ పేర్ల అంశంలో ఉద్యోగాలు రాక ఇబ్బంది పడుతున్న యువమిత్రులకు కూనంనేని సాంబశివరావు అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. ఉద్యోగాల కోసం నిరాహార దీక్ష చేస్తున్న వారికి ఎలాంటి హామీ ఇవ్వకుండా ఎలా దీక్ష విరమింపజేస్తారని ప్రశ్నించారు. కూనంనేని ద్వంద్వ వైఖరిని కార్మికులు గమనిస్తారని చెప్పారు. కార్మిక యూనియన్ల హక్కులు కోల్పోయేందుకు కారణమైన వ్యక్తే కూనంనేని అని విమర్శించారు. ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్న ఆయన ప్రభుత్వంతో మాట్లాడి అలియాస్ పేర్ల సమస్యను పరిష్కరించాలని కోరారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలుకు ఆందోళనబాట పట్టిన ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు తెలిపారు. ఉద్యోగులకు ఇవ్వాల్సిన పెండింగ్ బిల్లుల చెల్లింపులు, ప్రమోషన్లు, ట్రాన్స్‌ఫర్లు సహా అన్ని సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

# ముఖ్యమంత్రి కాగానే కండ్లు నెత్తికెక్కినయా!

- రేవూరికి పరకాల తెలియదు, పరకాల ప్రజలకు రేవూరి తెలియదు
- కొండా మురళికి ఎమ్మెల్సీ ఇస్తానని మరిచిపోయావు
- పరకాల ఎమ్మెల్యేగా పక్కాగా పోటీ చేస్తా : కొండ సుస్మిత పటేల్



**వరంగల్ బ్యూరో, ఆగస్టు 19 ( జనం సాక్షి) :** రేవంత్ రెడ్డి నువ్వు ముఖ్యమంత్రి కాగానే నీ కళ్ళు నెత్తికెక్కినాయా అంటూ సీఎం రేవంత్ రెడ్డి పై కొండ దంపతుల కూతురు కొండ సుష్మిత పటేల్ ఫైర్ అయ్యారు. బుధవారం రాష్ట్ర అటవీ పర్యావరణ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ పుట్టినరోజు సందర్భంగా గీసుకొండ మండలం ఊకల హవేలీ ఎస్ఎస్ ఫంక్షన్ హాల్ కాంగ్రెస్ కార్యకర్తలు నాయకులు సర్పంచులు మాజీ సర్పంచుల తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సుస్మిత పటేల్ మాట్లాడుతూ రాబోయే ఎన్నికలలో మళ్లీ పరకాల నుండి రేవూరి ప్రకాష్ రెడ్డిని గెలిపించాలంటూ ప్రకటించావు, అసలు పరకాల ప్రజలకు రేవూరి తెలియదు, రేవూరికి పరకాల ప్రజలు తెలియదన్నారు. నాలుగైదు నియోజకవర్గాలు తిరిగి కారులో కూర్చోపెట్టుకున్న కొండా మురళి చేసిన సహాయాన్ని ఎందుకు గుర్తించడం లేదు అని ప్రశ్నించారు. నాకు భయం లేదు, మా నాన్న నాకు అలాగే చెప్పారు. ఇవాళ పోతే రేపు నాకు రెండు, నా కూతురు కొడుకు మా వాళ్లను చూసుకుంటారు అన్నారు. నేను ప్రజల కోసం పని చేసే దాన్ని మా నాన్న నన్ను భయం లేకుండా పెంచాడు అని సుస్మిత పటేల్ చెప్పారు. కొండా మురళికి ఎమ్మెల్సీ పదవి ఇస్తానని మరిచిపోయావు, ఒక బీసీ బిడ్డకు ఎందుకు ఎమ్మెల్సీ పదవి ఇవ్వలేదు అన్నారు. నువ్వు ముఖ్యమంత్రివా లేదా ప్రకాష్ రెడ్డి ముఖ్యమంత్రినా..? అని ప్రశ్నించారు. నీకు కాంగ్రెస్ సంస్కృతి వంటపట్టలేదు అని సీఎం ను టార్గెట్ చేశారు. కొండా దంపతులపై సవతి తల్లి ప్రేమ చూపించడం తగదన్నారు. 200 కోట్ల విలువైనటువంటి భూములను మీ తమ్ములకు దారతత్వం చేస్తున్నావ్ అని అన్నారు. నెక్స్ట్ టైం మీరు ఓడతారా గెలుస్తారా డౌటే అని స్పష్టం చేశారు. ఇక్కడ అంత పచ్చ కాంగ్రెస్ నడుస్తుందని సుస్మిత అన్నారు. త్వరలో పరకాలలో ఇల్లు కడుతున్న, అక్కడినుంచి పోటీ చేసి గెలిచి తీరుతానని కొండ సుస్మిత పటేల్ ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రడం భరత్, వీరగోని రాజ్ కుమార్, మాజీ కార్పొరేటర్లు, సర్పంచులు మాజీ సర్పంచ్లు పాల్గొన్నారు.

# రాష్ట్రవ్యాప్తంగా కాల్ అటెన్షన్ డే



**హైదరాబాద్ (జనంసాక్షి) :** నేషనల్ కో ఆర్డినేషన్ కమిటీ ఆఫ్ పెన్షనర్స్ అసోసియేషన్స్ (ఎన్సిసిపిఎ), ఫోరమ్ ఆఫ్ సివిల్ పెన్షనర్స్ అసోసియేషన్ (ఎఫ్సిపిఎ) పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా కాల్ అటెన్షన్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం పెన్షనర్ల హక్కులను కాలరాసే చట్టం వాలిడేషన్ ఆక్ట్ 2025ని రద్దు చేయాలనీ, 8వ వేతన సవరణ కమిషన్ టర్మ్స్ ఆఫ్ రిఫరెన్స్‌ని సవరించాలని కోరుతూ బిఎస్ఎన్ఎల్ భవన్, ఆదర్శ నగర్, హైదరాబాద్ లో పెద్ద ఎత్తున నిరసన ప్రదర్శన జరిగింది. ప్రదర్శన అనంతరం ద్వారా దేశ ప్రధాన మంత్రికి మెమొరాండం సమర్పించ నైనది. ఈ కార్యక్రమం ఎస్. మహేశ్ (ఏఐఆర్ బీఎస్ఎన్ఎల్ ఈడబ్ల్యూఏ), జి రమేష్ (ఎస్ఎన్‌పీడబ్ల్యూఏ), రాంచంద్రుడు (ఏఐబీడీపీఏ)ల అధ్యక్షతన, తెలంగాణ సిఓసి ప్ర.కా. సోమయ్యల ఆధ్వర్యంలో జరిగింది. టాప్ర ప్రతినిధులు ఎంఎన్ రెడ్డి, నారాయణ రెడ్డి, క్రిష్ణమూర్తి, ఎం. నరహరి, ఎం. అర్జున్, శివలింగం, ప్రభాకర్ జి అశోక్, క్రిష్ణారావు, సురేందర్ తదితరులు, జలాలొద్దిన్ పోస్టల్, శ్యాంసుందర్ రెడ్డి సిపిపిఎఫ్, ఎస్ఎస్ఆర్ ప్రసాద్ సిఐటియు, నాగేశ్వర్ రావు సిజిఈ కన్ఫడరేషన్ చైర్మెన్, గ్యాన ప్రకాశ్ ఇన్ కం టాక్స్, జె గోపాల్ రెడ్డి జెడ్ఏసి మెంబర్, అనిల్ కుమార్ రాజు ఏఐఆర్ఆర్ఎఫ్, రాజశేఖర్ రెడ్డి ఆర్డినెన్స్ తదితరులు పాల్గొన్నారు. బిఎస్.ఎన్.ఎల్. టెలిఫోన్ ఎక్ఛేంజ్ చందానగర్ వద్ద కె. వైకుంఠరావు, బి. రామారావు, వి. క్రిష్ణమోహన్ తదితరులు ప్రదర్శన నిర్వహించి బీఎస్ఎన్ఎల్ / ఎంటీఎన్ఎల్ పెన్షనర్లకు 01-01-2017 నుండి పెన్షన్ సవరణను మంజూరు చేయాలనీ, బ్యాంకు పెన్షనర్లకు పెన్షన్ అప్డేషన్ కల్పించాలని కోరారు. నిజామాబాద్ టెలిఫోన్ ఎక్ఛేంజ్ వద్ద కె. రాంమోహన్ రావు, ఈవిఎన్ నారాయణ, సిర్ప హన్మాండ్లు ఆధ్వర్యంలో ప్రదర్శన నిర్వహించి 8వ పే కమీషన్ సిఫార్సుల సమర్పణ మరియు వాటి అమలులో జరుగుతున్న భారీ ఆలస్యాన్ని దృష్టిలో ఉంచుకుని తాత్కాలిక ఉపశమనంగా తగిన మొత్తాన్ని మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. మంచిర్యాల బిఎస్ ఎన్ ఎల్ కార్యాలయం ఎదుట కె. ప్రభాకర్ తదితరులు మాట్లాడుతూ కమ్యూట్ చేసిన పెన్షన్ భాగాన్ని 10 సంవత్సరాల 8 నెలల తరువాత తిరిగి పునరుద్ధరించాలనీ, అదనపు పెన్షన్ కు సంబంధించి పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ చేసిన సిఫార్సులను అమలు చేయాలని కోరారు. నాగర్ కర్నూల్ జిల్లా కల్వకుర్తిలో జి అంజనయ్య ఆధ్వర్యంలో ప్రదర్శన నిర్వహించి బిఎస్ఎన్ఎల్ ఎసి.డి.ఎం ద్వారా ప్రధాన మంత్రికి మెమొరాండం సమర్పిస్తూ కోవిడ్ కాలంలోని 18 నెలల డిఏ బకాయిలను విడుదల చేయాలనీ, అప్పుడే రద్దు చేసిన రైల్వే ప్రయాణ రాయితీలను పునరుద్దరించాలని డిమాండ్ చేశారు. ఖమ్మం జిల్లాలో ఎల్ గోపిచంద్, వై రవికుమార్ల ఆధ్వర్యంలో బిఎస్ఎన్ఎల్ కార్యాలయం ముందు ప్రదర్శన చేసి ఎన్‌పీఎస్, యూపీఎస్‌ను రద్దు చేసి, ఓపీఎస్‌ను (పాత పెన్షన్ విధానం) పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ అన్ని కేంద్రాలలో కేంద్ర ప్రభుత్వ పెన్షనర్లు, రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లు, ఈపిఎస్ పెన్షనర్లు అందరూ కలిసి కార్యక్రమం నిర్వహించారు.

# దేశ ఇంధన భద్రతకు బొగ్గుతోపాటు పునరుత్పాదక విద్యుత్‌లోనూ సింగరేణి కృషి




- రాష్ట్ర విద్యుత్ అవసరాలు తీర్చడానికి రాష్ట్ర జెన్ కో, ట్రాన్స్ కో కలిసి సమష్టిగా ముందుకు
- ఇండియన్ ఎనర్జీ సమ్మిట్ అండ్ ఎక్స్ పో గోష్ఠి లో సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి

**హైదరాబాద్ (జనంసాక్షి) :** రాష్ట్ర దేశ ఇంధన భద్రతకు సింగరేణి సంస్థ తగినంత బొగ్గును అందించడంతో పాటు పునరుత్పాతక విద్యుత్తు రంగంలో కూడా తన వంతు కృషి చేస్తుందని సింగరేణి సంస్థ ఛైర్మన్ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి తెలిపారు. హైదరాబాద్ లో జరుగుతున్న ఇండియన్ ఎనర్జీ సమ్మిట్ అండ్ ఎక్స్ పో కార్యక్రమంలో భాగంగా బుధవారం జరిగిన భారత ఇంధన భద్రత విద్యుత్ ఉత్పత్తి అనే గోష్టిలో ఆయన పాల్గొన్నారు.

ప్రభుత్వ సంస్థ అయిన సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ దశాబ్దాల కాలంగా దేశ ఇంధన అవసరాలకు తనవంతుగా బొగ్గు అందిస్తూ వస్తుందని, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశం మేరకు రాష్ట్ర విద్యుత్ అవసరాలు తీర్చడానికి రాష్ట్ర జెన్ కో మరియు ట్రాన్స్ కో కలిసి సమష్టిగా కృషి చేస్తుందన్నారు. సింగరేణి సంస్థ తన వ్యాపార విస్తరణ చర్యలో భాగంగా థర్మల్ విద్యుత్, సోలార్ విద్యుత్ మరియు క్రిటికల్ మినరల్ రంగంలోకి కూడా ప్రవేశించిందని, అయినప్పటికీ దేశంలో బొగ్గు ఆధారిత విద్యుత్తు ఉత్పత్తికి మరో నాలుగు దశాబ్దాల పాటు డిమాండ్ ఉండే అవకాశం ఉందన్నారు. కనుక సింగరేణి సంస్థ రానున్న కాలంలో బొగ్గు ఉత్పత్తి పెంచడానికి కృషి చేస్తుందని అలాగే పునరుత్పాతక ఇంధన రంగంలో కూడా తన వంతు బాధ్యత నిర్వహిస్తుందని తెలిపారు.

ఈ చర్చ గోష్టికి ప్రొఫెసర్ పవన్ కుమార్ పరనంది సమన్వయ కర్తగా వ్యవహరించారు. ఈ ఎనర్జీ సమ్మిట్ కు తెలంగాణ ఇంధన శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ శ్రీ నవీన్ మిట్టల్ హాజరుకాగా... ప్యానెల్ డిస్కషన్ లో సింగరేణి ఛైర్మన్ తో పాటు తెలంగాణ పవర్ జనరేషన్ కార్పొరేషన్ సీఎండీ డాక్టర్ ఎస్. హరీష్, రాజస్థాన్ రాజ్య విద్యుత్ ఉత్పాదన నిగం లిమిటెడ్ సీఎండీ శ్రీ దేవేంద్ర శృంగి, ఎన్టీపీసీ సౌత్ రీజినల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అజయ్ శర్మ, గ్రిడ్ కో లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సత్యప్రియ రథ్, ఒడిశా పవర్ జనరేషన్ కార్పొరేషన్ లిమిటెడ్ ఎండీ శ్రీ కేదార్ రంజన్ పాండు, ఛత్తీస్ ఘడ్ స్టేట్ పవర్ జనరేషన్ కంపెనీ లిమిటెడ్ ఎండీ శ్రీ సంజీవ్ కుమార్ కటియార్ తదితరులు పాల్గొన్నారు.



# సూర్యాపేట ప్రజల చిరకాల ఆకాంక్ష నెరవేర్చాలి

- మొదటి అలైన్ మెంట్ నే కొనసాగించాలి
- తెలంగాణ యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనంతుల మధు
- బుల్లెట్ ట్రైన్ సాధనకు ఆర్యవైశ్యులు చేపట్టిన దీక్ష కు సంఘీభావం

**సూర్యాపేట (జనంసాక్షి) :** సూర్యాపేట ప్రజల చిరకాల ఆకాంక్ష నెరవేర్చాలని, మొదటి అలైన్ మెంట్ నే కొనసాగించాలని తెలంగాణ యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనంతుల మధు డిమాండ్ చేశారు. సూర్యాపేట మీదుగా బుల్లెట్ ట్రైన్ సాధనకై అఖిలపక్ష దీక్షలో 6వ, రోజు నిరవధిక రిలే నిరాహార దీక్ష చేపట్టిన సూర్యాపేట ఆర్యవైశ్య సంఘము నాయకులు బండారు రాజా ఆర్య వైశ్య మహాసభ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, వెంపటి సురేష్ పొలిటికల్ రాష్ట్ర వైస్ చైర్మన్, తప్పీ గాంధీ , వెంపటి శబరి నాథ్, ఈగ వేంకటేశ్వర్లు, దయాకర్, వంగవీటి రమేష్, శంకర్, రంగారావు, తోట శ్యాం లకు తెలంగాణ యువజన సంఘము రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనంతుల మధు పూల మాల వేసి సంఘీభావం ప్రకటించారు. అనంతరం మాట్లాడుతూ సూర్యాపేట మీదుగా మొదటి అలైన్ మెంట్ లో కేంద్ర ప్రభుత్వం బుల్లెట్ ట్రైన్ ప్రకటించిన, రాష్ట్ర ప్రభుత్వం కుంటి సాకులు చూపుతూ అలైన్ మెంట్ అమరావతి నుండి వాడపల్లి వయా హాలియా, శంషాబాద్ గా బుల్లెట్ ట్రైన్ రూట్ మార్చడం సూర్యాపేట ప్రాంత అభివృద్ధి ని అడ్డుకోవడమే అని అన్నారు. రెండు రాష్ట్రల రాజధానుల మధ్య వేగంగా అభివృద్ధి చెందుతున్న సూర్యాపేట ప్రాంతం, రైల్వే లైన్, స్టేషన్ ఏర్పాటు చేస్తే వాణిజ్య పరంగా మరింత అభివృద్ధి చెందుతుందని అన్నారు. మొదటి అలైన్ మెంట్ నే కొనసాగించాలని డిమాండ్ చేసారు. అన్ని వర్గాల ప్రజలను ఐక్యం చేస్తూ ఉద్యమన్ని మరింతగా ఉదృతం చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ యువజన సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి ఎనిగా సంతోష్ రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు బషీపంగు సునీల్, జిల్లా ప్రధాన కార్యదర్శి గుగులోత్ సురేష్ నాయక్, జిల్లా ఉపాధ్యక్షులు దారావత్ శివ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థి సంఘాల నాయకులపై కేసులు ఎత్తివేయాలి

- పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు పి.మహేష్, ప్రధాన కార్యదర్శి పొడపంగి నాగరాజు

**హైదరాబాద్ (జనంసాక్షి) :** ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) తెలంగాణ రాష్ట్ర కార్యవర్గం ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రాజ్యసభ సభ్యులు వి హనుమంతరావుని వారి నివాసంలో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థి నాయకుల పై పెట్టిన కేసులను ఎత్తివేయాలని వెంటనే తెలంగాణ డిజిపి సీవీ ఆనంద్‌తో ఫోన్లో మాట్లాడారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షులు పి.మహేష్,ప్రధాన కార్యదర్శి పొడపంగి నాగరాజు మాట్లాడుతూ నిజామాబాద్ జిల్లాలో విద్యార్థి ఉద్యమాన్ని అణచివేయడానికి కుట్రలు జరుగుతున్నాయని అన్నారు.విద్యార్థి సంఘాల నాయకులపై తప్పుడు ఆరోపణలు చేస్తూ తప్పుడు కేసులు బణాయించారని అన్నారు.విద్యార్థి సంఘాల నాయకులపై మోపిన అక్రమ కేసులను పి.డి.ఎస్.యూ రాష్ట్ర కార్యవర్గం తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో ఎక్కడ లేని విధంగా నిజామాబాద్ జిల్లాలో విద్యార్థి ఉద్యమంపై ఉన్న నిర్బంధంపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించాలని డిమాండ్ చేశారు. నీట్ పేపర్ లీక్ కు వ్యతిరేకంగా జూలై 24వ తేదీన జరిగిన రాష్ట్ర వ్యాప్త విద్యా సంస్థల బంద్ కు పీడీఎస్‌యూ, ఎన్ఎస్‌యూఐ, ఎస్ఎఫ్ఐ, ఏఐఎస?టఫ్, ఏఐఎఫ్‌డీఎస్‌యూ, ఏఐఎస్‌బీ, ఏఐపీఎస్‌యూ విద్యార్థి సంఘాలు పిలుపునిచ్చాయని బంద్ కు సహకరించాలని కోరుతూ బంద్ సందర్భంగా నగరంలోని జిల్లా కేంద్రంలో ఉన్న రెయన్స్ హోటల్ మేనేజ్మెంట్ కాలేజీకి వెళ్లగా అక్కడ మీరు మా కాలేజీలకే వస్తారా మేము బంద్ చేయము అని అంటూ విద్యార్థి సంఘ నాయకుల నాయకులపై దౌర్జన్యానికి పూనుకున్నారు. నీట్ పేపర్ లీక్ అవుతే మాకేంటి ?. పిరికి వాళ్ళు ఆత్మహత్యలు చేసుకుంటారు అంటూ ఎగతాళి చేస్తూ బంద్ కు సహకరించాం , పోలీస్ కమిషనర్ మాకు బాగా తెలుసని బంద్ కు మేం సహకరించాం అన్నారు. బంద్ చేయమని అంటే డబ్బులు అడిగామని ఆరోపణ చేస్తూ కేసులు పెడతామని, చేతులు విరిగాయని కాళ్ళు విరిగాయని పాత ఎక్స్‌రేలు తీసుకువచ్చి కేసులు పెడతామని యాజమాన్యం బెదిరించింది. యాజమాన్యంపై పోలీస్ స్టేషన్ లో విద్యార్థి సంఘాలు కేసు పెడితే దాని మీద కేసు బుక్ చేయలేదు కానీ, విద్యార్థి సంఘ నాయకులపై 329(4), 292, 351(2), 324(4), 308(2), 126, ఆర్/డబ్ల్యూ 3(5) బీఎన్ఎస్ తప్పుడు కేసులు బనాయించారు. తప్పుడు కేసులను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పి.డి.ఎస్.యూ రాష్ట్ర ఉపాధ్యక్షులు బోనగిరి మధు, జన్నారపు రాజేశ్వర్,డి.శ్రీకాంత్, కే.శ్రీనివాస్. రాష్ట్ర నాయకులు తీగల శ్యామ్ పాల్గొన్నారు.

# బ్యాంకుల రుణాలతో తెలంగాణ ఆర్థిక ప్రగతికి ఊతం

- ఎస్ఎల్‌బీసీ 50వ త్రైమాసిక సమావేశంలో రూ.12.76 లక్షల కోట్లకు చేరిన బ్యాంకు రుణాలు




**హైదరాబాద్, ఆగస్టు 19 (జనంసాక్షి) :** తెలంగాణలో బ్యాంకుల మొత్తం డిపాజిట్లు రూ.9,92,947 కోట్లకు, అడ్వాన్సులు రూ.12,76,748 కోట్లకు చేరాయని రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ (ఎస్ఎల్‌బీసీ) వెల్లడించింది. జూన్ 2026తో ముగిసిన త్రైమాసికానికి 50వ సమీక్షా సమావేశం ప్రజాభవన్‌లో బుధవారం జరిగింది. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, పంచాయతీరాజ్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.దాన కిషోర్, ఎస్ఈఆర్‌పీ సీఈఓ డి.దివ్య, ఉప ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి డి.కృష్ణ భాస్కర్, కేంద్ర ఆర్థిక సేవల శాఖ డైరెక్టర్ మానస గంగోత్రి కాటా, ఆర్‌బీఐ హైదరాబాద్ ప్రాంతీయ సంచాలకుడు చిన్మోయ్ కుమార్, నాబార్డు సీజీఎం బి.ఉదయ భాస్కర్, ఎస్‌బీఐ హైదరాబాద్ సర్కిల్ సీజీఎం, ఎస్ఎల్‌బీసీ చైర్మన్ నీలేష్ ద్వివేది, ఎస్ఎల్‌బీసీ కన్వీనర్ సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. త్రైమాసికంలో రూ.20,069 కోట్ల స్వల్పకాలిక వ్యవసాయ రుణాలు, రూ.32,268 కోట్ల వ్యవసాయ పెట్టుబడి రుణాలు, రూ.91,374 కోట్ల ఎంఎస్ఎంఈ రుణాలు పంపిణీ అయ్యాయి. ప్రాధాన్యతా రంగానికి రూ.1,46,096 కోట్లు అందించారు. సీడీ నిష్పత్తి 128.58 శాతంగా నమోదైంది. రాష్ట్రంలో 133.57 లక్షల ప్రధాన్‌మంత్రి జనధన్ ఖాతాలు ఉండగా, 112.44 లక్షల ఖాతాలకు ఆధార్ అనుసంధానం చేశారు. పీఎంఎస్‌బీవైలో 206.73 లక్షలు, పీఎంజేజేబీవైలో 109.52 లక్షలు, అటల్ పెన్షన్ యోజనలో 28.99 లక్షల మంది చేరారు. 2034 నాటికి 1 ట్రిలియన్ డాలర్లు, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యాలకు బ్యాంకులు సహకరించాలని భట్టి విక్రమార్క కోరారు. ప్రస్తుతం 10-11 శాతం వృద్ధి రేటును 13 శాతానికి పెంచేందుకు లక్షిత రుణాలు అవసరమని సుల్తానియా అన్నారు. డీసీసీ సమావేశాలకు సీనియర్ అధికారులను నియమించాలని, రుణ వినియోగ ప్రాంతం ఆధారంగా సీడీ నిష్పత్తిని నివేదించాలని ఆర్‌బీఐ అధికారి చిన్మోయ్ కుమార్ సూచించారు.

జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం
20 ఆగస్టు 2026

# విద్యార్థి యువత సమస్యలపై శంఖారావం

సంపాదకీయం

దేశంలో యువత గొంతు మళ్లీ వినిపిస్తోంది. పరీక్షల్లో అవకతవకలు, పేపర్ లీకులు, నియామకాల్లో జాప్యం, పెరుగుతున్న నిరుద్యోగం, విద్య భారం మోయలేని స్థాయికి చేరిన ఖర్చులు ఇవన్నీ కలిపి ఇవాళ యువతను వీధుల్లోకి తీసుకొచ్చాయి. ఢిల్లీ జంతర్ మంతర్ వేదికగా సాగిన ఆందోళనలు అందుకు ప్రతిబింబం మాత్రమే. ఈ పోరాటానికి కేంద్ర మంత్రి రాజీనామాతో ఒక తక్షణ ఫలితం దక్కిందని చెప్పుకుంటున్నా, అసలు ప్రశ్న అంతకుమించి పెద్దది విద్యార్థి లోకపు ఆవేదన కేవలం ఒక ఉదంతంతో సద్దుమణిగే అంశమా, లేక దేశ రాజకీయ దిశను మార్చే ఉద్యమంగా మారబోతోందా అనేది. ఈ నేపథ్యంలోనే కాంగ్రెస్ పార్టీ వేసిన అడుగు ప్రాధాన్యం సంతరించుకుంటోంది.


ఢిల్లీలో మల్లికార్జున ఖర్గే అధ్యక్షతన జరిగిన సీడబ్ల్యూసీ భేటీలో యువత సమస్యలను జాతీయ అజెండాగా మలచాలని పార్టీ నిర్ణయించడం యాదృచ్ఛికం కాదు. రాహుల్‌గాంధీ ప్రారంభించిన 'ఛాత్రోం కీ గూంజ్' కార్యక్రమాన్ని 800 నగరాలకు విస్తరించాలన్న నిర్ణయం, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు నెలరోజుల పాటు విద్యార్థి సంఘాలు, విద్యావేత్తలతో సంప్రదింపులు జరిపి రాష్ట్రాలవారీగా విద్యా సంస్కరణల ప్రణాళికలు రూపొందించాలన్న సూచన. ఇవి కేవలం సానుభూతి ప్రకటనలు కాదు, దీర్ఘకాలిక వ్యూహంలో భాగంగా కనిపిస్తున్నాయి.

రాహుల్‌గాంధీని కేంద్రంగా చేసుకుని ఈ ఉద్యమాన్ని నడపాలన్న కాంగ్రెస్ ఆలోచన స్పష్టంగా కనిపిస్తోంది. గత కొన్నేళ్లుగా 'భారత్ జోడో యాత్ర' నుంచి మొదలు వరుస యాత్రల ద్వారా ప్రజల్లోకి వెళ్లే ప్రయత్నం చేసిన రాహుల్‌కు, యువత సమస్యలు ఒక సహజ వేదికగా కనిపిస్తున్నాయి. నిరుద్యోగం, విద్యా అవకతవకలు అనేవి కులం, మతం, ప్రాంతం అనే విభజనలకు అతీతంగా ప్రతి కుటుంబాన్ని తాకే అంశాలు. ఈ అంశాన్ని బలంగా పట్టుకుంటే, పార్టీకి కొత్త ఊపిరి పోసే అవకాశం ఉందని కాంగ్రెస్ వ్యూహకర్తలు భావిస్తున్నట్టు కనిపిస్తోంది. అందుకే రాహుల్‌ను ఈ ఉద్యమానికి ముఖచిత్రంగా నిలబెట్టే ప్రయత్నం జరుగుతోంది. అయితే ఇది అనుకున్నంత సులభమైన దారి కాదు. యువత ఆగ్రహం చాలా సందర్భాల్లో పార్టీ రహితంగా, స్వతంత్రంగా పుడుతుంది. అలాంటి ఉద్యమాన్ని ఒక రాజకీయ పార్టీ తన గొడుగు కిందకు తీసుకురావాలని ప్రయత్నించినప్పుడు, అది కృత్రిమంగా కనిపించే ప్రమాదం ఉంటుంది. కాంగ్రెస్ చిత్తశుద్ధితో ముందుకెళ్తే, పాలిత రాష్ట్రాల్లో వాస్తవ సంస్కరణలు అమలు చేసి చూపిస్తే మాత్రమే ఈ నమ్మకం నిలబడుతుంది. కేవలం నినాదాలతో, సభలతో ఆగిపోతే, ఇది మరో ఎన్నికల ప్రచార ఎత్తుగడగానే మిగిలిపోతుంది. కేంద్ర మంత్రి రాజీనామాను ఒక విజయంగా చూపించడం భావోద్వేగపరంగా ఉపయోగపడొచ్చు, కానీ అసలు సవాలు వేరు. విద్యా వ్యవస్థలో లోతైన లోపాలను సరిదిద్దడం, యువతకు నిజమైన ఉపాధి అవకాశాలు కల్పించడం. ఈ దిశగా కాంగ్రెస్ ప్రతిపాదించిన సంప్రదింపుల ప్రక్రియ, రాష్ట్రాలవారీ ప్రణాళికలు హర్షణీయమే. కానీ వాటిని ఆచరణలో ఎంత నిబద్ధతతో అమలు చేస్తారన్నదే అసలు పరీక్ష.

రాహుల్‌గాంధీని 'రైజింగ్ సన్'గా నిలబెట్టాలన్న కాంగ్రెస్ తపన అర్థం చేసుకోదగినదే. కానీ సూర్యోదయం అవ్వాలంటే వెలుగు కేవలం నాయకుడి ముఖం మీద పడితే సరిపోదు. అది సామాన్య విద్యార్థి, నిరుద్యోగ యువకుడి జీవితాన్ని కూడా తాకాలి. ఆ పరీక్షలో నెగ్గితేనే ఈ శంఖారావం అర్థవంతమైన ఉద్యమంగా చరిత్రలో నిలుస్తుంది.

# దిమాగీ నక్సల్

## భారత యువత ధిక్కారానికి భయపడుతున్న నియంత



నరేంద్ర మోడీ మళ్ళీ ఎర్రకోట బురుజుల మీద నుంచి స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగం ఇచ్చారు – వరుసగా ఇది ఆయన పదమూడో ఆగస్టు 15 ప్రసంగం. 2014లో అధికారంలోకి వచ్చిన తొలి కొన్నేళ్లలో ఆయన ప్రసంగాల్లో దేశీయ, అంతర్జాతీయ పరిణామాల ప్రస్తావన కొంతైనా ఉండేది, స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు అనే మైలురాయి కూడా కనిపించేది. 2022 తర్వాత ఆయన గోల్ పోస్ట్‌ను నేరుగా 2047కి మార్చేశారు. ఇప్పుడు ప్రజల మనసుల్లో ఏముందో, తన ప్రభుత్వం కూడా కొట్టిపారేయలేని అంశాల గురించి ఆయన నోరు మెదపడం లేదు. ఉదాహరణకు – విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను తీసివేసేలా చేసిన అపూర్వమైన జంతర్ మంతర్ నిరసనల ప్రస్తావనే ఆయన 80 నిమిషాల ప్రసంగంలో లేదు. మంత్రుల రాజీనామా అనేది బీజేపీ సంస్కృతికి పరాయిదని పొగరుగా ప్రకటించిన తర్వాత ఆ మంత్రిని తీసివేయాల్సి వచ్చింది.

కానీ జంతర్ మంతర్ నీడ ఆయన మొత్తం ప్రసంగాన్ని కమ్మేసింది. జెన్ జీ అనే మాటను ఒక్కసారి కూడా వాడకుండానే మోడీ యువత గురించి 52 సార్లు ప్రస్తావించారు. అయితే జెన్ ఆల్ఫా వాళ్లను కూడా ఆందోళనలోకి దించిన కుప్పకూలిపోతున్న విద్యా, పరీక్షల వ్యవస్థ గురించి ఆయన మొహం చాటేశారు. యువతకు ఆయన ఇచ్చిన హామీ – ఏఐ శిక్షణ ఇచ్చి ఏటా కోటి ఉద్యోగాలు సృష్టిస్తామన్న పాత, అస్పష్టమైన వాగ్దానమే. వాస్తవానికి రంగాలవారీగా ఉద్యోగాలు కోల్పోతున్నారు, ఆ నష్టానికి కారణం ఏఐనే అని కూడా విశ్లేషణలు చెబుతున్నాయి. నీతి ఆయోగ్ లెక్కల ప్రకారం రోజుకు సగటున 25 ప్రభుత్వ పాఠశాలలు మూతపడుతుంటే, ఆయన మాత్రం ఉచిత ఆన్‌లైన్ కోచింగ్ గురించి మాట్లాడారు. స్పెల్లింగ్ తప్పులు, పేర్లు సరిపోలకపోవడం లాంటి చిల్లర సాకులతో లక్షలాది మంది ఓటర్లను జాబితా నుంచి తొలగించిన ాౌ×= గురించి, బిహార్ ఎన్నికలకు ముందు తానే వాగ్దానం చేసిన కుల గణన గురించి ఆయన ఒక్క మాట కూడా మాట్లాడలేదు. పైగా కుటుంబ వివరాలు అప్‌లోడ్ చేసి జనగణనలో సహకరించమని యువతకు పిలుపునిచ్చారు.

జెన్ జీ గురించి, జంతర్ మంతర్ గురించి మోడీ మౌనం వహించినా, సంఘ్ పరివార్ ద్వేషపూరిత, విభజన రాజకీయాల నిఘంటువుకు కొత్త పదాన్ని జోడించారు – "దిమాగీ నక్సల్" అంటే మేధో నక్సల్. టుక్డే టుక్డే గ్యాంగ్, అర్బన్ నక్సల్, ఆందోళన్‌జీవి, దేశద్రోహి – ఇలాంటి ముద్రల వరసలో ఇది తాజా చేరిక. కిరణ్ రిజిజు తర్వాత ఇచ్చిన వివరణలో ఈ దిమాగీ నక్సల్ ముద్రను మావోయిస్టు మద్దతుదారులకు, ఆర్టికల్ 370కి మద్దతిచ్చే వారికి మాత్రమే పరిమితం చేసే ప్రయత్నం చేశారు. కానీ మోడీ తన ప్రసంగంలో ఈ ముద్రను గతంలోకి కూడా వర్తింపజేశారు – యూపీఏ కాలంలో ప్రభుత్వ విధానాలకు సలహాలిచ్చిన మేధావులపై కూడా దీన్ని ప్రయోగించారు.

నిజానికి ఆయన ఉద్దేశం స్పష్టమే – యూపీఏ హయాంలో పార్లమెంటులో వామపక్షాల బలం, నేషనల్ అడ్వైజరీ కౌన్సిల్ పాత్ర గురించే ఆయన మాట్లాడుతున్నారు. నరేగా, అటవీ హక్కుల చట్టం, సమాచార హక్కు చట్టం, ఆహార భద్రతా చట్టం, భూసేకరణలో సరైన పరిహారం–పునరావాసం కల్పించే చట్టం లాంటి ప్రజా సంక్షేమ, పౌర హక్కుల చట్టాలు ఆ కౌన్సిల్ చొరవతోనే వచ్చాయి. ప్రజలకు హక్కులిచ్చే, విధాన నిర్ణయాల్లో పౌరులకు మాట చెప్పే అవకాశం కల్పించే ప్రతి చట్టం మీదా మోడీకి కిటకిటలాడే అభ్యంతరం. 2014లోనే ఆయన బ్రిటిష్ కాలం నాటి 1894 చట్టం స్థానంలో వచ్చిన 2013 భూసేకరణ చట్టాన్ని నీరుగార్చే ప్రయత్నం మొదలుపెట్టారు – సామాజిక, పర్యావరణ అనుమతులు, ప్రజల సమ్మతి తీసుకోవడం, పరిహారం, పునరావాసం లాంటి నిబంధనలున్న ఆ చట్టాన్ని రద్దు చేయాలని చూశారు. ఆ తర్వాత ఏళ్లుగా సమాచార హక్కు చట్టాన్ని క్రమంగా బలహీనపరిచారు, అటవీ హక్కుల చట్టాన్ని అమలు చేయకుండా చంపేశారు. ఇప్పుడైతే మనరేగా స్థానంలో కొత్త చట్టం తెచ్చి, ఉపాధి హామీ చట్టం ప్రాథమిక లక్షణాలన్నింటినీ తలకిందులు చేశారు.

హిమాలయ ప్రాంతంలో కొండచరియలు విరిగిపడడం, వాతావరణ విపత్తులు పెరుగుతున్న ఈ కాలంలో, దేశ రాజధాని ప్రాంతంలో వాయు కాలుష్యం ప్రమాదకర స్థాయికి చేరుతున్న వేళ, అడవుల నరికివేతకు వ్యతిరేకంగా, తీర ప్రాంత పర్యావరణంపై దాడులకు వ్యతిరేకంగా ప్రజా నిరసనలు పెరుగుతున్న సమయంలో – మోడీ తన ప్రభుత్వం పర్యావరణ నిబంధనలను బాహాటంగా తుంగలో తొక్కిందని గర్వంగా చెప్పుకున్నారు. దేశ తీరప్రాంతంలో 99% భాగాన్ని 'నో–గో జోన్' నుంచి 'గో–అహెడ్ జోన్'గా మార్చామని ఆయన చెప్పుకున్నారు – కానీ ఆ తీరప్రాంతం ఎక్కువగా అదానీ గ్రూప్ చేతుల్లోకి వెళ్తోందని, భారత మౌలిక సదుపాయాలు, ఓడరేవులపై దాని పట్టు మరింత బిగుస్తోందని మాత్రం చెప్పలేదు.

దిమాగీ నక్సల్ అనే పదం 'దిమాగ్' అంటే మెదడు, మేధస్సు, మేధావుల పాత్రను సూచిస్తుంది – సామాజిక, సాంస్కృతిక, రాజకీయ విషయాల్లో వీరి పాత్రను మోడీ ప్రభుత్వం చాలా భయపడుతోంది, దాన్ని ఎలాగైనా అణచివేయాలని చూస్తోంది. ఈ పదం పుట్టకముందే నరేంద్ర దభోల్కర్, గోవింద్ పన్సారే, ఎం.ఎం. కల్బుర్గి, గౌరీ లంకేశ్ లాంటి రచయితల హత్యలను మనం చూశాం. ప్రముఖ మేధావులు, సాంస్కృతిక వ్యక్తులు, మానవ హక్కుల కార్యకర్తలు ఎందరో సుదీర్ఘ జైలు జీవితం, వేధింపులు, నిర్బంధం అనుభవించడం చూశాం.

మోడీ స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో దిమాగీ నక్సల్స్‌ను గుర్తించి, వేరు చేయాలన్న పిలుపు – రాజ్యానికి, సంఘ్ పరివార్ గూండా బృందాలకు అసమ్మతి గొంతులను, కార్యకర్తలను లక్ష్యంగా చేసుకోమని ఇచ్చిన ప్రమాదకరమైన సంకేతం. "వైబ్రెంట్ సివిల్ డిఫెన్స్ నెట్‌వర్క్" ఏర్పాటు చేస్తామని ఆయన చెప్పడం – ప్రజలపై మరింత అణచివేత శక్తిని ప్రయోగిస్తారన్న హెచ్చరికే కావచ్చు. రిటైర్డ్ అగ్నివీర్‌లను వాడుకుని కొత్త మిలీషియా తయారు చేయడం, సంఘ్ పరివార్ గూండా బృందాలకు చట్టబద్ధత కల్పించి ప్రజా ఉద్యమాలను అణచివేయడానికి పబ్లిక్–ప్రైవేట్ భాగస్వామ్యం పెంచడం లాంటివి జరగొచ్చు. ప్రజల మెదళ్లను కూడా పోలీసింగ్ చేయాలన్న ఈ హాస్యాస్పదమైన ఆలోచన – సంఘ్ పరివార్ మామూలుగానే ప్రజల మనసులను నియంత్రించడం, వారి భావోద్వేగాలతో ఆడుకోవడం, వారి భావ ప్రకటనను కట్టడి చేయడం అనే పద్ధతి నుంచే పుట్టింది. జార్జ్ ఆర్వెల్ తన క్లాసిక్ నవల "నైన్టీన్ ఎయిటీ ఫోర్"లో వర్ణించిన నియంతృత్వ డిస్టోపియాలోని 'థాట్ పోలీస్' అనే భావనను ఇది గుర్తుకు తెస్తుంది.

పశ్చిమ బెంగాల్ బంకురా జిల్లాలో షేక్ మొహమ్మద్ హఫీజ్‌పై బీజేపీ గూండాల దాడి, తమ గ్రామంలోని ప్రాథమిక పాఠశాల దుస్థితిని బయటపెట్టినందుకు ఆయన తండ్రి మొహమ్మద్ మఫీక్‌ను హత్య చేయడం – దేశవ్యాప్తంగా యువతలో వ్యాపిస్తున్న ధైర్యం, ధిక్కారం, ప్రతిఘటన స్ఫూర్తిని అణచివేయడానికి సంఘ్–బీజేపీ వ్యవస్థ ఎలాంటి హింస, భయోత్పాతానికి తెగబడనుందో చూపే ఒక సూచన మాత్రమే. కానీ 'కాక్‌రోచ్' లాంటి అవమానకరమైన, అమానవీయమైన మాటను గర్వించదగ్గ గుర్తింపుగా, నిరసన వేదికగా మార్చుకున్న ఈ తరం – మోడీ కుటిలమైన "దిమాగీ నక్సల్" కొత్త పదంతో భయపడేదీ, వెనక్కి తగ్గేదీ కాదు.

ఫాసిస్టులు ఎప్పుడూ అంతర్గత శత్రువుల కోసం వెతుకుతూనే ఉంటారు. కొత్త పదం అవసరమైందంటే, పాత పదజాలం పనిచేయడం లేదని ఒప్పుకున్నట్టే. నక్సలిజం అనేది కమ్యూనిజానికి భారతీయ మారుపేరు మాత్రమే. 'దిమాగ్'ను నక్సలిజంతో ముడిపెట్టడం ద్వారా – ఫాసిస్టు దూకుడు, విఫలమైన పాలన, కార్పొరేట్ దోపిడీ నిండిన ఈ వాతావరణంలో కమ్యూనిస్టు ఆలోచనలకు పెరుగుతున్న ఆదరణను, ప్రభావాన్ని మోడీ ఒక రకంగా ఒప్పుకున్నట్టే అయింది. మూఢనమ్మకం, గుడ్డి భక్తిపై మేధస్సు, మనస్సాక్షి గెలవాలి. మనసు నిజంగానే భయం లేకుండా ఉండాలి.

కామ్రేడ్ దీపాంకర్ భట్టాచార్య
జాతీయ ప్రధాన కార్యదర్శి
సిపిఐ (యమ్ యల్) లిబరేషన్

## ఏళ్లుగా జైళ్లలో మగ్గుతున్న విచారణ

# ఖైదీల విముక్తి ఎప్పుడు?





నేరాలు చేశారు చేయలేదో తెలియదు కానీ ఎండ్లకు ఏండ్లు జైలు నాలుగు గోడల మధ్య శిక్ష ఖరారు కాకముందే విచారణ ఖైదీలుగా శిక్షలు అనుభవిస్తున్నారు. దేశవ్యాప్తంగా చత్తీస్గఢ్ జగదల్పూర్ రాయపూర్ విలాస్పూర్ సుకుమా బీహార్ జార్ఖండ్ నాగపూర్ బీహార్ ఒడిస్సా భువనేశ్వర్ తమిళనాడు నాగపూర్ చర్లపల్లి విశాఖపట్నం వరంగల్ నిజామాబాద్ కరీంనగర్ ప్రధాన జైల్లో సుమారు 6000 మంది ఖైదీలు మావోయిస్టులపై విచారణ ఖైదీలుగానే పది సంవత్సరాల నుండి 15 సంవత్సరాలుగా జైలు నాలుగోడల మధ్య బందీలుగా నలిగిపోతున్నారు. ఇప్పటికే దేశవ్యాప్తంగా ఉన్నటువంటి మావోయిస్టు రాజకీయ ఖైదీలను ఖైదీలను ఖైదీలను బే షరతుగా కేసులను ఎత్తివేసి విడుదల చేయాలని హక్కుల సంఘాలు ఆందోళనకు దిగుతున్నాయి. ఇప్పటికే ప్రొఫెసర్ అరగోపాల్ ప్రొఫెసర్ కోదండరాం ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్ హక్కుల సంఘాల నేతలు ప్రజాస్వామికవాదులు న్యాయపో విధులు న్యాయవాదులు ప్రజాసంఘాల నేతలు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడిని పెంచుతున్నాయి. జైలు శిక్ష పడక ముందే విచారణ ఖైదీలుగా జైలు నాలుగు గోడల మధ్య ఉండిపోతున్నారు. అటు భార్య పిల్లలకు ఇటు కన్న తల్లిదండ్రులకు దూరమై బ్రతుకు భారమై బిక్కుబిక్కుమంటూ జైలు నాలుగు గోడల మధ్య నిత్యం అనునిత్యం అనుక్షణం ప్రతిక్షణం ప్రతిక్షణం అనుభవిస్తున్నారు.

మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు ఆరుగురు గత 15లుగా బీహార్ సెంట్రల్ జైల్లో విజయ్ కుమార్ ఆర్య .మోహిత్, జనార్ధన్ సంజయ్ దీపక్ రావు చంచల్గూడా సెంట్రల్ జైలులలో విచారణ ఖైదీలు గానే ఉంటున్నారు. సంజయ్ దీపక్ రావు చర్లపల్లి సెంట్రల్ జైల్లో 10 రోజులు నిరాహార దీక్షలు చేసి ప్రభుత్వానికి కనువిప్పు కలిగించారు. రాజకీయ ఖైదీల డిమాండ్లను పరిష్కరించేంతవరకు ఆమరణ నిరాహార దీక్ష నుండి విరమించేది లేదని ససేమిరా అన్నారు. ముఖ్యంగా చత్తీస్గఢ్ జగదల్పూర్ భువనేశ్వర్ రాయపూర్ సుకుమా జైళ్లలో సుమారు 6000 మంది ఖైదీలు ఉంటారని వారందరినీ విడుదల చేయాలని దేవుజి. అలియాస్ తిపిరి తిరుపతి .మల్ల రాజిరెడ్డి అలియాస్ సంగ్రామ్ దాదా ప్రభుత్వమందు 6000 మంది ఖైదీలను ఎలాంటి షరతులు లేకుండా విడుదల చేయాలని తమ డిమాండ్లను ప్రతిపాదించారు. దీనికి ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది కానీ ఇంతవరకు ఏ ఒక్కరిని కూడా విడుదల చేయలేదు ఆగస్టు 15న 2026న ఆయా రాష్ట్రాలలో తొలి దశగా వెయ్యి మంది ఖైదీలను విడుదల చేస్తామని హామీ ఇచ్చినప్పటికీ అట్టి హామీని విస్మరించారు. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాలకు చెందిన శిరీష ఆర్కే సహచరుని, మేడం బాలకృష్ణ సహచరుని అనురాధ, చత్తిస్గఢ్ జై ళ్లలో రిమాండ్ ఖైదీలుగా ఉన్నారు. జార్ఖండ్ కు చెందిన అశుతోష్ మావోయిస్టు పార్టీ సభ్యుడు రాంచీలో కేసు విషయంలో ఆలస్యం చేస్తున్నారని అతని న్యాయవాది ఆరోపించారు.

తెలంగాణ రాష్ట్రానికి చెందిన తిరుమలగిరి కి చెందిన కోసపు అశోక్ రెడ్డి, తోపాటు సహచరుని ఆశ, జగదల్ పూర్ మధ్యప్రదేశ్ జైలులో రిమాండ్ ఖైదీలుగా ఉన్నారు. ఇదే అశోక్ రెడ్డి పై జార్ఖండ్ జైల్లో జైలు అధికారులు విచక్షణారహితంగా దాడి చేశారు. విశాఖపట్నం రాజమండ్రి కాకినాడ చర్లపల్లి, చంచల్గూడా జైలలో సుమారు 80 మంది మావోయిస్టు ఆరోపణలపై జైళ్లలో మగ్గుతున్నారు మగ్గుతున్నారు. మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ బ్యూరో సభ్యుడు కిషన్ ద జార్ఖండ్ జైల్లో అనారోగ్యంతో వృద్ధాప్యంతో జైలు నాలుగు గోడల మధ్యన తుది శ్వాస విడిచారు. కిషన్ దా సహచరుని ఝార్ఖండ్‌కు చెందిన గీతు నాలుగు గోడల మధ్యనే రిమాండ్ ఖైదుగా ఉన్నారు.

తెలుగు దీపక్ కలకత్తా జైల్లో మరో దీపక్ తమిళనాడు రాష్ట్ర కమిటీ సభ్యుడు చత్తీస్గడ్ ఆసుపత్రిలో అరెస్టయ్యాడు. తెలంగాణ మావోయిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి. దామోదర్ భార్య రజిత ఆశన్న సహచరుని శ్రీవిద్య చెంచలగూడ జైల్లో రిమాండ్ ఖైదీలుగా ఉన్నారు. శివారెడ్డి అలియాస్ కిరణ్ వేంగు దాదా కూడా విశాఖపట్నం జైల్లో చర్లపల్లి జైల్లో విచారణ ఖైదీలుగా ఉన్నారు. తెలంగాణ రాష్ట్రానికి చెందిన సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ మండలం చెట్ల నర్సంపల్లి గ్రామానికి చెందిన దుబాసి శంకర్ అలియాస్ మహేందర్ రమేష్ గత ఏడు సంవత్సరాలుగా భువనేశ్వర్ జైల్లో విచారణ ఖైదీగా ఉన్నారు. దుబాయ్ సి శంకర్ ఆరోగ్యం రోజురోజుకి జీవిస్తుంది 2017లో రామడుగు రామడుగు ఎన్కౌంటర్లో దుబాసి శంకర్ .భార్య లత. అలియాస్ భారతి చనిపోయింది. దుబాషి శంకర్. సొంత కోడలు స్వప్న విశాఖపట్నం మహిళా సెంట్రల్ జైల్లో ఎన్ఐఏ కేసులో ఐదు సంవత్సరాలు విశాఖపట్నం కోర్టు శిక్షణ విధించింది. ఇందులో కందమాల్ కలహంజా నవ పాడ జైళ్లలో మావోయిస్టు రాజకీయ ఖైదీలు 1000 మందికి పైగానే విచారణ ఖైదీలుగా ఉన్నారు. సుప్రీంకోర్టు విచారణ ఖైదీలుగా శిక్ష పడకముందే ఉండవద్దని ఒక జడ్జిమెంట్ను ఇచ్చింది మరి కొంతమంది ఖైదీలను శిక్షలు పడ్డ ఖైదీలను కూడా వారికి కూడా ప్రతి మూడు నెలలకు ఒకసారి సందర్భంగా గాంధీ జయంతి పంద్రాగస్టు రిపబ్లిక్ డే రాష్ట్ర అవతరణ దినోత్సవాల సందర్భంగా క్షమాబిక్షలు ప్రసాదించి విడుదల చేయాలని సుప్రీంకోర్టు ఆయా రాష్ట్రాల జైళ్లకు మార్గదర్శకాలను 2026 లో విడుదల చేసింది. ఆదివాసి ఖైదీలు జైల్లో బెయిలు రాకుండానే వారి జీవితాలు అర్ధాంతరంగా ముగిసిపోతున్నాయి. జైళ్లలో సరిగా వైద్య మందక చనిపోతున్నారు.

న్యాయమూర్తి శిక్షలు వేయకుండానే ఏళ్లకు ఏళ్లు జైల్లో మధ్య నలిగిపోతున్నారు. జైలు పరివర్తనాళాలుగా ఉండాల్సింది పోయి మృత్యు కుపాలుగా మారుతున్నాయి. భువనేశ్వర్ జైల్లో 2021లో రవిదుల అనే ఆదివాసి ఖైదీ గుండెపోటుతో చనిపోయారు. నయా గుడి దాడి కేసులో నిందితునిగా పోలీసులు చేర్చారు. కోర్టు మాత్రం రవిదులను నిర్దోషిగా ప్రకటించింది.2018 లో దండుకొర అనే ఆదివాసి ఖైదీ మల్కన్గిరి జైల్లో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మంగరాజు. పిట్ట మర్రి గ్రామస్థుడు మల్కనగిరి జిల్లా ఒడిస్సా రాష్ట్రం. విశాఖపట్నం సెంట్రల్ జైల్లో 2012లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినాడు. మూకసోడి కొలకోట గ్రామం వైద్యం అందక చనిపోయాడు. దూల కోడి టేక్ గూడ గ్రామం మల్కనగిరి జైల్లో 2015 లో ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

తెలంగాణ రాష్ట్రానికి చెందిన నిర్మల మహారాష్ట్ర నాగపూర్ జైల్లో2022 లో వైద్య మందక చనిపోయింది. ఇలా ఎంతోమంది విచారణ ఖైదీలు శిక్షలు పడకుండానే విచారణ ఖైదీలు జైలు నాలుగు మధ్య తుది శ్వాస విడుస్తున్నారు. పోలీసులు థర్డ్ డిగ్రీ వినియోగిస్తున్నారని పౌర హక్కుల సంఘాలు ఆరోపిస్తున్నాయి. దేశంలో మావోయిస్టు పార్టీ లేనప్పుడు మావోయిస్టు సానుభూతిపరులు. ఆదివాసులు. తెలుగు రాష్ట్రాలకు చెందిన మావోయిస్టు నేతలను. వృద్ధ మావోయిస్టులను ఏళ్ల తరబడి జైల్లో పెట్టినప్పటికీ. వారికి బెల్లు రాకుండా అక్కడే ఉండి పోతున్నారు. ఆయా జైల్లో సామర్థ్యం మించి ఎక్కువ మంది ఖైదీలను ఉంచుతున్నారని ఆరోపణలు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మానవతా దృక్పథంతో ఏళ్ల తరబడి జైలు నాలుగు గోడల మధ్య నలిగిపోతున్న ఆదివాసి మావోయిస్టు రాజకీయ ఖైదీలను విడుదల చేసి ప్రభుత్వాలు మానవతా దృక్పథాన్ని చాటుకోవాలి.

- దామరపల్లి నర్సింహారెడ్డి

జనంసాక్షి

# కాకతీయ విశ్వవిద్యాలయం: ఐదు దశాబ్దాల జ్ఞాన ప్రస్థానం

ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో 1968లో వరంగల్‌లో ప్రారంభమైన స్నాతకోత్తర కేంద్రం నుంచి కాకతీయ విశ్వవిద్యాలయంగా రూపాంతరం చెందిన ఈ సంస్థ ప్రారంభంలో కొద్దిపాటి విభాగాలతోనే ప్రయాణం ప్రారంభించింది. తెలుగు, ఆంగ్లం, రసాయనశాస్త్రం, గణిత శాస్త్రం వంటి విభాగాల నుంచి నేడు కళలు, శాస్త్రాలు, వాణిజ్యం, సామాజిక శాస్త్రాలు, ఇంజినీరింగ్, న్యాయశాస్త్రం, ఔషధశాస్త్రం, విద్య, సాంకేతిక రంగాల వరకు విస్తరించింది. ఇది కేవలం విభాగాల పెరుగుదల కాదు. ఉన్నత విద్యను హైదరాబాద్ వంటి నగరాలకే పరిమితం కాకుండా ఉత్తర తెలంగాణ గ్రామీణ విద్యార్థుల ముంగిటకు తీసుకువచ్చిన సామాజిక మార్పు. రైతు కుటుంబాల నుంచి, మధ్యతరగతి కుటుంబాల నుంచి వచ్చిన వేలాది మంది విద్యార్థులకు ఉన్నత విద్య, పరిశోధన, ఉపాధి, ప్రజాసేవ రంగాల్లో కొత్త అవకాశాలను అందించింది.

### తరతరాల జీవితాలను మార్చిన సంస్థ

ఒక విశ్వవిద్యాలయ గొప్పతనం దాని భవనాల్లో కాదు.. అది మార్చిన జీవితాల్లో ఉంటుంది. కాకతీయ విశ్వవిద్యాలయం నుంచి బయటకు వచ్చిన విద్యార్థులు ఉపాధ్యాయులు, శాస్త్రవేత్తలు, న్యాయవాదులు, పాత్రికేయులు, ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు, సామాజిక కార్యకర్తలుగా వివిధ రంగాల్లో రాణించారు. ఒక కుటుంబంలో తొలి తరం విద్యార్థికి ఉన్నత విద్య అందించడం నుంచి గ్రామీణ యువతకు పరిశోధన అవకాశాలు కల్పించడం వరకు విశ్వవిద్యాల యం సామాజిక చలనశీలతకు బలమైన వేదికగా నిలిచింది. ఇదే దాని అసలైన సామాజిక మూలధనం.

### పరిశోధనే భవిష్యత్తు బలం

ఇక ముందు కాకతీయ విశ్వవిద్యాలయం కేవలం పట్టాలు అందించే సంస్థగా కాకుండా జ్ఞానాన్ని సృష్టించే కేంద్రంగా ఎదగాలి. ఉత్తర తెలంగాణకు సంబంధించిన భూగర్భ జలాలు, వ్యవసాయం, వాతావరణ మార్పులు, పర్యావరణ పరిరక్షణ, గిరిజన జీవనం, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ, వలసలు, పట్టణీకరణ, ప్రజారోగ్యం వంటి సమస్యలపై అంతరశాఖ పరిశోధనలకు ప్రాధాన్యం ఇవ్వాలి. ప్రాంతీయ సమస్యలకు శాస్త్రీయ పరిష్కారాలను కనుగొని ప్రభుత్వానికి, సమాజానికి అందించగలిగితే విశ్వవిద్యాలయం తన సామాజిక బాధ్యతను మరింత సమర్థంగా నిర్వర్తించగలదు.

### కాకతీయుల వారసత్వంతో ఆధునిక జ్ఞానానికి వారధి

కాకతీయుల చారిత్రక నేలపై ఏర్పడిన ఈ విశ్వవిద్యాలయానికి ప్రత్యేక సాంస్కృతిక బాధ్యత కూడా ఉంది. కాకతీయుల చెరువుల నిర్మాణం, నీటి నిర్వహణ, శిల్పకళ, సాహిత్యం, తెలంగాణ భాషా సంస్కృతి, జానపద విజ్ఞానం వంటి అంశాలను ఆధునిక పరిశోధనతో అనుసంధానం చేయాలి. ప్రపంచ జ్ఞానాన్ని తెలంగాణకు తీసుకురావడమే కాదు.. తెలంగాణలో పుట్టే జ్ఞానాన్ని ప్రపంచానికి పరిచయం చేసే స్థాయికి విశ్వవిద్యాలయం ఎదగాలి.

### ఏఐ యుగంలో కొత్త సవాళ్లు

కృత్రిమ మేధస్సు, యంత్ర అభ్యాసం, పెద్ద డేటా, జీవసాంకేతిక విజ్ఞానం, రోబోటిక్స్, డిజిటల్ కమ్యూనికేషన్ వంటి రంగాలు విద్యా ప్రపంచాన్ని వేగంగా మారుస్తున్నాయి. ఈ మార్పులకు అనుగుణంగా పాఠ్యాంశాలను ఆధునీకరించడం, డిజిటల్ మౌలిక వసతులను పెంచడం, పరిశ్రమలతో అనుసంధానం చేయడం అత్యవసరం. విద్యార్థికి ఇప్పుడు పట్టా ఒక్కటే సరిపోదు. సమస్య పరిష్కారం, సమాచార విశ్లేషణ, కమ్యూనికేషన్, డిజిటల్ నైపుణ్యాలు, సృజనాత్మక ఆలోచన, పరిశోధనా సామర్థ్యం వంటి నైపుణ్యాలు కూడా అవసరం. ఈ దిశగా విశ్వవిద్యాలయం మరింత దూకుడుగా ముందుకు సాగాలి.

### పరిశ్రమ-విశ్వవిద్యాలయ అనుసంధానం అవసరం

పరిశోధన ప్రయోగశాలలోనే ఆగిపోకూడదు. అది ఆవిష్కరణగా, ఆవిష్కరణ ఉపాధిగా, ఉపాధి ప్రాంతీయ ఆర్థికాభివృద్ధిగా మారాలి. పరిశ్రమలతో భాగస్వామ్యాలు, విద్యార్థులకు ఇంటర్న్‌షిప్‌లు, స్టార్టప్‌లకు ప్రోత్సాహం, సాంకేతిక బదిలీ, సంయుక్త పరిశోధనలు పెరగాలి. పూర్వ విద్యార్థులను కూడా ఈ ప్రక్రియలో భాగస్వాములను చేయాలి. దేశ, విదేశాల్లో ఉన్న కాకతీయ పూర్వ విద్యార్థులు విద్యార్థులకు మార్గదర్శకులు, పరిశోధన భాగస్వాములు, పరిశ్రమ అనుసంధానకర్తలుగా ఉపయోగపడేలా బలమైన అలుమ్ని వ్యవస్థను నిర్మించాలి.

### సామాజిక సమానత్వం కూడా లక్ష్యమే

ప్రాంతీయ విశ్వవిద్యాలయంగా కాకతీయకు మరో ముఖ్యమైన బాధ్యత ఉంది. ఆర్థికంగా వెనుకబడిన వర్గాలు, గ్రామీణ విద్యార్థులు, మహిళలు, సామాజికంగా వెనుకబడిన వర్గాలకు నాణ్యమైన ఉన్నత విద్య అందుబాటులో ఉండాలి. వసతిగృహాలు, ఉపకార వేతనాలు, పోటీ పరీక్షల శిక్షణ, పరిశోధనా అవకాశాలు, ఉపాధి మార్గదర్శకత్వం వంటి అంశాలను మరింత బలోపేతం చేయాలి. ఉన్నత విద్య ఒక సామాజిక ఎలివేటర్‌గా పనిచేసినప్పుడే విశ్వవిద్యాలయ స్థాపన లక్ష్యం పూర్తవుతుంది.

### విద్యార్థి స్వేచ్ఛ.. ప్రశ్నించే సంస్కృతి

విశ్వవిద్యాలయం కేవలం పాఠ్యపుస్తకాల కేంద్రం కాదు. అది ఆలోచనలకు, చర్చలకు, పరిశోధనకు, ప్రజాస్వామ్య చైతన్యానికి వేదిక. విద్యార్థుల్లో ప్రశ్నించే స్వభావాన్ని పెంపొందించడం, భిన్నాభిప్రాయాలను గౌరవించే వాతావరణాన్ని కల్పించడం ఉన్నత విద్యలో కీలకం. జ్ఞానం అంటే సమాధానాలు నేర్చుకోవడం మాత్రమే కాదు.. సరైన ప్రశ్నలు అడగడం కూడా. ఆ ప్రశ్నలకు స్థానం ఉన్నప్పుడే విశ్వవిద్యాలయం నిజమైన జ్ఞాన కేంద్రంగా నిలుస్తుంది.

### అంతర్జాతీయ స్థాయికి అడుగులు

కాకతీయ విశ్వవిద్యాలయం ఇప్పటికే నాణ్యతా మూల్యాంకనాల్లో పలు మైలురాళ్లు సాధించింది. అంతర్జాతీయ సంస్థలు, విశ్వవిద్యాలయాలతో సహకారాలకు కూడా అవకాశం ఏర్పడింది. అయితే ఇకపై అవగాహన ఒప్పందాలు మాత్రమే కాకుండా సంయుక్త పరిశోధనలు, అధ్యాపక–-విద్యార్థి మార్పిడి, సంయుక్త పీహెచ్‌డీలు, అంతర్జాతీయ ప్రయోగశాలలు, ప్రపంచస్థాయి పరిశోధనా ప్రాజెక్టులపై దృష్టి పెట్టాలి. ప్రపంచస్థాయి విశ్వవిద్యాలయాలతో పోటీ పడాలంటే పరిశోధన నాణ్యత, పేటెంట్లు, సాంకేతిక ఆవిష్కరణలు, పరిశ్రమ అనుసంధానం, అంతర్జాతీయ ప్రచురణలు, సామాజిక ప్రభావం వంటి అంశాల్లో స్పష్టమైన లక్ష్యాలు అవసరం.

### 2047 లక్ష్యానికి దిశానిర్దేశం

ఐదు దశాబ్దాల ప్రయాణం ఇప్పుడు ఒక కీలక మలుపులో నిలిచింది. మొదటి దశలో లక్ష్యం ఉన్నత విద్యను అందుబాటులోకి తీసుకురావడం. తరువాత విద్యా విస్తరణ. ఆపై పరిశోధన, నాణ్యత. ఇక ముందున్న దశ ప్రపంచస్థాయి జ్ఞాన కేంద్రంగా ఎదగడం. 2047 నాటికి భారతదేశం అభివృద్ధి చెందిన దేశంగా ఎదగాలంటే విశ్వవిద్యాలయాలు జ్ఞాన ఉత్పత్తి కేంద్రాలుగా మారాలి. ఉత్తర తెలంగాణ ఆర్థిక, సామాజిక, పర్యావరణ సమస్యలకు స్థానిక పరిష్కారాలు చూపే పరిశోధనా కేంద్రంగా కాకతీయ విశ్వవిద్యాలయం ఎదగాలి.

### సమిష్టి కృషితోనే ముందడుగు

విశ్వవిద్యాలయ పురోగతి ఒక్క ఉపకులపతి లేదా పరిపాలనతో సాధ్యం కాదు. అధ్యాపకులు, పరిశోధకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు, పూర్వ విద్యార్థులు, ప్రభుత్వం, పరిశ్రమలు, సమాజం కలిసి పనిచేయాలి.

ప్రస్తుత ఉపకులపతి ఆచార్య కర్నాటి ప్రతాపరెడ్డి నాయకత్వంలో విద్య, పరిశోధన, సాంకేతికత, విద్యార్థి సంక్షేమం, అంతర్జాతీయ సహకారం వంటి రంగాల్లో సమన్వయంతో ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉంది. నాయకత్వంతో పాటు సంస్థాగత సంకల్పం, దీర్ఘకాలిక ప్రణాళిక, నిధుల సమీకరణ, నాణ్యమైన అధ్యాపక బలం కూడా అంతే కీలకం.

### ఐదు దశాబ్దాలు.. మరో కొత్త ఆరంభం

కాకతీయ విశ్వవిద్యాలయం 50 ఏళ్ల ప్రస్థానం కేవలం ఒక విద్యాసంస్థ వార్షికోత్సవం కాదు. అది ఉత్తర తెలంగాణ ఉన్నత విద్యా చరిత్రలో ఒక మహత్తర అధ్యాయం. వేలాది కుటుంబాల ఆశలు, లక్షలాది విద్యార్థుల కలలు, తరతరాల అధ్యాపకుల కృషి, పరిశోధకుల పట్టుదల కలిసిన జ్ఞాన ప్రస్థానం. గతం కాకతీయ విశ్వవిద్యాలయానికి గర్వకారణం. వర్తమానం దాని బాధ్యత. భవిష్యత్తు దాని సవాలు. 1976లో ఉత్తర తెలంగాణకు వెలుగుదీపంగా వెలిగిన ఈ విశ్వవిద్యాలయం ఇక ప్రపంచ జ్ఞాన పటంలో తనదైన ముద్ర వేయాలి. ప్రపంచ జ్ఞానాన్ని ఉత్తర తెలంగాణకు తీసుకురావడమే కాదు.. ఉత్తర తెలంగాణలో పుట్టే జ్ఞానాన్ని ప్రపంచానికి అందించే స్థాయికి ఎదగాలి. అదే కాకతీయ విశ్వవిద్యాలయం ఐదు దశాబ్దాల వారసత్వానికి నిజమైన నివాళి.



డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి
కాకతీయ విశ్వవిద్యాలయం

## కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలి



**శామీర్‌పేట్, ఆగష్టు 19 (జనం సాక్షి) :** శామీర్ పేట్ డివిజన్ లోని పూర్తి స్థాయి కమిటీని వేసి కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతి నాయకుడు కృషి చెయ్యాలని మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తోటకూర వజ్రెష్ యాదవ్ అన్నారు. బుధవారం తుంకుంట మొగుళ్ళ వెంకట్ రెడ్డి ఫంక్షన్ హలులో 300 డివిజన్ అధ్యక్షులు నక్క సందీప్ గౌడ్ ఆధ్వర్యంలో బిఎల్‌ఏలకు సన్మానం, నామినేటెడ్ పోస్టుల భర్తీ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా జిల్లా అధ్యక్షులు వజ్రెష్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, మాజీ జిల్లా అధ్యక్షులు హరివర్ధన్ రెడ్డి, రాష్ట్ర నాయకులు నక్క ప్రభాకర్ గౌడ్, మహిపాల్ రెడ్డిలు పాల్గొన్నారు. ఈ సందర్బంగా వజ్రెష్ యాదవ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ లో అవకాశాలు ప్రతి ఒక్కరికి వస్తాయని, నాయకులు నిరాశలకు లోను కావద్దని కోరారు. నామినేటెడ్ పోస్టులల్లో అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందన్నారు. సిస్టమ్ అనుగుణంగానే ఏ అధికారి అయినా పని చెయ్యాల్సిందేనని తేల్చి చెప్పారు.కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని ప్రజల్లోకి తీసికెళ్లే బాధ్యత మీదే నన్నారు. అనంతరం సర్ ప్రక్రియలో సమర్థ వంతంగా కృషి చేసిన బి ఎల్ ఏలను మెమెంటోలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్య క్రమంలో ముజీబ్, ఆర్ టి ఏ మెంబర్ జైపాల్ రెడ్డి, ఏ ఎం సి చైర్మన్ నర్సింలు యాదవ్, నాయకులు రవి,మహేష్ గౌడ్, సత్యనారాయణ, శంకర్,ఎద్దు నాగేష్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

**గద్వాల నడిగడ్డ, ఆగస్టు 19 (జనం సాక్షి) :** ఎస్ఐఆర్ ప్రక్రియలో ఓటర్ల జాబితాలో మ్యాపింగ్ కాని ఓటర్లకు నోటీసులు జారీ చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధికారులను ఆదేశించారు. బుధవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి సంబంధిత ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో ఎస్ఐఆర్ ప్రక్రియపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ ఎస్ఐఆర్‌లో భాగంగా ఓటర్ల మ్యాపింగ్, మ్యాపింగ్ కాని ఓటర్లు,వివరాల్లోని వ్యత్యాసాలు గుర్తింపుపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. ఫారాల పంపిణీ, సేకరణ ప్రక్రియ పూర్తి అయిన అనంతరం మ్యాపింగ్ కాని ఓటర్లు,వివరాల్లో వ్యత్యాసాలు ఉన్న ఓటర్లకు నోటీసులు జారీ చేయాలని తెలిపారు. నోటీసులు అందుకున్న ఓటర్లు నిర్ణీత తేదీ, సమయంలో హాజరై, పౌరసత్వాన్ని నిర్ధారించే సంబంధిత ధ్రువపత్రాలను సమర్పించాలని సూచించారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన 11 రకాల ధ్రువపత్రాలను పరిగణనలోకి తీసుకోవాలని,వీటిలో ఆధార్, ఆహార భద్రత కార్డులు ఉండవని స్పష్టం చేశారు.జూలై 31 నుంచి సెప్టెంబర్ 28 వరకు క్లెయిమ్‌లు, అభ్యంతరాలను స్వీకరించి, ధ్రువపత్రాలను పరిశీలించి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.జిల్లాల్లో చేపడుతున్న చర్యలపై కార్యాచరణ ప్రణాళికను రూపొందించి రాష్ట్ర స్థాయికి పంపాలని ఆదేశించారు. ఎస్ఐఆర్ ప్రక్రియను సులభంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు సంబంధిత సిబ్బందికి అవసరమైన శిక్షణ అందించాలని కలెక్టర్లకు సూచించారు.ఓటర్లకు ఎస్ఐఆర్‌పై అవగాహన కల్పించి, అవసరమైన ధ్రువపత్రాలతో నిర్ణీత సమయంలో హాజరయ్యేలా చూడాలని సూచించారు.ఓటర్ల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని పోలింగ్ స్టేషన్ల హేతుబద్ధీకరణ చేపట్టాలన్నారు. పోలింగ్ స్టేషన్ల హేతుబద్ధీకరణలో ఒకే కుటుంబానికి చెందిన ఓటర్లు ఒకే పోలింగ్ స్టేషన్‌లో ఉండేలా చూడాలని సూచించారు. మ్యాపింగ్, నోటీసుల జారీ,క్లెయిమ్‌లు, అభ్యంతరాల పరిష్కారం వంటి ప్రతి దశను అధికారులు సమన్వయంతో పర్యవేక్షిస్తూ,నిర్ణీత కాలపరిమితిలో ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ లో పాల్గొన్న కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ వీసీ అనంతరం సంబంధిత అధికారులతో మాట్లాడుతూ ఎస్ఐఆర్ ప్రక్రియను పారదర్శకంగా, నాణ్యతతో పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రామాలు, మున్సిపల్ పరిధిలో క్లస్టర్ వారీగా మ్యాపింగ్ కాని ఓటర్ల సంఖ్యను పరిగణనలోకి తీసుకుని, వారికి సౌకర్యవంతమైన ప్రదేశాలను ఎంపిక చేసి ధ్రువపత్రాల స్వీకరణకు తేదీ,సమయాలను ముందుగా ఖరారు చేయాలని కలెక్టర్ సూచించారు.ఆయా కేంద్రాల్లో హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేసి, ఓటర్లకు అవసరమైన సహాయం అందించాలని ఆదేశించారు. పౌరసత్వ నిర్ధారణకు సూచిత ధ్రువపత్రాల్లో ప్రభుత్వ ఉద్యోగి,పెన్షనర్ గుర్తింపు కార్డు లేదా పీపీఓ,01.07.1987కు ముందు జారీ చేసిన ప్రభుత్వ,స్థానిక సంస్థలు,బ్యాంకులు,పోస్టాఫీసు,ఎల్ఐసీ,పీఎస్‌యూ ధ్రువపత్రం,జనన ధ్రువపత్రం, పాస్‌పోర్ట్, విద్యా ధ్రువపత్రం, శాశ్వత నివాస ధ్రువపత్రం,అటవీ హక్కుల ధ్రువపత్రం, ఓబీసీ,ఎస్సీ,ఎస్టీ,ఇతర కుల ధ్రువపత్రం, జాతీయ పౌర పట్టిక, ప్రభుత్వం జారీ చేసిన భూమి,ఇంటి కేటాయింపు ధ్రువపత్రం ఉన్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ మధు మోహన్,ఎన్నికల విభాగం అధికారి మంజుల,అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# ప్రజా సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలి

**సంగారెడ్డి, ఆగస్టు 19 (జనం సాక్షి) :** సంగారెడ్డి, జహీరాబాద్ నియోజకవర్గాల పరిధిలోని ప్రజా సమస్యలు, అభివృద్ధి పనులపై సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్, జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్ రావు లు గురువారం జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌ను కలిసి చర్చించారు. ఈ సందర్భంగా నియోజకవర్గాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో టాయిలెట్లు, తాగునీరు, ఇతర మౌలిక వసతులు కల్పించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేలు కోరారు. అలాగే ప్రజలకు రవాణా సౌకర్యం మెరుగుపడేలా ఆర్‌అండ్‌బీ రోడ్ల మంజూరు, పెండింగ్‌లో ఉన్న రహదారి పనుల పురోగతిపై కలెక్టర్‌తో చర్చించారు. గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి అవసరమైన బోర్ల ఏర్పాటు,



ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు సబ్ సెంటర్ల అభివృద్ధిపై కూడా వివరాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే సి ఎస్ ఆర్, డి ఎం ఎఫ్ టి , ఎం ఎస్ టి , తదితర నిధుల ద్వారా చేపడుతున్న అభివృద్ధి పనులు, అందుబాటులో ఉన్న నిధులు, పెండింగ్‌లో ఉన్న పనుల వివరాలను ఎమ్మెల్యే చింత ప్రభాకర్ కలెక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటికే మంజూరైన పనులను వేగంగా పూర్తి చేయడంతో పాటు పెండింగ్ పనులకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు, విద్య, వైద్యం, రహదారులు, తాగునీటి సమస్యల పరిష్కారానికి అధికారులు సమన్వయంతో పనిచేసి అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యేలు సూచించారు. ఈ కార్యక్రమంలో బుచ్చిరెడ్డి, పట్నం మాణిక్యం, నాగరాజు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## కౌకూర్ జంక్షన్‌కు కొత్త రూపు



**అల్వాల్, ఆగస్టు 19 (జనంసాక్షి) :** కౌకూర్ బస్‌స్టాప్ వద్ద ప్రధాన జంక్షన్ అభివృద్ధికి అడ్డుగా ఉన్న విద్యుత్ స్తంభాలు, లైన్లను మార్చే పనులకు కసరత్తు ప్రారంభమైంది. ఇందులో భాగంగా 11 కేవీ, ఎల్‌టీ విద్యుత్ లైన్లను మార్చి జంక్షన్‌ను అభివృద్ధి చేసేందుకు చేపడుతున్న పనులను విద్యుత్ శాఖ అధికారులు, కాంగ్రెస్ నాయకులు బుధవారం పరిశీలించారు. ఏఈ శ్రీనివాస్, లైన్ ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్‌తో కలిసి విద్యుత్ లైన్ల మార్పిడి, స్తంభాల తొలగింపు, జంక్షన్ అభివృద్ధికి సంబంధించిన అంశాలను పరిశీలించారు. జంక్షన్ వద్ద విద్యుత్ స్తంభాల అడ్డంకులను తొలగించడం ద్వారా రహదారి అభివృద్ధికి అవకాశం ఏర్పడుతుందని తెలిపారు. మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు ఆధ్వర్యంలో కౌకూర్ ప్రాంత అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, సామాజిక కార్యకర్త తుడిమెళ్ల మల్లికార్జున్ తెలిపారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతులను మెరుగుపరిచేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ యాప్రాల్ డివిజన్ జనరల్ సెక్రటరీ శివరాజ్, యువ నాయకుడు రాజ్‌కుమార్, సత్తి తదితరులు పాల్గొన్నారు.

## మహిళలకు అండగా షీ టీం సేవలు

- వేధింపులకు గురైతే 112కు సమాచారం ఇవ్వాలి
- అచ్చంపేట డీఎస్పీ పల్లె శ్రీనివాస్




**అచ్చంపేట, ఆగస్టు 19 (జనం సాక్షి) :** సమాజంలో మహిళలు, బాలికలు, చిన్నారులు, వృద్ధులపై జరిగే అన్యాయాలను ధైర్యంగా ఎదుర్కొనేందుకు షీ టీం అండగా ఉంటుందని అచ్చంపేట డీఎస్పీ పల్లె శ్రీనివాస్ అన్నారు. బుధవారం అచ్చంపేట మండలంలోని ఐనోలు గిరిజన బాలికల గురుకుల ఆశ్రమ పాఠశాలలో జిల్లా షీ టీం ఆధ్వర్యంలో విద్యార్థినులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. మహిళలు, బాలికలు లేదా ఇతరులు వేధింపులకు గురైతే వెంటనే డయల్ 112కు సమాచారం అందించాలని సూచించారు. సమాచారం అందిన వెంటనే షీ టీం బృందం స్పందించి బాధితులకు అండగా నిలిచి, వేధింపులకు పాల్పడే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటుందని తెలిపారు. విద్యార్థినులు చదువుపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని, సోషల్ మీడియాలో వచ్చే అసభ్యకరమైన లింకులు, అనవసరమైన కంటెంట్‌కు దూరంగా ఉండాలని సూచించారు. సోషల్ మీడియాను అప్రమత్తంగా వినియోగించాలని చెప్పారు. అలాగే మానవ అక్రమ రవాణాకు పాల్పడే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో సీసీఎస్ సీఐ శంకర్, జిల్లా షీ టీం ఇన్‌చార్జి విజయలక్ష్మి, అచ్చంపేట సీఐ నాగరాజు, సిద్ధాపూర్ ఎస్ఐ అంజయ్య, షీ టీం సభ్యులు వెంకటయ్య, మల్లేష్, వెంకట్ నాయక్, జానకిరాములు పాల్గొన్నారు.

## ఆగస్టు 24 నుంచి ఆటో కార్మికుల సమ్మె

**కల్వకుర్తి, ఆగస్టు 19 (జనం సాక్షి) :** ఆగస్టు 24 నుంచి చేపట్టనున్న ఆటో కార్మికుల సమ్మెను జయప్రదం చేయాలని ఆటో డ్రైవర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) పట్టణ అధ్యక్షుడు దేశం సైదులు పిలుపునిచ్చారు. మంగళవారం కల్వకుర్తి పట్టణంలోని ఏఐటీయూసీ కార్యాలయంలో ఆటో డ్రైవర్స్ యూనియన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటో రవాణా రంగ కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఆటో రవాణా రంగ కార్మికుల కోసం ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. ఆటో కార్మికులకు ప్రతి సంవత్సరం రూ. 12 వేల ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేశారు. పెరుగుతున్న నిత్యావసరాల ధరలు, నిర్వహణ ఖర్చులతో ఆటో కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం చేపడుతున్న సమ్మెకు




ప్రజా సంఘాలు, కార్మిక సంఘాలు, ప్రజలు మద్దతు ఇవ్వాలని కోరారు. సమ్మెను విజయవంతం చేసేందుకు ఆటో కార్మికులంతా ఐక్యంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఆటో కార్మికులు ఎస్కే అమీర్, రాజేష్, ఓర్సు బాలస్వామి, మహేష్, నాగరాజు, లక్ష్మీకాంత్‌రెడ్డి, యాదగిరి, జనార్దన్, పరశురాం గౌడ్, మురళి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# నేరాల దర్యాప్తును వేగవంతం చేయాలి

**మోమిన్‌పేట, ఆగస్టు 19 (జనం సాక్షి) :** వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, మోమిన్‌పేట సర్కిల్ పోలీస్ కార్యాలయంలో బుధవారం వార్షిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా మోమిన్‌పేట, మర్పల్లి, నవాబ్‌పేట్ పోలీస్ స్టేషన్ల శాంతిభద్రతలు, నేరాల దర్యాప్తు, పెండింగ్ కేసులు, పోలీస్ రికార్డులు, సీసీటీఎన్ఎస్ నమోదు, సీసీ కెమెరాల ఏర్పాటుపై సమీక్షించారు. పోలీస్ రికార్డుల నిర్వహణ, కేసుల దర్యాప్తు, సీసీ కెమెరాల ఏర్పాటుతో పాటు పోలీస్ స్టేషన్ పరిసరాల పరిశుభ్రత, కార్యాలయ నిర్వహణ పట్ల సీఐ వెంకట్ పనితీరును ఎస్పీ స్నేహ మెహ్రా ప్రత్యేకంగా అభినందించారు. సర్కిల్ పరిధిలో పోలీసింగ్ సేవలను సమర్థవంతంగా నిర్వహిస్తున్న తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. తీవ్రమైన నేరాల కేసుల్లో దర్యాప్తును వేగవంతం చేసి త్వరగా చార్జ్‌షీట్లు దాఖలు చేయాలని, పెండింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్పీ ఆదేశించారు. సైబర్ నేరాల నియంత్రణకు అప్రమత్తంగా ఉండాలని, గ్రామాలు, ప్రధాన



రహదారులు, ఎంట్రీ--ఎగ్జిట్ ప్రాంతాల్లో సీసీ కెమెరాల నిఘాను మరింత బలోపేతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీఎస్పీ అంజయ్య, సీఐ వెంకట్, ఎస్సై లు భరత్ భూషణ్,రాహూఫ్,గిరి పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## పార్టీలకతీతంగా గ్రామాల అభివృద్ధికి కృషి




**కొల్చారం, ఆగస్టు 19 (జనం సాక్షి) :** పార్టీలకతీతంగా గ్రామాల అభివృద్ధికి సర్పంచులతో కలిసి పనిచేస్తానని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి అన్నారు. బుధవారం మండల ప్రత్యేక అధికారి, జిల్లా విద్యాశాఖ అధికారి రాజు అధ్యక్షతన నిర్వహించిన కొల్చారం మండల సర్వసభ్య సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సర్పంచులు సమావేశం దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను అధికారులు ప్రాధాన్యతతో పరిష్కరించాలని ఎమ్మెల్యే ఆదేశించారు. ఒకసారి సమావేశంలో ప్రస్తావించిన సమస్యలు వచ్చే సమావేశానికి పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతులు యూరియా యాప్ ద్వారా బుకింగ్ చేసుకునే క్రమంలో ఎదుర్కొంటున్న ఇబ్బందులను వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మండల సర్వసభ్య సమావేశాలకు హాజరుకాని అధికారులకు మెమోలు జారీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో మండల అధికారులు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

## సకాలంలో విధులకు హాజరు కాకపోతే చర్యలు



**నారాయణపేట జిల్లా బ్యూరో, ఆగస్టు 19 (జనం సాక్షి) :** వైద్య సిబ్బంది సకాలంలో విధులకు హాజరు కాకపోతే చర్యలు తప్పవనీ జిల్లా వైద్య అధికారి జయ చంద్రమోహన్ స్పష్టం చేశారు.బుధవారం ఆయన దామరగిద్ద ప్రాథమిక ఆరో గ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రం లో ఈ డి డి క్యాలెం డర్, ఏ ఎం సి రిజిష్టర్, వ్యాధి నిరోధక టీకాల దస్త్రాలు, ఔషదదస్త్రాలు పరిశీలించారు. సిబ్బంది అందరు సమయపాలన పాటించి విధులు నిర్వహిం చాలనిహెచ్చరించారు, అలాగే కనుకుర్తి,ఉపకేంద్రం సందర్శించి ఇమ్యునైజేషన్ యాక్టివిటీస్ ను పరిశీలిం చారు. విఠల పూర్ గ్రామంలో బాలింత తల్లు లకు తల్లిపాల గురించి వివ రించి చెప్పారు. వర్షా కాలంలో వచ్చే వ్యాధుల గురించి తీసుకోవాల్సిన ఆహారం అలవాట్ల గురించి సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో ఇంచార్జి వైద్య అధికారిణి డాక్టర్ అంభిక,బిక్షపతి,అరవింద్ జిల్లా కోఆర్డినేటర్, నారా యణ, వెంకట్ రాంరెడ్డి ఫార్మసీ ఆఫీసర్, వెంకటేష్ సూపర్ వైజర్,సిబ్బంది పాల్గొన్నారు.

# భూ సేకరణకు రైతులు సహకరించాలి

- జిల్లా కలెక్టర్ ప్రియాంక

**నారాయణపేట జిల్లా బ్యూరో, ఆగస్టు 19 (జనం సాక్షి) :** బుద్వేల్-నాచారం రేడియల్ రోడ్డు - ప్రాజెక్టుకు సంబంధించి నారాయణ పేట జిల్లాలోని కోస్గి మండలం నాచారం, తోగాపూర్ గ్రామాల పరిధిలో భూసేక రణ కోసం ఆయా గ్రామాల రైతులతో బుధవారం జిల్లా కలెక్టరేట్‌లోని వీసీ హాల్‌లో వేర్వేరుగా జిల్లా స్థాయి చర్చల కమిటీ సమావే శాలు నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలె క్టర్ మాట్లాడుతూ,ప్రాజెక్టు లకు అవసరమైన భూసేక రణ ప్రక్రియను నిబంధనల ప్రకారం,పారదర్శకంగా,వేగవంతంగా పూర్తి చేసేం దుకు భూయజమానులు సహకరించాలని కోరారు.భూసేకరణ పరిహారం విషయంలో ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలు, సంబంధిత భూమికి ఉన్న ప్రాథమిక మార్కెట్ విలువ ఆధారంగానే పరిహారం నిర్ణయించాల్సి ఉంటుందని కలెక్టర్ స్పష్టం చేశారు.ఇతర జిల్లాల్లో అమలవు తున్న పరిహార రేట్లను నారాయణపేట జిల్లాతో నేరుగా పోల్చడం సరికాద ని, ప్రతి ప్రాంతానికి సంబం ధించిన ప్రాథమిక మార్కెట్ విలువ,భూసేకరణ నిబంధ నల ఆధారంగా పరిహారం నిర్ణయించాల్సి ఉంటుందని వివరించారు.ప్రస్తుత మార్కెట్ విలువలో వచ్చిన మార్పులను కూడా నిబం ధనల మేరకు పరిగణన లోకి తీసుకుంటామని తెలిపారు.భూసేకరణ చట్టం ప్రకారం అర్హత కలిగినభూయజమానులకు మార్కెట్ విలువతో పాటు చట్టబద్ధమైన సొలాటియం,అదనపు పరిహారం తదితర ప్రయోజనాలుఅందుతాయని పేర్కొన్నారు. భూయజ మానులు అంగీకరిస్తే పర స్పర సమ్మతితో పరిహారం చెల్లింపు ప్రక్రియను త్వరి తగతిన పూర్తి చేసే అవ కాశం ఉంటుందని కలెక్టర్ తెలిపారు. అంగీకారం లేని సందర్భాల్లో చట్ట ప్రకారం జనరల్ అవార్డు ప్రక్రియను కొనసాగించాల్సి ఉంటుంద ని స్పష్టం చేశారు. భూసేకర ణ ప్రక్రియను ఆలస్యం చేయకుండా పూర్తి చేయ డం ద్వారా రేడియల్ రోడ్డు ప్రాజెక్టు నిర్మాణ పనులను కూడా త్వరగా ప్రారంభించి పూర్తి చేసే అవకాశం ఉంటుందని కలెక్టర్ తెలి పారు. భూయజమానుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని, నిబంధనలకు లోబడి సాధ్యమైనంత త్వరగా పరిహారం అందేలా జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నా రు.భూయజమానులు వాస్తవ పరిస్థితులను అర్థం చేసుకుని, జిల్లా అభివృద్ధి తో పాటు రేడియల్ రోడ్డు ప్రాజెక్టు నిర్మాణానికి సహ కరించాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.ఈ సమావే శంలో జిల్లా రెవెన్యూ అద నపు కలెక్టర్ శ్రీను,జిల్లా గ్రంథాలయ సంస్థల చైర్మన్ వార్ల విజయ్ కుమార్, ఆర్డీవో రమేష్, కోస్గి తహ సీల్దార్ కళ్యాణి, భూసేకరణ విభాగం డీటీలు, ఆయా గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.



# రైతుల ఆదాయం పెంచేందుకు ఉద్యానవన పంటల సాగును ప్రోత్సహించాలి

- దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి



**దేవరకద్ర, ఆగస్ట్ 19 (జనం సాక్షి) :** రైతుల ఆదాయం పెంచడంతో పాటు నీటి వనరులు, భూసారాన్ని పరిరక్షించేందుకు ఉద్యానవన, తక్కువ నీటి వినియోగ పంటల సాగును ప్రోత్సహించాలని దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి అన్నారు. బుధవారం భూత్పూర్ మండలం శేరిపల్లి గ్రామంలో జిల్లా ఉద్యానవన, పట్టుపరిశ్రమ శాఖల ఆధ్వర్యంలో రైతులకు, గ్రామ సర్పంచ్‌లకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా, టి.జి.ఎస్.పి.డి.సి.ఎల్ సి.ఎం.డి జితేష్ పాటిల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎల్ నినో ప్రభావం వల్ల వాతావరణ పరిస్థితులు మారి వర్షాభావం ఏర్పడుతున్నందున వరికి ప్రత్యామ్నాయంగా కూరగాయలు, ఆయిల్‌పామ్, చిరుధాన్యాలు, పప్పుధాన్యాలు, నూనెగింజలు తదితర పంటల సాగుపై రైతులకు అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో లిఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డిలి మాట్లాడుతూ పంటల మార్పిడి, ఆధునిక సాగు పద్ధతులను రైతులు అవలంబించాలని సూచించారు. తక్కువ వర్షపాతం, భవిష్యత్ వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని తక్కువ నీటితో అధిక ఆదాయం ఇచ్చే పంటలను ఎంచుకోవాలన్నారు. రైతులకు నాణ్యమైన కూరగాయల నారు, విత్తనాలు, మల్చింగ్, పందిళ్ల సాగు వంటి సదుపాయాలను ప్రభుత్వం అందిస్తున్నందున సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రైతులు సమూహాలుగా ఏర్పడి సాగు వివరాలను ఉద్యానవన శాఖకు అందిస్తే అవసరమైన నారును తెప్పించి అందించే అవకాశం ఉందన్నారు. ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహించాలని, కొత్తకోట సమీపంలోని శంకరెడ్డిపల్లిలో నిర్మిస్తున్న ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ అందుబాటులోకి వస్తే మార్కెటింగ్ సమస్యలు తగ్గుతాయని పేర్కొన్నారు. రైతులకు సబ్సిడీలు త్వరగా మంజూరు చేయాలని అధికారులను కోరారు. అదేవిధంగా దేవరకద్ర నియోజకవర్గంలోని గ్రామాల్లో తక్కువ వోల్టేజీ, ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ తీగలు తదితర సమస్యలను పరిష్కరించాలని విద్యుత్ శాఖ ఉన్నతాధికారి టి.జి.ఎస్.పి.డి.సి.ఎల్. సి.ఎం డి. జితేష్ పాటిల్ ను కోరారు. అలాగే బూత్‌పూర్‌లో విద్యుత్ సబ్‌డివిజన్ కార్యాలయంతో పాటు ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. టి.జి.ఎస్.పి.డి.సి.ఎల్ సి.ఎం.డి జితేష్ పాటిల్‌లి మాట్లాడుతూ వ్యవసాయాన్ని కేవలం ఒకే పంటకు పరిమితం చేయకుండా పాడి, మేకల పెంపకం, చేపలు, తేనెటీగల పెంపకం, ఉద్యాన పంటలు, కూరగాయలు వంటి అనుబంధ రంగాలను సమన్వయం చేసుకోవాలని సూచించారు. కొత్త పంటలను ముందుగా చిన్న విస్తీర్ణంలో ప్రయోగాత్మకంగా సాగు చేసి, ఫలితాలను బట్టి విస్తరించాలన్నారు. మార్కెట్ అవకాశాలను ముందుగానే గుర్తించి ప్రాసెసింగ్, విలువ ఆధారిత ఉత్పత్తుల ద్వారా అదనపు ఆదాయం పొందవచ్చన్నారు. మట్టిని కాపాడుకోవడం అత్యంత ముఖ్యమని, పంట అవశేషాలను కాల్చకుండా సేంద్రియ పదార్థాలుగా మార్చి భూమికి అందించాలని సూచించారు. జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తాలి మాట్లాడుతూ మారుతున్న వాతావరణ పరిస్థితులు, అనిశ్చిత వర్షపాతం, భూగర్భ జలాల తగ్గుదలను దృష్టిలో ఉంచుకుని రైతులు పంటల సాగు విధానంలో మార్పులు చేసుకోవాలని సూచించారు. వరి, పత్తితో పాటు కూరగాయలు, పూలు, ఆయిల్‌పామ్, పప్పుధాన్యాలు, నువ్వులు, ఆముదం వంటి ప్రత్యామ్నాయ పంటలను పరిశీలించాలన్నారు. కొత్తగా ఎన్నికైన సర్పంచ్‌లు తమ గ్రామాల్లో కొంతమంది రైతులతో ప్రయోగాత్మకంగా పంటల మార్పిడిని ప్రారంభించి, ఇతరులకు ఆదర్శంగా నిలవాలని సూచించారు. రైతులకు అవసరమైన సాంకేతిక సహాయం, విత్తనాలు, వ్యవసాయ సమాచారం అందించేందుకు జిల్లా యంత్రాంగం, సంబంధిత శాఖలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. అంతకు ముందు లిజిల్లా ఉద్యానవన శాఖ అధికారి వేణుగోపాల్‌లి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జిల్లాలో ఉద్యానవన శాఖ ద్వారా అమలు చేస్తున్న పథకాలను, రైతులకు అందిస్తున్న ప్రోత్సాహకాలు, సబ్సిడీల గురించి వివరించారు. తక్కువ నీటితో సాగయ్యే కూరగాయలు, చిరుధాన్యాలు, పప్పుధాన్యాలు, నూనెగింజలు, ఆయిల్‌పామ్ వంటి ప్రత్యామ్నాయ పంటలను రైతులు చేపట్టాలని సూచించారు. డ్రిప్, మైక్రో ఇరిగేషన్, మల్చింగ్, పందిళ్లు, నాణ్యమైన నారు వంటి సదుపాయాలను వినియోగించుకోవాలని కోరారు. స్థానిక మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా పంటలను ఎంచుకుని ముందస్తు మార్కెటింగ్ ప్రణాళికతో సాగు చేయాలని సూచించారు. తొలుత, కలెక్టర్ ఖుష్బూ గుప్తా, ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి, సి. ఎం .డి జితేష్ పాటిల్ తో కలిసి శేరిపల్లి రైతులు వీరస్వామి, లక్ష్మయ్య సాగు చేస్తున్న కాకరకాయ, చిక్కుడుకాయ తోటలను పరిశీలించారు. రైతులు ఎకరాకు సుమారు రూ.20 వేల పెట్టుబడితో సాగు చేస్తున్నామని, అనుకూల దిగుబడి వస్తే మూడు నెలల్లో సుమారు రూ.2 లక్షల ఆదాయం వచ్చే అవకాశం ఉందని వివరించారు. అనంతరం ఉద్యానవన శాఖ ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించి సాగు ఉపకరణాలు, తేనె ఉత్పత్తులు, రైతులకు అందించనున్న కూరగాయల నారును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో భూత్పూర్ మున్సిపల్ చైర్మన్ బాలకోటి, వ్యవసాయ శాఖ అధికారి గోవింద్ నాయక్, గ్రామ సర్పంచ్‌లు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## రేషన్ పంపిణీలో అక్రమాలు సహించేది లేదు

- అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ



**జడ్చర్ల, ఆగస్టు 19 (జనంసాక్షి) :** ప్రభుత్వ ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా అందిస్తున్న రేషన్ బియ్యం అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి సక్రమంగా, పారదర్శకంగా అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ ఆదేశించారు. బుధవారం జడ్చర్ల పట్టణంలోని మదీనా కాలనీలో ఉన్న చౌక ధర దుకాణం (షాప్ నంబర్: 1423001) ను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. దుకాణంలోని బియ్యం నిల్వలను, పంపిణీ ప్రక్రియను, రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ రేషన్ బియ్యం పంపిణీలో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా నిబంధనలను కచ్చితంగా పాటించాలని స్పష్టం చేశారు. లబ్ధిదారులకు బియ్యం పంపిణీలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని సూచించారు. తనిఖీలో జడ్చర్ల తహశీల్దార్ నర్సింగ రావు, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## ముసాయిదా ఓటర్ల జాబితాను పరిశీలించుకోవాలి

- రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ



**జడ్చర్ల, ఆగస్టు 19 (జనంసాక్షి) :** జడ్చర్ల అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో ప్రచురించిన ముసాయిదా ఓటర్ల జాబితాను ఓటర్లు పరిశీలించుకుని, వివరాల్లో ఏవైనా మార్పులు లేదా చేర్పులు ఉంటే నిర్ణీత వ్యవధిలో క్లెయిమ్‌లు, అభ్యంతరాలను దాఖలు చేసుకోవాలని రెవెన్యూ అదనపు కలెక్టర్, ఎన్నికల నమోదు అధికారి జె.ఎల్.బి. హరిప్రియ సూచించారు. బుధవారం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో జడ్చర్ల తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. జాబితాలోని మ్యాపింగ్ లేని, తేడాలు ఉన్నకేటగిరీ ఓటర్లకు నోటీసులు జారీ చేయనున్నట్లు వెల్లడించారు. మార్పులు, చేర్పుల కోసం అందిన దరఖాస్తులను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని, ఓటర్ల జాబితాలో మీ పేరును సరిచూసుకోవడానికి, దరఖాస్తుల స్థితిని తెలుసుకోవడానికి ఎన్నికల కమిషన్ అందిస్తున్న ఓటర్స్ సర్వీసెస్ పోర్టల్ ద్వారా, అలాగే తెలంగాణ ప్రాంతీయ ఎన్నికల సమాచారం, ఇతర అధికారిక వివరాల పరిశీలనకు సీఈఓ తెలంగాణ పోర్టల్ ను ఉపయోగించుకోవచ్చని తెలిపారు. సమావేశంలో వివిధ మండలాల తహసీల్దార్లు, సహాయ ఎన్నికల నమోదు అధికారులు, మున్సిపల్ కమిషనర్, డిప్యూటీ తహసీల్దార్లు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఫోటోగ్రాఫర్ల సంక్షేమానికి కృషి

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



**పటాన్చెరు, ఆగస్టు 19 (జనం సాక్షి) :** నియోజకవర్గంలోని ఫోటోగ్రాఫర్ల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం పురస్కరించుకొని.. ప్రొఫెషనల్ ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ పటాన్చెరు వారి ఆధ్వర్యంలో పటాన్చెరు పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన వేడుకల్లో ఎమ్మెల్యే జిఎంఆర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. ఫోటోగ్రఫీ రంగంలో వస్తున్న ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకున్నప్పుడే మనుగడ ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు అనిల్ కుమార్, ప్రధాన కార్యదర్శి లక్ష్మారెడ్డి, మాజీ అధ్యక్షులు కృష్ణ యాదవ్, ప్రతినిధులు పవన్, వీరేశం, రాజేశ్వర్, రజనీకాంత్, సుధాకర్, అశోక్, కార్తీక్ గౌడ్, నరసింహ, సునీల్, శంకర్, రవీందర్, సతీష్, సదానందం, అశోక్, మహిపాల్ రెడ్డి, వీరన్న, నరసింహ, పరమేశ్వరరావు, మురళి, నరేందర్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

## మయూరి నగర్ అభివృద్ధికి సహకారం



**రామచంద్రాపురం, ఆగస్టు 19 (జనం సాక్షి) :** మయూరి నగర్ కాలనీ అభివృద్ధికి అన్ని విధాలా సహకరిస్తామని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి తెలిపారు. కాలనీలో రూ.5.75 లక్షల సొంత నిధులతో ఏర్పాటు చేసిన బోరును బుధవారం ఆయన ప్రారంభించారు. ప్రభుత్వ నిధులతో పాటు సొంత నిధులతోనూ అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు చెప్పారు. అభివృద్ధిలో ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు. బీరప్ప ఆలయ నిర్మాణానికి శ్రీకారం: రామచంద్రాపురం డివిజన్‌లోని ఈఎస్ఐ ఆసుపత్రి సమీపంలో నిర్మించనున్న బీరప్ప దేవాలయ నిర్మాణ పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఆలయ నిర్మాణానికి సంపూర్ణ సహకారం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ అంజయ్య, నాయకులు పరమేష్ యాదవ్, ఐలేష్ యాదవ్, కాలనీ అసోసియేషన్, కురుమ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

## పంచాయతీ కార్మికులను రెగ్యులర్ చేయాలి



**శివ్వంపేట, ఆగస్ట్ 19 (జనంసాక్షి) :** గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించి, వారిని రెగ్యులర్ చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు మహేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. మండల కేంద్రమైన శివ్వంపేట లోని ఎంపిడిఓ కార్యాలయం ఎదుట బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో 2వ రోజు దీక్షాలో పాల్గొన్నారు. అనంతరం ఎంపిడిఓకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు మహేందర్ రెడ్డి మాట్లాడుతూ పంచాయతీ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు పంచాయతీ సిబ్బందిని పర్మినెంట్ చేయాలని, రెండో పిఆర్సీలోకి తీసుకొని కనీస వేతనం రూ. 26 వేలుగా నిర్ణయించాలని డిమాండ్ చేశారు. జీఓ నం.51ను సవరించి, మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేయాలని, కార్టర్, బిల్ కలెక్టర్లకు ప్రత్యేక హోదా కల్పించాలని కోరారు. గ్రీన్ ఛానల్ ద్వారా వేతనాలు సకాలంలో చెల్లించాలని, వయసు సడలింపు, ఆరోగ్యకార్డులు గుర్తింపు, మరణించిన కార్మికుల కుటుంబ సభ్యులకు పని కల్పించాలని డిమాండ్ చేశారు. ఆన్‌లైన్‌లో సమోదు కాని కార్మికులను వెంటనే సమోదు చేయాలని కోరారు. మరణించిన పంచాయతీ కార్మికుల దహన సంస్కారాలకు రూ.30 వేల ఆర్థిక సాయం అందించాలన్నారు. ఈ కార్యక్రమం లో వెంకటేష్, శంకర్, వసంత, స్వామి, ఆంజనేయులు, భిక్షపతి, శ్రీకాంత్, అశోక్, కీర్తన, నర్సయ్య, నర్సమ్మ, సుగుణమ్మ, మహేష్, చేన్నయ్య ,కిష్టయ్య, లత, బాబు, చంద్రయ్య, ఎల్లమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## బాలికల ఆరోగ్యం, భద్రతపై అవగాహన



**సంగారెడ్డి బ్యూరో, ఆగస్టు 19 (జనం సాక్షి) :** బేటీ బచావో--బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా మహిళా, శిశు సంక్షేమ శాఖ, జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో అందోల్ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో విద్యార్థినులకు రుతుక్రమ పరిశుభ్రత, పోషకాహారం, వ్యక్తిగత పరిశుభ్రత, బాలికల భద్రత, సైబర్ నేరాలు, సాధికారతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ... బాలికలు విద్యతో పాటు స్పష్టమైన లక్ష్యాలను ఏర్పరచుకుని, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని సూచించారు. సురక్షిత స్పర్శ, అసురక్షిత స్పర్శ, ఆన్‌లైన్ భద్రత, వ్యక్తిగత సమాచార పరిరక్షణపై అవగాహన కల్పించారు. సమతుల్య ఆహారం తీసుకోవడం ద్వారా రక్తహీనతను నివారించవచ్చని, పరిశుభ్రత పాటించాలని తెలిపారు. అనంతరం శానిటరీ ప్యాడ్ బ్యాంకు ద్వారా విద్యార్థినులకు 3,000 శానిటరీ ప్యాడ్లను పంపిణీ చేశారు. వాటి వినియోగం, భద్రపరచడం, సురక్షితంగా పారవేయడంపై వివరించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ ఆకుల సత్యనారాయణ, సీడీపీఓ మాధులిక, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

## ఫోటోగ్రాఫర్లకు సబ్సిడీ రుణాలు ఇవ్వాలి



**సదాశివపేట, ఆగస్టు 19 (జనంసాక్షి) :** ఫోటో, వీడియో గ్రాఫర్లకు ప్రభుత్వం సబ్సిడీపై రుణాలు అందించి వారి ఆర్థిక అభివృద్ధికి కృషి చేయాలని పట్టణ ఫోటోగ్రాఫర్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగుల విజయ్‌కుమార్ కోరారు. ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం పట్టణంలో అసోసియేషన్ ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ కెమెరా కేవలం పరికరం కాదని, ఫోటోగ్రాఫర్ల వృత్తికి గుర్తింపు అన్నారు. చరిత్రను భద్రపరిచే బాధ్యత ఫోటోగ్రాఫర్లదేనన్నారు. యువ ఫోటోగ్రాఫర్లు ఫోటోగ్రఫీతో పాటు వీడియో, డ్రోన్, ఎడిటింగ్, ఆల్బమ్ డిజైన్, సోషల్ మీడియా, ఏఐ వంటి ఆధునిక రంగాల్లో నైపుణ్యం పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ముదిగొండ జయచింతన్, కోశాధికారి కర్ణాకర్, ఉపాధ్యక్షులు కాషా సంగమేశ్వర్, వై. మహేష్, శివశంకర్, గొల్లపల్లి శ్రీనివాస్, రుమాండ్ల రాజు, బండారి సుభాష్, ఎం. సంతోష్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## వెరిఫికేషన్ ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలి




**సిద్దిపేట బ్యూరో, ఆగస్టు 19 (జనంసాక్షి) :** ఇందిరమ్మ ఇండ్ల వెరిఫికేషన్ ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలని సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి అధికారులను ఆదేశించారు. బుదవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఇందిరమ్మ ఇళ్ల గెజిటెడ్ ఆఫీసర్ వెరిఫికేషన్ ప్రక్రియ గూర్చి ఏంపిడిఓ, గృహనిర్మాణ శాఖ ఇంజనీరింగ్ అధికారులతో జిల్లా కలెక్టర్ కె. హైమావతి జూమ్ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. రెండవ దశలో మంజూరైన ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ఆయా మండలాల వారిగా గెజిటెడ్ ఆఫీసర్ వెరిఫికేషన్ ప్రక్రియ యుద్ద ప్రతిపాదకన పూర్తి చేయాలని ఎంపీడీవోలు, గృహ నిర్మాణ శాఖ ఏఈలను ఆదేశించారు. విచారణ ప్రక్రియ పూర్తి అయిన వెంటనే సంబంధిత మండల ఎంపీడీవోలు మంజూరు కోసం కలెక్టరేట్ కు సమర్పించాలని సూచించారు.

## జలసిరి పనులు వేగవంతం చేయాలి



**పెద్దశంకరంపేట, ఆగస్టు 19 (జనం సాక్షి) :** పెద్ద శంకరంపేట మండల పరిధిలోని ఆయా గ్రామాలలో జలసిరి పనులను వేగవంతం చేయాలని గ్రౌండ్ చేసి లక్ష్యాలను సాధించే విధంగా క్షేత్రస్థాయిలో సమన్వయంగా అధికారులు పనిచేయాలని పెద్ద శంకరంపేట ఎంపీడీవో పేర్కొన్నారు. బుధవారం పెద్ద శంకరంపేట లోని ఎంపీడీవో కార్యాలయంలో వి బి జి రాంజీ పథకం కింద చేపడుతున్న పనులు.. పింఛన్ల పురోగతిపై పంచాయతీ కార్యదర్శులు. ఫీల్డ్ అసిస్టెంట్ లు తదితర అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.. జలసిరి పనులు. చేయూత పింఛన్ల అమలులో ఎలాంటి చెప్పం లేకుండా నిర్దేశించిన లక్ష్యాలను నిర్ణిత సమయంలో పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. చేయూత పింఛన్లకు సంబంధించిన అర్హులైన లబ్ధిదారుల ప్రతిపాదనలు సక్రమంగా సేకరించి అవసరమైన ధ్రువ పత్రాలతో ప్రక్రియను వేగవంతం చేయాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. ఈ సమావేశంలో ఎంపీ ఓ జాకీర్ హుస్సేన్. ఏపీఓ సంతోష్ కుమార్. ఈసీ నవాజుద్దీన్ పంచాయతీ కార్యదర్శులు ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

# పంచాయతీ కార్మికుల వేతనాలు పెంచాలి

- మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేయాలి
- సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కడారి నాగరాజు



**నర్సాపూర్, ఆగస్టు 19 (జనం సాక్షి) :** గ్రామ పంచాయతీ ఉద్యోగులు, కార్మికుల వేతనాలు పెంచడంతో పాటు మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని తక్షణమే రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కడారి నాగరాజు డిమాండ్ చేశారు. తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా బుధవారం నర్సాపూర్ ఎంపీడీవో మాలతికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, విద్యుత్ తదితర కీలక సేవలను అందిస్తూ పంచాయతీ ఉద్యోగులు, కార్మికులు ఎన్నో ఏళ్లుగా పనిచేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం వారి సమస్యలను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మల్టీపర్పస్ వర్కర్ విధానం అమలుతో కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ విధానం వల్ల రాష్ట్రవ్యాప్తంగా 800 మందికి పైగా కార్మికులు మృతిచెందారని పేర్కొన్నారు.నైపుణ్యానికి సంబంధం లేని వివిధ రకాల పనులను కార్మికులతో చేయించడం వల్ల వారు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. ప్రభుత్వం వెంటనే మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని పూర్తిగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పంచాయతీ కార్మికులను రెండో పీఆర్సీ పరిధిలోకి తీసుకురావాలని, కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని కోరారు. జీవో నంబర్ 51ను సవరించి మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేయడంతో పాటు కార్మికులకు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కనీస సౌకర్యాలు కల్పించడంతో పాటు కార్మికుల మృతికి సంబంధించిన దహన సంస్కారాల కోసం రూ.30 వేల ఆర్థిక సాయం అందించాలని కోరారు.రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీ కార్మికుల సమస్యలపై పునరాలోచించి తక్షణమే పరిష్కరించాలని నాగరాజు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో రమేష్, నర్సింలు, వీరేశం, భిక్షపతి, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

# పాలిటెక్నిక్ విద్యార్థుల రాస్తారోకో




**బెల్లంపల్లి, ఆగస్టు 19 (జనంసాక్షి) :** బెల్లంపల్లి పట్టణంలో బుధవారం పాలిటెక్నిక్ విద్యార్థులు కదం తొక్కారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జీవో నంబర్ 97 ద్వారా పాలిటెక్నిక్ కళాశాలలను యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ పరిధిలోని ఐటీఐ వ్యవస్థలో విలీనం చేయాలని చూస్తోందని ఆరోపిస్తూ విద్యార్థులు పెద్ద ఎత్తున రాస్తారోకో, నిరసన ర్యాలీ నిర్వహించారు.?బీఆర్ఎస్ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో స్థానిక పాలిటెక్నిక్ కళాశాల నుండి బజార్ ఏరియా మీదుగా భారీ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ విద్యార్థి విభాగం నాయకుడు బడికల శ్రావణ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేసే విధంగా నిర్ణయాలు తీసుకుంటోందని తీవ్రంగా మండిపడ్డారు. పాలిటెక్నిక్ కళాశాలలను ఈ విధంగా విలీనం చేయడం వల్ల సాంకేతిక విద్య ప్రమాణాలు పడిపోయి, విద్యార్థుల భవిష్యత్తు అంధకారంలో పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.? సింగరేణి బొగ్గు గనుల ప్రాంతంలో ఎంతో మంది విద్యార్థులు పాలిటెక్నిక్ పూర్తి చేసి, పోటీ పరీక్షల్లో ఉత్తీర్ణులై ఉన్నత స్థాయి అధికారుల హోదాలో స్థిరపడ్డారని గుర్తుచేశారు. ప్రభుత్వం తీసుకువచ్చిన వివాదా స్పద నిర్ణయం వల్ల విద్యార్థులు నైపుణ్యాలను కోల్పోయి, చివరకు కూలీ పనులకు వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడుతుందని హెచ్చరించారు. నిరుద్యోగ యువత, విద్యార్థుల మద్దతుతోనే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందనే విషయాన్ని ప్రభుత్వం విస్మరించవద్దని స్పష్టం చేశారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని వెంటనే జీవో నంబర్ 97ను బేషరతుగా ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులను ఏకం చేసి పెద్ద ఎత్తున ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

# ఎస్సీ, ఎస్టీ నిధులు పక్కదారి పట్టిస్తే కఠిన చర్యలు

- నిధులను ఎస్సి, ఎస్టీలకు ఖర్చు చేయకపోతే అధికారులదే బాధ్యత..
- పెండింగ్‌లో ఉన్న కేసులను పరిష్కరించేందుకు కృషి చేయాలి..
- రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ బక్కి వెంకటయ్య..
- భూపాలపల్లి కలెక్టరేట్ లో అధికారులతో కలిసి సమీక్ష..



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** ఎస్సీ, ఎస్టీ ఉప ప్రణాళిక నిధులు పక్కదారి పట్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. బుధవారం ఐడిఓసి కార్యాలయంలో ఎస్సి, ఎస్టీలకు సంబంధించిన భూ సమస్యలు, ఆర్ ఓ ఆర్, ఉద్యోగుల పదోన్నతులు, ఉప ప్రణాళిక నిధులు వినియోగం, సంక్షేమం, హక్కుల పరిరక్షణ, ప్రభుత్వ పథకాల అమలు, ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం కింద నమోదైన కేసుల పురోగతి తదితర అంశాలపై జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, వివిధ శాఖల అధికారులతో కలిసి కమిషన్ ఛైర్మన్, సభ్యులు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఛైర్మన్ బక్కి వెంకటయ్య మాట్లాడుతూ మంజూరైన నిధులను ఎస్సి, ఎస్టీ ఆవాసాలకు ఖర్చు చేయకపోతే ఆయా శాఖల అధికారులదే భాధ్యత ఉంటుందని స్పష్టం చేశారు. ఎస్సీ, ఎస్టీలకు రాజ్యాంగం కల్పించిన హక్కులు, రక్షణలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీల హక్కుల పరిరక్షణ, సంక్షేమం, అభివృద్ధి కోసం అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. ప్రజల సమస్యలను కేవలం కార్యాలయాలకే పరిమితం చేయకుండా క్షేత్రస్థాయిలో పర్యటించి పరిష్కరించాలని అన్నారు. ఎస్సీ, ఎస్టీలపై జరిగే అఘాయిత్యాలకు సంబంధించిన కేసుల విషయంలో పోలీసులు, రెవెన్యూ తదితర శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఛైర్మన్ సూచించారు. జిల్లాలో ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం కింద నమోదైన కేసుల పురోగతిపై సమీక్షించారు.

కేసుల దర్యాప్తు, బాధితులకు న్యాయం, పరిహారం అందించడం వంటి అంశాల్లో ఎలాంటి జాప్యం ఉండకూడదని స్పష్టం చేశారు. పెండింగ్‌లో ఉన్న కేసులను నిబంధనల ప్రకారం త్వరితగతిన పరిష్కరించేందుకు ప్రత్యేక శ్రద్ధ చూపాలని పోలీసు, రెవెన్యూ అధికారులను ఆదేశించారు. కేసుల పురోగతిని సమర్థవంతంగా పర్యవేక్షిస్తున్న జిల్లా కలెక్టర్, ఎస్పీతో పాటు సంబంధిత అధికారులను ఆయన అభినందించారు. ప్రమోషన్లలో రోస్టర్ రిజర్వేషన్లు తప్పనిసరిగా పాటించాలని, ప్రభుత్వ శాఖల్లో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు పదోన్నతులు కల్పించే సమయంలో రోస్టర్ రిజర్వేషన్ నిబంధనలను ఖచ్చితంగా అమలు చేయాలని ఆయన స్పష్టం చేశారు. ప్రమోషన్లలో రిజర్వేషన్ నిబంధనల అమలులో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని, సంబంధిత అధికారులు నిబంధనలను పూర్తిగా పాటించాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు రాజ్యాంగపరంగా కల్పించిన హక్కులకు భంగం కలగకుండా అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. బాధితులకు పరిహారంతో పాటు ఉపాధి, పునరావాసం, తీవ్రమైన నేరాలకు, ముఖ్యంగా హత్య, అత్యాచారం వంటి ఘటనలకు గురైన ఎస్సీ, ఎస్టీ బాధిత కుటుంబాలను కేవలం పరిహారంతోనే వదిలేయకుండా వారి పునరావాసంపై కూడా ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. నిబంధనల ప్రకారం అర్హులైన బాధితులకు పరిహారం అందించడంతో పాటు అవసరాన్ని బట్టి ఉపాధి అవకాశాలు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగాలు, గృహ వసతి, పునరావాస సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. బాధిత కుటుంబాలు ఆర్థికంగా, సామాజికంగా నిలదొక్కుకునేలా సంబంధిత శాఖలు సమన్వయంతో చర్యలు చేపట్టాలని తెలిపారు. ప్రతి గ్రామంలో సివిల్ రైట్స్ డేను సమర్థవంతంగా నిర్వహించాలని, ప్రతి నెల గ్రామ స్థాయిలో నిర్వహించే సివిల్ రైట్స్ డే కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమాలకు కేవలం కింది స్థాయి సిబ్బంది మాత్రమే హాజరుకాకుండా తహశీల్దార్లు, ఎస్ఐలు, సంబంధిత శాఖల అధికారులు తప్పనిసరిగా పాల్గొనాలని సూచించారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ బాధితులకు కమిషన్ సూచించిన విధంగా ఇళ్ళు కేటాయింపుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రతి నెలా క్రమం తప్పక పౌర హక్కుల దినోత్సవం నిర్వహిస్తామని తెలిపారు. ఎస్పి సంకీర్త్ మాట్లాడుతూ అత్యాచార తదితర సంఘటనలపై తక్షణమే కేసులు నమోదు చేస్తామని తెలిపారు. కమిషన్ నుండి 6 దరఖాస్తులు వచ్చాయని, వాటిలో మూడు కేసులు విచారణలో ఉన్నట్లు తెలిపారు. అనంతరం ఛైర్మన్ కు, సభ్యులకు జ్ఞాపికలను అందచేశారు. ఈ సమావేశంలో కమిషన్ సభ్యులు కుసురం నీలాదేవి, రాంబాబు నాయక్, కొంకటి లక్ష్మి నారాయణ, అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, అదనపు ఎస్పీ నరేష్ కుమార్, డీఆర్వో వసంత కుమారి, ఎస్సి అభివృద్ధి అధికారి సుకీర్తి జై భీం, ఆర్డీఓలు హరికృష్ణ, రవీందర్, కాటారం, భూపాలపల్లి డీఎస్పీలు సూర్య నారాయణ, సంపత్ రావు, శిక్షణా డిప్యూటీ కలెక్టర్ నవీన్ రెడ్డి, అన్ని శాఖల జిల్లా అధికారులు, అన్ని మండలాల తహశీల్దార్లు, ఎంపిడివోలు వివిధ శాఖల జిల్లా అధికారులు, కుల సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# రేవంత్ రెడ్డికి భయమెందుకు?

- అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు
- మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి



**హనుమకొండ ప్రతినిధి, ఆగస్టు 19 (జనంసాక్షి) :** నర్సంపేట బంద్ నేపథ్యంలో పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డిని హనుమకొండ వారి స్వగృహం నందు పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు.ప్రజల పక్షాన ప్రశ్నిస్తే నిర్బంధం.. ప్రభుత్వాన్ని నిలదీస్తే హౌస్ అరెస్ట్.. ఇదేనా కాంగ్రెస్ చెప్పుకునే ప్రజా పాలన? అని చల్లా ధర్మారెడ్డి ప్రశ్నించారు. నర్సంపేట ప్రజలు స్వచ్ఛందంగా బంద్‌కు పిలుపునిచ్చి నిరసన వ్యక్తం చేస్తుంటే.. ఉద్యమానికి మద్దతు తెలిపే నాయకులను పోలీసులు అడ్డుకోవడం రేవంత్ రెడ్డి ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిదర్శనమన్నారు.విగ్రహం తొలగిస్తే చరిత్ర చెరిగిపోదు.. నాయకుడిని నిర్బంధిస్తే ప్రజల గొంతు మూగబోదు" అని చల్లా ధర్మారెడ్డి అన్నారు. ఉద్యమకారుడు, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి గారి విగ్రహాన్ని తొలగించడం ద్వారా ఆయనపై ప్రజల్లో ఉన్న అభిమానాన్ని చెరిపేయలేరని స్పష్టం చేశారు. పెద్ది సుదర్శన్ రెడ్డికి జరిగిన అవమానంపై ప్రజల్లో ఉన్న ఆగ్రహాన్ని అణచివేయడం ఎవరి తరం కాదన్నారు. "నన్ను హౌస్ అరెస్ట్ చేయడం కాదు.. ప్రజాస్వామ్యాన్ని హౌస్ అరెస్ట్ చేయడమే. నిర్బంధాలతో ఉద్యమాన్ని ఆపలేరు.. గొంతు నొక్కి ప్రజల ఆగ్రహాన్ని అణచలేరు" అని చల్లా ధర్మారెడ్డి ఘాటుగా వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే తన తప్పును సరిదిద్దుకుని పెద్ది సుదర్శన్ రెడ్డి విగ్రహాన్ని పునఃప్రతిష్ఠించాలని, అక్రమ నిర్బంధాలను నిలిపివేయాలని ఆయన డిమాండ్ చేశారు.

# 444.75 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత

- రేగొండలో పాత రైస్ మిల్ గోడౌన్‌లో అక్రమ నిల్వలు..



**రేగొండ (జనంసాక్షి):** రేగొండ మండలంలోని పాత రైస్ మిల్ గోడౌన్‌లో అక్రమంగా నిల్వ చేసిన 444.75 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని అధికారులు పట్టుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు 18న సాయంత్రం సుమారు 7 గంటల సమయంలో పాత రైస్ మిల్ గోడౌన్‌లో పీడీఎస్ బియ్యం అక్రమంగా నిల్వ ఉంచినట్లు సమాచారం అందింది. సమాచారం అందిన వెంటనే పౌర సరఫరాల శాఖ ఇన్‌స్పెక్టర్ రాజు సంబంధిత గోడౌన్‌లో ఆకస్మిక తనిఖీ నిర్వహించగా పెద్ద మొత్తంలో పీడీఎస్ బియ్యం బస్తాలు గుర్తించబడ్డాయి. ఈ విషయాన్ని వెంటనే జిల్లా మేనేజర్, జిల్లా పౌర సరఫరాల అధికారికి తెలియజేయగా, వారు సంఘటనా స్థలాన్ని పరిశీలించి లభ్యమైన బియ్యం పీడీఎస్ బియ్యంగా ప్రాథమికంగా నిర్ధారించారు. బుధవారం పంచనామా నిర్వహించి, బియ్యం బస్తాలను లెక్కించి తూకం వేయగా సుమారు 444.75 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం లభించినట్లు గుర్తించారు. పట్టుకున్న పీడీఎస్ బియ్యాన్ని అధికారికంగా స్వాధీనం చేసుకొని, తదుపరి ఉన్నతాధికారుల ఆదేశాలు అందే వరకు భద్రతా పరిరక్షణ నిమిత్తం మారుతి ఇండస్ట్రీస్ రైస్ మిల్ వద్ద సురక్షితంగా ఉంచారు. ప్రభుత్వ పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా నిల్వ చేయడం, అక్రమంగా రవాణా చేయడం లేదా దారి మళ్లించడం చట్టరీత్యా తీవ్రమైన నేరమని అధికారులు తెలిపారు. ఈ ఘటనపై నిత్యావసర వస్తువుల చట్టం వర్తించే పీడీఎస్ నియంత్రణ నిబంధనల ప్రకారం చట్టపరమైన చర్యలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. కేసులో తూర్పాటి శ్రీనివాస్, వాహన యజమాని కం డ్రైవర్ సాంబశివుడు, పురాతన రైస్ మిల్ గోదాం యజమాని శ్రీనివాస్ లపై చర్యలు తీసుకోనున్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ దాడిలో పౌర సరఫరాల శాఖ ఇన్‌స్పెక్టర్, టెక్నికల్ అసిస్టెంట్ రాహుల్, జిల్లా పౌర సరఫరాల అధికారి, జిల్లా మేనేజర్, రేగొండ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పాల్గొన్నారు.

# కెరమెరిలో ఏజెన్సీ బంద్ విజయవంతం

- 75శాతం రిజర్వేషన్ కోసం ఆదివాసీల ఆందోళన



**కెరమెరి, ఆగస్టు19(జనం సాక్షి) :** కానిస్టేబుల్ నియామక నోటిఫికేషన్‌లో జీవో నంబర్ 109 ప్రకారం ఏజెన్సీ ప్రాంత అభ్యర్థులకు ప్రత్యేక రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర ఏజెన్సీ బంద్ పిలుపు మేరకు బుధవారం కెరమెరి మండల కేంద్రంలో ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో సంపూర్ణ బంద్ నిర్వహించారు. విద్యాసంస్థలు, వ్యాపార సంస్థలు, దుకాణాలు స్వచ్ఛందంగా బంద్ పాటించి ఏజెన్సీ బంద్‌కు సంపూర్ణ మద్దతు తెలిపారు. ఈ బంద్ కార్యక్రమంలో ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ జాతీయ అధ్యక్షులు కోట్నాక విజయ్ కుమార్, జిల్లా అధ్యక్షుడు కోవ విజయ్ పాల్గొని ఆదివాసీ సంఘాలు, విద్యార్థులు, యువత, వ్యాపారులు, ప్రజలకు సంఘీభావం తెలిపారు. ఏజెన్సీ ప్రాంతంలో విద్య, ఉద్యోగ నియామకాల్లో స్థానిక ఆదివాసీ అభ్యర్థులకు ప్రత్యేక రిజర్వేషన్‌ను పకడ్బందీగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా పోలీస్ కానిస్టేబుల్ నియామక నోటిఫికేషన్‌లో ఏజెన్సీ ప్రాంత ఆదివాసీ అభ్యర్థులకు 75 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఆదివాసీ నిరుద్యోగ యువతకు న్యాయం జరిగేలా జీవో నంబర్ 3 ను పునరుద్ధరించాలని, ఏజెన్సీ ప్రాంత ఆదివాసీల హక్కులను కాపాడేందుకు 1/70 చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏజెన్సీ ప్రాంత ప్రజల హక్కులు, విద్యార్థులు, నిరుద్యోగ యువత భవిష్యత్తు కోసం చేపట్టిన ఈ బంద్‌కు విద్యాసంస్థలు, వ్యాపారులు, దుకాణదారులు, ప్రజలు స్వచ్ఛందంగా సహకరించి బంద్‌ను విజయవంతం చేశారని తెలిపారు. ఏజెన్సీ బంద్‌కు సంపూర్ణ సహకారం అందించిన విద్యాసంస్థల యాజమాన్యాలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వ్యాపారులు, దుకాణదారులు, యువత, ఆదివాసీ సంఘాల నాయకులు, కెరమెరి మండల ప్రజలందరికీ ఆదివాసీ సంఘాల తరపున హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఏజెన్సీ ప్రాంత హక్కుల కోసం భవిష్యత్తులో కూడా ప్రజలందరూ ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కుడ్మెత సోము తుడుందెబ్బ మండల అధ్యక్షులు, మాజీ ఎంపీపీ పెందూర్ మోతిరామ్, ఆత్రం భీంరావ్ మండల ప్రధాన కార్యదర్శి, చాహకటి రాంకిషన్ విద్యార్థి సంఘం మండల ప్రధాన కార్యదర్శి, కోవా బాధిరావు తుడుం దెబ్బ మండల నాయకులు, సేడ్మాకి తుకారాం ఆదివాసీ విద్యార్థి సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో పురోగతి సాధించాలి

- కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ కె.హరిత




**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, ఆగస్టు 19(జనంసాక్షి) :** నిరుపేదల సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకంలో మొదటి విడత ఇండ్ల నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో గల వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్ తో కలిసి జిల్లాలోని మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, గృహ నిర్మాణ శాఖ ఇంజనీర్లు, పురపాలక సంఘాల కమిషనర్లతో ఇందిరమ్మ ఇండ్ల మొదటి విడతలో పురోగతి, 2వ విడత జాబితాపై జూన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల పథకం మొదటి విడతలో జిల్లాలో 8 వేల 851 ఇండ్లు మంజూరయ్యాయని, ఇంకా 1 వేయి 100 ఇండ్ల పనులు ప్రారంభం కాలేదని, ఇందుకు గల కారణాలను నివేదిక రూపంలో సమర్పించాలని, వెంటనే ఇండ్ల పనులు ప్రారంభించాలని తెలిపారు. బేస్మెంట్, రూఫ్, స్లాబ్ లెవెల్ ఇండ్ల నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని, నిర్మాణ పనులలో పురోగతి సాధించాలని తెలిపారు. 2వ విడత ఇందిరమ్మ ఇండ్ల జాబితాలో ఏ ఒక్క అనర్హులు ఉండకూడదని, అర్హులు మాత్రమే జాబితాలో ఉండేలా చూడాలని తెలిపారు. గుడిసెలలో నివసించే వారికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణిలో ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కోసం అనేక దరఖాస్తులు వస్తున్నాయని, వాటిని క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్హుల పేర్లను గ్రామ సభ నిర్వహించి తీర్మానాలు తీసుకోవాలని తెలిపారు. ప్రతి లబ్ధిదారుడి ఇంటికి వెళ్లి క్షేత్రస్థాయిలో పరిశీలించాలని, మున్సిపాలిటీలలో రూఫ్ బలంగా ఉండి పైన స్లాబ్ వేసుకునే అర్హులైన వారిని గుర్తించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ ప్రకాష్ రావు, మేనేజర్ పుష్పలత, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, గృహ నిర్మాణ శాఖ ఎ. ఈ.లు తదితరులు పాల్గొన్నారు.

# మహిళలు, బాలికలకు సురక్షిత వాతావరణం కల్పించాలి

- జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు



**ములుగు ప్రతినిధి, ఆగస్టు 19(జనంసాక్షి) :** మహిళలు, బాలికలకు సురక్షిత వాతావరణం కల్పించడం అందరి బాధ్యత అని జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు అన్నారు. బుదవారం జిల్లా సమీకృత కార్యాలయశీలో జిల్లా నిర్భయ ఫండ్ కమిటి సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నిర్భయ ఫండ్ ద్వారా పైలట్ ప్రాజెక్ట్ గా "మహిళలు, బాలికల కోసం సమ్మిళిత నగరాలు"- ములుగు జిల్లాలో మహిళలు మరియు బాలికలు సురక్షితంగా, మరింత అనుకూలంగా జీవించడానికి, పని చేయడానికి, చదువుకోవడానికి, ప్రయాణించ డానికి, రోజువారి కార్యక్రమాలు స్వేచ్ఛగా పాల్గొనడానికి వీలు కల్పించే మహిళా-స్నేహపూర్వక పట్టణ ప్రదేశాలను సృష్టించడం ఈ ప్రాజెక్ట్ లక్ష్యం అని అన్నారు. మహిళలు, బాలికలు భద్రత, రవాణా, ప్రజా ప్రదేశాలు, పారిశుద్ధ్యం, ఆరోగ్యం, విద్య, ఉపాధి, నిర్ణయాధికారం వంటి అంశాలకు సంబంధించి తరచుగా ఎదుర్కొనే సవాళ్లను ఈ ప్రాజెక్ట్ గుర్తిస్తుందని తెలిపారు. ములుగు జిల్లాలో మహిళలు బాలికలకు సురక్షితమైనటువంటి నగరాలుగా తీర్చిదిద్దడం కొరకు సమన్వత సమగ్ర ప్రణాళికలు రూపొందించాలని, మహిళల రక్షణకు ప్రాధాన్యత నిచ్చినటువంటి అంశాలను దాంట్లో రూపొందించాలని తెలిపారు. ఈ పైలట్ చొరవ ద్వారా, స్థానిక సంఘాలు, ప్రభుత్వ సంస్థలు, పౌర సంఘాలు మరియు ఇతర వాటాదారులు కలిసి పని చేసి, మహిళలు మరియు బాలికలు ఎదుర్కొంటున్న అడ్డంకులను గుర్తించి, ఆచరణాత్మకంగా, స్థానికంగా సంబంధిత పరిష్కారాలను అభివృద్ధి చేస్తారని అన్నారు. ఈ ప్రాజెక్ట్ ప్రధానంగా ప్రజా మౌలిక సదుపాయాలు, భద్రతా యంత్రాంగాలు, అందుబాటు, అవగాహన, పట్టణ ప్రణాళిక, పాలనలో మహిళల భాగస్వామ్యాన్ని మెరుగుపరచడం మొదలైన అంశాలు మహిళల నైపుణ్యాన్ని పెంచుతాయని అన్నారు. ఈ సందర్భంగా కమిటీ జిల్లాలోని మహిళలు బాలికల సురక్షిత అవసరాలను గుర్తించి వాటిపైన ప్రాణాలికలు ప్రతిపాదనలను తయారు చేయడం జరిగింది. ఇట్టి ప్రణాళికలు ప్రభుత్వానికి సమర్పించడం జరుగుతుందని ప్రభుత్వ అనుమతితో తదుపరి చర్యలు తీసుకుంటామని కమిటి సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమలో జిల్లా సంక్షేమ అధికారి-ఈపీ ప్రేమలత, కిషోర్ కుమార్ డిఎస్పి, తాకూర్ ఈశ్వర్ సింగ్- జిల్లా రవాణా అధికారి, సంపత్- మున్సిపల్ కమిషనర్ ములుగు, సూర్య కిరణ్- టూరిజం అసిస్టెంట్ మేనేజర్, రమాదేవి- డిస్టిక్ మిషన్ కోఆర్డినేటర్, లావణ్య- సెంటర్ అడ్మిన్ సఖి కేంద్రం, జె ఓంకార్- జిల్లా బాలల పరిరక్షణ అధికారి తదితరులు పాల్గొన్నారు.

# పెద్ది విగ్రహం తొలగింపుపై గర్జించిన బీఆర్ఎస్ శ్రేణులు

- నల్లబెల్లి లో ప్రశాంతంగా ముగిసిన సంపూర్ణ బంద్



**నల్లబెల్లి, ఆగస్టు 19 (జనంసాక్షి):** నర్సంపేట మెడికల్ కాలేజీ వద్ద దివంగత మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి విగ్రహాన్ని రాత్రికి రాత్రే తొలగించడాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన బంద్ నల్లబెల్లి మండలంలో బుధవారం సంపూర్ణంగా, శాంతియుతంగా జరిగింది. మండల కేంద్రంలో వ్యాపార, వాణిజ్య సముదాయాలు, ప్రవేట్ విద్యాసంస్థలు స్వచ్ఛందంగా మూసివేసి బందుకు మద్దతు ప్రకటించాయి. అనంతరం బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు భారీ ర్యాలీ నిర్వహించారు. పెద్ది సుదర్శన్ రెడ్డికి అనుకూలంగా నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించడంతో నల్లబెల్లి మార్మోగింది. ర్యాలీలో పాల్గొన్న బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు బానోతు సారంగపాణి, మాజీ ఫ్యాక్స్ ఛైర్మన్ చెట్టుపెల్లి మురళీధర్ రావు, మాజీ ఎంపీపీ కక్కెర్ల శ్రీనివాస్ గౌడ్, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు ఊడుగుల ప్రవీణ్ గౌడ్, ప్రధాన కార్యదర్శి కోటిలింగాచారి, పలువురు సర్పంచులను, మండల స్థాయి నాయకులను, కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్ కి తరలించారు. ఈ సందర్భంగా సారంగపాణి మాట్లాడుతూ విగ్రహాన్ని తొలగించిన ప్రదేశంలోనే తిరిగి ప్రతిష్ఠించే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని అతను ప్రభుత్వాన్ని హెచ్చరించారు. నర్సంపేట నియోజకవర్గ అభివృద్ధికి పెద్ది సుదర్శన్‌రెడ్డి చేసిన కృషి మరువలేనిదన్నారు. నర్సంపేటకు మెడికల్ కాలేజీ సాధించడంతో పాటు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించిన ఆయన ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచారని పేర్కొన్నారు. ఆయన విగ్రహాన్ని తొలగించడం ప్రజల మనోభావాలను దెబ్బతీయడమేనని అన్నారు. తమపై ఎన్ని అక్రమ కేసులు పెట్టినా భయపడేది లేదని సారంగపాణి అన్నారు. పెద్ది సుదర్శన్‌రెడ్డి విగ్రహాన్ని అదే స్థలంలో పునఃప్రతిష్ఠించే వరకు ఉద్యమం ఆగదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల, గ్రామస్థాయి నాయకులు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, సర్పంచులు, మాజీ సర్పంచులు, యూత్ నాయకులు, పార్టీ అధ్యక్షులు, వార్డు సభ్యులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.



# నూనె మిల్లులో ఘోర ప్రమాదం..

- మహిళకు తీవ్ర గాయాలు
- మిల్లులో ఇరుక్కున్న కుడిచేయి..
- భుజం వరకు తెగిపోయిన వైనం

**నల్లబెల్లి, ఆగస్టు 19 (జనంసాక్షి):** నూనె మిల్లులో జరిగిన ప్రమాదంలో ఓ మహిళ తీవ్రంగా గాయపడిన సంఘటన వరంగల్ జిల్లా నల్లబెల్లి మండల కేంద్రంలో బుధవారం చోటుచేసుకుంది. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం రంగాపురం గ్రామానికి చెందిన కందగట్ల కవిత నూనె పట్టించేందుకు నల్లబెల్లి మండల కేంద్రంలోని నగేష్ నూనె మిల్లుకు వచ్చింది. వేరుశెనగ గింజలను మిల్లులో పోసి, చెక్క పిండి తీస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు ఆమె కుడిచేయి మిల్లులో ఇరుక్కుపోయింది. దీంతో చేయి రెండుగా విరిగి, భుజం వరకు తీవ్రంగా దెబ్బతిన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ప్రమాదాన్ని గమనించిన మిల్లు యజమాని వెంటనే యంత్రాన్ని నిలిపివేశారు.తీవ్ర గాయాలతో ఉన్న కవితను స్థానికుల సహాయంతో చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# మడిపల్లి గ్రామంలో వ్యక్తి దారుణ హత్య



**తొర్రూరు, ఆగస్టు 19 (జనం సాక్షి):** మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం మడిపల్లి గ్రామంలో దారుణ హత్య చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన గుంటుక రమేష్ (39) పై పలువురు వ్యక్తులు కర్రలతో దాడి చేసి హత్య చేయడం జరిగిందని స్థానికులు తెలిపారు. స్థానికుల కథనం ప్రకారం మధ్యాహ్నం సుమారు 3:30 సమయంలో రమేష్ స్నేహితులు కొంతమంది వ్యక్తులు కర్రలతో దాడి చేసినట్లు తెలిపారు. అనంతరం చెరువు వద్దకు తీసుకువెళ్లి హత్య చేసినట్లు పేర్కొన్నారు. ఈ ఘటనతో గ్రామంలో భయాందోళన ఏర్పడింది. సమాచారం అందిన వెంటనే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని దర్యాప్తు ప్రారంభించారు. హత్యకు గల కారణాలు పోలీసు దర్యాప్తులో వెల్లడి కావలసి ఉంది.

జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం
20 ఆగస్టు 2026

# టీచర్‌ను హతమార్చిన ఇద్దరు విద్యార్థులు

నల్గొండ ప్రతినిధి, ఆగస్టు 19 (జనం సాక్షి) : కొండమల్లేపల్లి నాగార్జున గ్రామర్ కాన్సెప్ట్ స్కూల్ ప్రిన్సిపల్ కల్లు రూపారెడ్డి హత్య కేసును నల్గొండ జిల్లా పోలీసులు ఛేదించారు. దోపిడీ కోసం పక్కా ప్రణాళికతో హత్యకు పాల్పడిన ఇద్దరు పదో తరగతి విద్యార్థులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. శాస్త్రీయ, సాంకేతిక ఆధారాలతో దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. రూపారెడ్డి చివరిసారిగా ఫోన్‌లో పలికిన "బాబు" అనే ఒక్క మాట ఆధారంగా దర్యాప్తును విద్యార్థుల వైపు మళ్లించి కేసును ఛేదించారు. జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, ఐపీఎస్ ఆదేశాలతో దేవరకొండ డీఎస్పీ ఆధ్వర్యంలో ఐదు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తు చేపట్టారు. ఫోరెన్సిక్ ఆధారాలు, ఫింగర్‌ప్రింట్లు, డాగ్ స్క్వాడ్, సీసీ కెమెరాల ఫుటేజీ, సాంకేతిక ఆధారాలను పోలీసులు క్షుణ్ణంగా పరిశీలించారు. హత్య జరిగిన ప్రాంతానికి సుమారు 30 కిలోమీటర్ల పరిధిలో దాదాపు 70 సీసీ కెమెరాల ఫుటేజీలను విశ్లేషించారు. సుమారు 40 మంది పోలీసు అధికారులు, సిబ్బంది 80 మందికి పైగా అనుమానితులను విచారించారు.




### బాబు అనే మాటతో దర్యాప్తులో కీలక మలుపు

హత్యకు ముందు రూపారెడ్డి తన చిన్నమ్మతో ఫోన్‌లో మాట్లాడుతుండగా చివరిగా "బాబు" అని పలికినట్లు పోలీసులు తెలిపారు. అనంతరం ఆమె ఫోన్ స్విచ్ ఆఫ్ కావడంతో ఆ పదం ఎవరిని ఉద్దేశించి అన్నారనే అంశం దర్యాప్తులో కీలకంగా మారింది. పాఠశాలలో విద్యార్థులను రూపారెడ్డి సాధారణంగా "బాబు" అని పిలిచేవారని గుర్తించిన పోలీసులు దర్యాప్తును విద్యార్థుల వైపు మళ్లించారు.

పాఠశాల పునఃప్రారంభమైన అనంతరం విద్యార్థులను ఒక్కొక్కరినీ విచారించిన పోలీసులు.. వరుసగా రెండు రోజుల పాటు పాఠశాలకు హాజరుకాని కొంతమంది విద్యార్థులపై ప్రత్యేక నిఘా పెట్టారు. సీసీ కెమెరా ఫుటేజీలు, ఇతర ఆధారాలు సరిపోలడంతో ఇద్దరు విద్యార్థులపై అనుమానం బలపడింది.

### రూ.1.54 లక్షల నగదు స్వాధీనం

బుధవారం ఉదయం 11.30 గంటల సమయంలో పెండ్లిపాకల "ఎక్స్" రోడ్డు నుంచి మల్లేపల్లి వైపు వస్తున్న ఇద్దరు పదో తరగతి విద్యార్థులను దొనియాల "ఎక్స్" రోడ్డు వద్ద పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. తనిఖీల్లో వారి వద్ద దాచిన సుమారు రూ.1.54 లక్షల నగదు లభించింది. స్వాధీనం చేసుకున్న రూ.500 నోట్లలో మూడు నోట్లపై రక్తపు మరకలు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు.నగదు ఎక్కడి నుంచి వచ్చిందని ప్రశ్నించగా.. ప్రిన్సిపల్ రూపారెడ్డిని హత్య చేసి ఆమె వద్ద ఉన్న నగదును అపహరించినట్లు విద్యార్థులు వెల్లడించినట్లు పోలీసులు తెలిపారు.

### హత్యకు పక్కా ప్రణాళిక

పోలీసుల వివరాల ప్రకారం.. ఇద్దరు విద్యార్థులు ఒకే హాస్టల్ గదిలో ఉంటూ జల్సాలకు, చెడు వ్యసనాలకు అలవాటు పడ్డారు. తల్లిదండ్రులకు తెలియకుండా సెల్‌ఫోన్లు ఉపయోగిస్తూ సోషల్ మీడియా, యూట్యూబ్‌లో సులభంగా డబ్బులు సంపాదించే మార్గాలపై వెతికేవారు. గత నెలలో హాస్టల్‌లో డబ్బులతో పట్టుబడిన వారిని రూపారెడ్డి వారి తల్లిదండ్రుల సమక్షంలో మందలించారు. దీంతో ఆమెపై కక్ష పెంచుకున్నట్లు పోలీసులు తెలిపారు. రూపారెడ్డి వద్ద పెద్ద మొత్తంలో నగదు ఉంటుందని భావించిన ఇద్దరు విద్యార్థులు.. సోషల్ మీడియాలో తమకు ఆధారాలు దొరకకుండా హత్యకు సంబంధించిన విషయాలపై అన్వేషణ చేసినట్లు దర్యాప్తులో వెల్లడైందని పోలీసులు తెలిపారు. హత్యకు వారం రోజుల ముందు నుంచే ప్రిన్సిపల్‌ను హతమార్చేందుకు రెక్కీ నిర్వహించినట్లు పోలీసులు పేర్కొన్నారు. ఘటన రోజున పాఠశాల నుంచి ఇంటికి వెళ్లి ఎరుపు రంగు హుడీ, ప్యాంట్ తీసుకుని వచ్చారు. అనంతరం కొండమల్లేపల్లిలో కత్తి, గ్లౌజులు కొనుగోలు చేశారు.

రూపారెడ్డి ఇంటి సమీపంలోని వాటర్ ట్యాంక్ వద్దకు చేరుకుని ఒకరు బయట ఎవరైనా వస్తున్నారా అని గమనిస్తుండగా, మరొకరు ఇంటి వెనుక భాగం నుంచి లోపలికి ప్రవేశించినట్లు పోలీసులు తెలిపారు. తెరిచి ఉన్న వంటగది ద్వారా ఇంట్లోకి ప్రవేశించి రూపారెడ్డిపై కత్తితో దాడి చేసినట్లు వెల్లడించారు. అనంతరం బెడ్‌రూమ్‌లో ఉన్న సుమారు రూ.2.50 లక్షల నగదును తీసుకుని ఇంటి వెనుక గోడ దూకి నిర్మానుష్య ప్రాంతం నుంచి వెళ్లిపోయారు. హత్యకు ఉపయోగించిన కత్తి, గ్లౌజులు, మాస్క్, సెల్‌ఫోన్‌ను చెట్ల పొదల్లో పడేసి.. కొంతదూరంలో బట్టలు మార్చుకుని ఎరుపు రంగు హుడీని డ్రైనేజీలో పడేసినట్లు పోలీసులు తెలిపారు.

### పలు వస్తువులు స్వాధీనం

నిందితుల నుంచి రూ.1.54 లక్షల నగదు, మృతురాలి ఐఫోన్, హత్యకు ఉపయోగించిన కత్తి, చేతి గ్లౌజులు, మాస్కులు, రెండు సెల్‌ఫోన్లు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.ఈ కేసులో చట్టంతో సంఘర్షణ పడిన ఇద్దరు బాలురు 16 ఏళ్ల వయస్సు కలిగిన పదో తరగతి విద్యార్థులుగా పోలీసులు తెలిపారు. బాలల చట్టాలకు అనుగుణంగా తదుపరి చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు.

### పోలీసు బృందాలకు ఎస్పీ అభినందనలు

కేసును ఛేదించడంలో విశేష ప్రతిభ కనబరిచిన దేవరకొండ డీఎస్పీ ఎం.వి. శ్రీనివాసరావు, మల్లేపల్లి సీఐ ఏ. నవీన్ కుమార్, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ ఎం. జితేందర్ రెడ్డి, మల్లేపల్లి ఎస్ఐ ఏ. రమేష్, చింతపల్లి ఎస్ఐ ఎం. రామ్మూర్తి, గుడిపల్లి ఎస్ఐ డి. నరసింహులు, గుర్రంపోడు ఎస్ఐ ఎన్. వెంకన్న, సీసీఎస్ ఎస్ఐ యు. సురేష్‌తో పాటు పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ అభినందించి రివార్డులు ప్రకటించారు.కేసులో ప్రతి చిన్న ఆధారాన్ని శాస్త్రీయంగా విశ్లేషిస్తూ అన్ని కోణాల్లో దర్యాప్తు చేసిన పోలీసు బృందాల కృషి అభినందనీయమని ఎస్పీ తెలిపారు. నేరస్థులు ఎంత తెలివిగా వ్యవహరించినా శాస్త్రీయ ఆధారాలు, సాంకేతిక పరిజ్ఞానం, సమన్వయంతో దర్యాప్తు చేస్తే నేరాలను ఛేదించవచ్చని ఆయన పేర్కొన్నారు.

## భువనగిరి, ఆలేరుకు మల్లన్నసాగర్ జలాలు

- రూ.210 కోట్లతో తాగునీటి పైప్‌లైన్..
- పనులు వేగవంతం చేయాలి
- ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి



భువనగిరి, ఆగస్టు 18 (జనం సాక్షి) : భువనగిరి, ఆలేరు నియోజకవర్గాల ప్రజల దాహార్తిని శాశ్వతంగా తీర్చే లక్ష్యంతో ప్రభుత్వం చేపట్టిన రూ.210 కోట్ల మల్లన్నసాగర్ తాగునీటి పైప్‌లైన్ పనులు వేగంగా కొనసాగుతున్నాయి. మేడ్చల్ జిల్లా శామీర్‌పేట మండలం ఘనపూర్ గుట్ట వద్ద జరుగుతున్న పనులను ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ప్రాజెక్టుకు అవసరమైన 4.5 కిలోమీటర్ల అటవీ ప్రాంతానికి సంబంధించిన అనుమతులు ఇప్పటికే లభించాయని ఎమ్మెల్యేలు తెలిపారు. మిగిలిన పనులను వేగవంతం చేసి, నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేసి ప్రజలకు త్వరితగతిన తాగునీటిని అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. మల్లన్నసాగర్ నీటిని భువనగిరి, ఆలేరు నియోజకవర్గాలకు తరలించడం ద్వారా వేలాది కుటుంబాల తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఎమ్మెల్యేలు పేర్కొన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లు అధికారంలో ఉన్నప్పటికీ ఈ ప్రాంతాల తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపలేదని వారు విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం ప్రజల తాగునీటి అవసరాలకు ప్రాధాన్యతనిస్తూ ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టును చేపట్టిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అలియాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ శిరీషా-కృష్ణారెడ్డి, కౌన్సిలర్లు, భువనగిరి, ఆలేరు నియోజకవర్గాల ప్రజాప్రతినిధులు, మిషన్ భగీరథ సీఈ రాంచంద్రనాయక్, ఎస్ఈ వెంకట్‌రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## రామాంతపూర్‌లో పాలిటెక్నిక్ విద్యార్థుల భారీ నిరసన

- పాలిటెక్నిక్ కళాశాలలను స్కిల్ యూనివర్సిటీలో విలీనం చేసే 'శక్తి పథకం'ను తక్షణమే రద్దు చేయాలి
- ప్రభుత్వ నిర్ణయంపై విద్యార్థుల ఆగ్రహం

ఉప్పల్/రామాంతపూర్, ఆగస్టు 19 (జనం సాక్షి) : పాలిటెక్నిక్ కళాశాలలను స్కిల్ యూనివర్సిటీలో విలీనం చేసేందుకు ప్రభుత్వం తీసుకువచ్చిన లిలి'శక్తి పథకం'లిలిపై విద్యార్థుల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఈ పథకాన్ని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ రామాంతపూర్‌లోని ఉప్పల్‌బజ్ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు పెద్ద ఎత్తున నిరసన చేపట్టారు. ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ విద్యార్థులు రోడ్డుపైకి వచ్చి నినాదాలు చేశారు. పాలిటెక్నిక్ కళాశాలలను స్కిల్ యూనివర్సిటీలో విలీనం చేయడం వల్ల తమ విద్యా విధానం, కోర్సుల నిర్వహణ, భవిష్యత్ విద్యా అవకాశాలపై ప్రభావం పడే అవకాశం ఉందని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన ఇలాంటి కీలక నిర్ణయాలను తీసుకునే ముందు విద్యార్థులు, అధ్యాపకులు, విద్యా నిపుణులతో ప్రభుత్వం విస్తృతంగా చర్చించాల్సిన అవసరం ఉందని వారు పేర్కొన్నారు.

### శక్తి పథకాన్ని రద్దు చేయాలని డిమాండ్

నిరసనలో పాల్గొన్న విద్యార్థులు 'శక్తి పథకాన్ని వెంటనే రద్దు చేయాలి', 'పాలిటెక్నిక్ విద్యను కాపాడాలి', 'విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడొద్దు' అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ప్రభుత్వం తమ డిమాండ్లను పట్టించుకోకుండా ముందుకు వెళితే ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని విద్యార్థులు హెచ్చరించారు.



### విద్యార్థుల భవిష్యత్తుపై ఆందోళన

పాలిటెక్నిక్ విద్యను అభ్యసిస్తున్న విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన అనేక అంశాలపై స్పష్టత అవసరమని విద్యార్థులు తెలిపారు. విలీనం తర్వాత తమ కోర్సులు, విద్యా విధానం, పరీక్షల నిర్వహణ, సాంకేతిక శిక్షణ, ఉన్నత విద్యకు వెళ్లే అవకాశాలపై ఎలాంటి మార్పులు వస్తాయో ప్రభుత్వం స్పష్టంగా వివరించాలని డిమాండ్ చేశారు.

### భారీగా ట్రాఫిక్ జామ్

విద్యార్థుల నిరసన కారణంగా రామాంతపూర్ పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ రద్దీ తీవ్రంగా పెరిగింది. ప్రధాన రహదారిపై వాహనాలు నెమ్మదిగా కదలడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కార్యాలయాలు, కళాశాలలు, ఇతర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు ట్రాఫిక్‌లో చిక్కుకున్నారు.

### ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరిక

ప్రభుత్వం తమ డిమాండ్లపై సానుకూలంగా స్పందించకపోతే భవిష్యత్తులో మరిన్ని ఆందోళన కార్యక్రమాలు చేపడతామని విద్యార్థులు హెచ్చరించారు. పాలిటెక్నిక్ విద్యార్థుల ప్రయోజనాలను కాపాడే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

## గంజాయి మహమ్మారిపై పోలీసుల ఉక్కుపాదం

- 4 లక్షల 76 వేల గంజాయి పట్టివేత
- నిందితున్ని రిమాండ్ చేసిన పోలీసులు
- సిఐఎస్ఐ సిబ్బందిని అభినందించిన డి.ఎస్.పి
- విలేకరుల సమావేశంలో వెల్లడించిన ఇల్లందు డి.ఎస్.పి వెంకన్న బాబు



టేకులపల్లి, ఆగస్టు 19 (జనం సాక్షి) : యువత జీవితాలు, భవిష్యత్తును నాశనం చేసే గంజాయి మహమ్మారిపై పోలీసుల ఉక్కు పాదం ఉంటుందని, అందుకు ప్రతి ఒక్కరు పోలీసులకు సహకరించాలని ఇల్లందు డి.ఎస్.పి యు. వెంకన్న బాబు పేర్కొన్నారు. బుధవారం టేకులపల్లి పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్కూటీ డిక్కీలో గంజాయిని తరలిస్తున్న వ్యక్తిని టేకులపల్లి పోలీసులు పట్టుకున్నారు. అతని వద్ద నుంచి రూ.4.76 లక్షల విలువైన 9.520 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు టేకులపల్లి ఎస్ఐ కె.తిరుపతి సిబ్బందితో కలిసి మంగళవారం సాయంత్రం వెంకట్యాతండా గ్రామ శివారులోని నర్సయిగూడెం రహదారిపై వాహన తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో నంబర్ ప్లేట్ లేని స్కూటీని తనిఖీ చేయగా డిక్కీలో గంజాయి బయటపడింది.ఒడిశా రాష్ట్రం మల్కాన్‌గిరి జిల్లా కలిమెల మండలం గుముక గ్రామానికి చెందిన టపాన్ మండల్ ను అదుపులోకి తీసుకున్నారు. అతడు ఒడిశా నుంచి గంజాయిని తీసుకొచ్చి సూర్యాపేట టోల్‌గేట్ సమీపాన కొనుగోలు చేసేమరో వ్యక్తికి అందించేందుకు వెళ్తున్నట్లు విచారణలో వెల్లడైందని తెలిపారు. సరఫరా చేసే వ్యక్తి,గంజాయి స్వీకరించే వ్యక్తి పరారీలో ఉన్నట్లు డి.ఎస్.పి. తెలిపారు.నిందితుడిని సీఐ బత్తులసత్యనారాయణ అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. గంజాయి పట్టుకోవడంలో చాకచక్యం కనబరిచిన ఎస్ఐ కె.తిరుపతి, సిబ్బంది బి.భాస్కర్, టి.చక్రధర్‌రాజు, పి.రవికుమార్, బి.సురేష్, బి.అనంతరాములు, ఎం.ప్రవీణ్‌కుమార్‌లను ఇల్లందు డీఎస్పీ యు.వెంకన్నబాబు రివార్డులతో అభినందించారు. ఈ విలేకరుల సమావేశంలో టేకులపల్లి సిఐ బత్తుల సత్యనారాయణ, టేకులపల్లి ఎస్సై తిరుపతి, బోడు ఎస్సై రాజమౌళి పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# బీజేపీ కుట్రలో భాగమే ఎస్ఐఆర్..!

- ఫేజ్ బి2 ప్రక్రియ పట్ల అప్రమత్తంగా ఉండాలి
- ఈనెల 25వ తేదీ లోపు మండల, పట్టణ, గ్రామ కమిటీలు పూర్తి కావాలి
- బీఆర్ఎస్ బిజెపి తప్పుడు ప్రచారాలు చేస్తున్నాయి
- కాంగ్రెస్ శ్రేణులు వాటిని తిప్పికొట్టాలి..!
- ఏఐసిసి కార్యదర్శి సచిన్ సావంత్, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

ఉమ్మడి ఖమ్మం జిల్లా బ్యూరో, ఆగస్టు 19 (జనం సాక్షి) : కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో అధికారాన్ని చేజిక్కించుకోవడమే లక్ష్యంగా బిజెపి ఎస్ ఐ ఆర్ పేరుతో అనేక కుట్రలకు తెరాలేపుతోందని ఏఐసిసి కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇన్చార్జి సచిన్ సావంత్ అన్నారు. బుధవారం ఖమ్మం జిల్లా కార్యాలయం (సంజీవరెడ్డి భవన్) లో జరిగిన ఉమ్మడి ఖమ్మం జిల్లా రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ) సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. సర్ ప్రక్రియలో ఇప్పటివరకు పూర్తయిన పనులను సమీక్షించారు. పెండింగ్ లో ఉన్న అంశాలపై కులంకషంగా చర్చించి ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ ఫేజ్‌బి2 గురించి కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్నటువంటి అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల స్థాయిలో సర్ అమలుపై ప్రతి ఒక్కరూ దృష్టి సారించాలని కోరారు. ఏమాత్రం ఏమరపాటుగా ఉన్నట్లయితే ఓట్లు కోల్పోయే ప్రమాదం ఉందన్నారు.

వచ్చే ఎన్నికల్లో రాహుల్ గాంధీని ప్రధానిగా చూడాలన్నదే తమ అందరి కోరిక అని అన్నారు. ఈ సమావేశానికి ఖమ్మం డిసిసి అధ్యక్షుడు నూతి సత్యనారాయణ గౌడ్, భద్రాద్రి జిల్లా డిసిసి అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న, ఖమ్మం కార్పొరేషన్ అధ్యక్షుడు నాగండ్ల దీపక్ చౌదరి అధ్యక్షత వహించగా కాంగ్రెస్ సీనియర్ నాయకులు రామ్ రెడ్డి గోపాల్ రెడ్డి, అశ్వరావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావు, ఖమ్మం జిల్లా గ్రంథలయ సంస్థ చైర్మన్ మహమ్మద్ ఖాదర్ బాబా, మున్సిపల్ చైర్మన్లు కాపా చంద్రకళ, ధరావత్ మోహన్ నాయక్, ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ యార్లగడ్డ హనుమంతరావు, ముఖ్య నాయకులు మహమ్మద్ రెహనా బేగం, దొబ్బల సౌజన్య, సయ్యద్ గౌస్, డాక్టర్ కాపా మురళి కృష్ణ, పుచ్చకాయల వీరభద్రం, బొడ్డు బొందయ్య, సయ్యద్ ముజాహిద్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.




## దివ్యాంగుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి

ఖమ్మం/ కూసుమంచి, ఆగస్టు 19 (జనం సాక్షి) : దివ్యాంగుల సంక్షేమానికి, వారి ఆర్థిక, సామాజిక వికాసానికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. అర్హులైన దివ్యాంగులకు ప్రభుత్వం తరఫున వంద శాతం సబ్సిడీపై సమకూర్చిన త్రీ వీలర్ (ట్రై మోటార్) సైకిళ్ళను బుధవారం కూసుమంచి క్యాంపు కార్యాలయం వద్ద పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, దివ్యాంగులు ఎవరిపైనా ఆధారపడకుండా, తమ స్వశక్తితో జీవించేందుకు అవసరమైన సహాయ ఉపకరణాలను ప్రభుత్వం అందిస్తోందని అన్నారు. రవాణా సౌకర్యం సులభతరం కావడానికి ఈ ట్రై మోటార్ సైకిళ్లు ఎంతో తోడ్పడతాయని అన్నారు. దివ్యాంగత్వాన్ని వైకల్యంగా భావించకుండా, బలమైన ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేయాలని పిలుపునిచ్చారు. సరైన పట్టుదల ఉంటే జీవితంలో సాధించలేనిది ఏదీ లేదని, దివ్యాంగులు సమాజంలో స్వయం సమృద్ధి సాధించి ఉన్నత స్థాయికి ఎదగాలని మంత్రి ఆకాంక్షించారు. రాష్ట్రంలో అర్హత ఉన్న ప్రతి దివ్యాంగునికి ప్రభుత్వ పథకాలు, పింఛన్లు, ఇతర సంక్షేమ ఫలాలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారిణి ప్రమీల, ఖమ్మం ఆర్డీవో ఎన్. శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, దివ్యాంగ లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు.



# అర్హులైన ప్రతి నిరుపేద కుటుంబానికి ఇళ్ల స్థలం ఇస్తాం

- మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ఖమ్మం రూరల్, ఆగస్టు 19 (జనం సాక్షి) : అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇళ్ల స్థలాలు ఇవ్వనున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. బుధవారం ఖమ్మం రూరల్ మండలం పల్లెగూడెం లో రూ. 20 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన గ్రామ పంచాయతీ భవనాన్ని మంత్రి, జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, పోలీస్ కమిషనర్ సునీల్ దత్‌లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, పల్లెగూడెంలోని ప్రభుత్వ, అసైన్డ్ భూములను గ్రామంలోని అర్హులైన నిరుపేద కుటుంబాలకు ఇళ్ల స్థలాలుగా కేటాయించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ భూముల ఆక్రమణలో ఉంటే, క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ జరిపి, ఆక్రమణలను గుర్తించిన వెంటనే ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకోవాలని మంత్రి అన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో ప్రతి అర్హుడికీ సొంతింటి కల నెరవేర్చడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, అందుకోసమే భూములను సమీకరించి ఇళ్ల స్థలాలు అందిస్తామని తెలిపారు. పల్లెగూడెం సమగ్ర వికాసానికి రూ. 61.76 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు మంత్రి అన్నారు. గ్రామంలో ఇప్పటికే రూ.50 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణం పూర్తయిందని, గొల్లగూడెం నుంచి పల్లెగూడెం వరకు ఎన్ఎస్పీ కాల్వ గట్టుపై రూ. 5.80 కోట్లతో మోడల్ సీసీ రోడ్డు పనులు శరవేగంగా సాగుతున్నాయని తెలిపారు. అంతేకాకుండా, పల్లెగూడెం నుంచి మంగళగూడెం వరకు రూ.55 కోట్లతో చేపట్టే బీటీ రోడ్డు నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయనున్నట్లు చెప్పారు. రూ.20 లక్షల వ్యయంతో పంచాయతీ కార్యాలయ భవనాన్ని కేవలం రెండు నెలల వ్యవధిలోనే నాణ్యతతో పూర్తి చేయడం పట్ల స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులను మంత్రి అభినందించారు. గ్రామస్థుల విజ్ఞప్తి మేరకు రూ.12 లక్షలతో నూతన అంగన్‌వాడీ భవనాన్ని కూడా తక్షణమే మంజూరు చేస్తున్నట్లు మంత్రి ప్రకటించారు. అర్హులైన వయోవృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు పింఛన్ల కోసం ఈ నెల 31వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని మంత్రి సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందిస్తామని మంత్రి అన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ మాట్లాడుతూ, జిల్లాలో 110 గ్రామ పంచాయతీ నూతన భవనాలు మంజూరై అన్ని గ్రౌండింగ్ అయి, వివిధ దశల్లో ఉన్నాయన్నారు. అంగన్వాడీలకు నూతన భవనాల నిర్మాణం తుది దశలో ఉందన్నారు. వివో భవనాల నిర్మాణానికి 20 చోట్ల స్థల సమస్య ఉన్నట్లు, పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. బాధ్యతగా వ్యవహరిస్తూ అభివృద్ధి పనుల పూర్తికి చర్యలు చేపట్టనున్నట్లు కలెక్టర్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బి ఎస్ఇ యుగంధర్ రావు, పీఆర్ ఎస్ఇ వెంకట్ రెడ్డి, ఇఇ మహేష్ బాబు, ఖమ్మం ఆర్డీవో ఎన్. శ్రీనివాస్, ఏదులాపురం మునిసిపల్ చైర్ పర్సన్ పోకబత్తిని అనిత, కమీషనర్ శ్రీనివాస రెడ్డి, ఖమ్మం రూరల్ తహసీల్దార్ వినయేందర్,ఎంపీడీఓ రవికుమార్,పల్లెగూడెం గ్రామ సర్పంచ్ చుండూరి సుజన కృష్ణ, పంచాయతీ కార్యదర్శి నర్మద, సీపీఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్,సీపీఐ నాయకులు లింగా వెంకటనారాయణ ప్రజాప్రతినిధులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.








# స్కోడా నుంచి డీజిల్ కార్లు

**ముంబయి:** చెక్ రిపబ్లిక్ వాహన దిగ్గజం స్కోడా ఆటో, భారత మార్కెట్‌లో అయిదేళ్ల విరామం తర్వాత మళ్లీ డీజిల్ వాహనాలను ప్రవేశ పెట్టింది. సరికొత్త ప్రీమియం ఎగ్జిక్యూటివ్ సెడాన్ సూపర్బ్ డీజిల్‌ను సంస్థ విడుదల చేసింది. దీంతో పాటు కొత్త స్లావియా, ఆక్టేవియా, ఆక్టేవియా ఆర్ఎస్ వెర్షన్‌లను ఆవిష్కరించింది. గతంలో బీఎస్-6 ఉద్గారాల నిబంధనల అమలు సమయంలో స్కోడా ఇండియా తమ డీజిల్ మోడళ్లను నిలిపివేసింది. స్లావియాను కొత్త హంగులు, అధునాతన సాంకేతికతలు, ఫీచర్లు, సౌకర్యవంతమైన ఇంటీరియర్స్‌తో నవీకరించారు. పెర్ఫార్మెన్స్ కార్లను ఇష్టపడే వారి కోసం స్పోర్ట్స్ సెడాన్ ఆక్టేవియా ఆర్ఎస్‌ను తీసుకొస్తోంది.

# ఇండిగో వెబ్‌సైట్‌లో అంతరాయం..

## నిలిచిన టికెట్ బుకింగ్‌లు

**న్యూఢిల్లీ:** ప్రముఖ విమానయాన సంస్థ ఇండిగో వెబ్‌సైట్‌లో సాంకేతిక సమస్య తలెత్తింది. కొందరు యూజర్లకు టికెట్ బుకింగ్, ఆన్‌లైన్ చెక్-ఇన్ విషయంలో అవాంతరాలు ఎదుర్కొంటున్నారు. ఈ మేరకు తమకు ఎదురైన ఇబ్బందిని సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేస్తున్నారు. ఇతర ట్రావెల్ బుకింగ్ వెబ్‌సైట్‌లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. వెబ్‌సైట్‌లో నెలకొన్న అంతరాయంపై ఇండిగో స్పందించింది. కలిగిన అసౌకర్యానికి చింతిస్తున్నామని పేర్కొంది. తమ ప్రధాన రిజర్వేషన్ ప్లాట్‌ఫారమ్‌లో అవాంతరం కారణంగా కొందరు వినియోగదారులకు అసౌకర్యం కలుగుతోందని పేర్కొంది. ఈ సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరించడానికి తమ బృందాలు పనిచేస్తున్నాయని తెలిపింది. తక్షణ ప్రయాణ అవసరం ఉన్నవారు కస్టమర్ కేర్‌ను సంప్రదించాలని సూచించింది. తర్వాత ప్రయాణం ఉన్న వినియోగదారులు కాసేపాగి వెబ్‌సైట్ లేదా యాప్‌ను యాక్సెస్ చేయడానికి ప్రయత్నించడని సూచించింది.




# ఏడో రోజూ నష్టాల్లో నిఫ్టీ

- 24,100 దిగువకు
- ఎఫ్ఐఐ కొనుగోళ్లు: రూ.1,651.53 కోట్లు
- డీఐఐ కొనుగోళ్లు: రూ.2,579.31 కోట్లు




**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీల నష్టాల పరంపర కొనసాగుతోంది. అంతర్జాతీయంగా నెలకొన్న అనిశ్చితులు, ఇతర మార్కెట్‌ల నుంచి ప్రతికూల సంకేతాలతో సూచీలు నష్టపోయాయి. దీంతో నిఫ్టీ వరుసగా ఏడో రోజూ నష్టాల్లో ముగిసింది. సెన్సెక్స్ ఉదయం 77,218.05 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 77,235.46) వద్ద స్వల్ప నష్టాల్లో ప్రారంభమైంది. రోజంతా నష్టాల్లో కొనసాగిన సూచీ.. ఓ దశలో 76,822.89 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని తాకింది. చివరకు 325.78 పాయింట్ల నష్టంతో 76,909.68 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 76.60 పాయింట్ల నష్టంతో 24,078 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 95.75గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, బజాజ్ ఫైనాన్స్, ఎల్అండ్‌టీ, ఐటీసీ, హిందుస్థాన్ యూనిలీవర్ స్టాక్స్ నష్టాల్లో ముగిశాయి. హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, ఎటర్నల్, కోటక్ మహీంద్రా బ్యాంక్, సన్‌ఫార్మా, టైటాన్ షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 91 డాలర్ల స్థాయికి చేరగా.. బంగారం ఔన్సు ధర 4,368 డాలర్ల వద్ద కొనసాగుతోంది.

**ముడి చమురు పడేసింది!**

ముడి చమురు ధర పెరగడం, పశ్చిమాసియాలో దౌత్యపరమైన పురోగతిపై ఆశలు సన్నగిల్లడం వంటి అంశాలు దేశీయ స్టాక్‌మార్కెట్ మదుపర్లపై తీవ్ర ప్రభావం చూపాయి. దీంతో వరుసగా ఆరోరోజైన మంగళవారమూ దేశీయ సూచీలు నష్టాల్లో ముగిశాయి. డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు విలువ 13 పైసలు తగ్గి 95.74 వద్ద ముగిసింది. బ్యారెల్ బ్రెంట్ ముడి చమురు ధర 0.32% పెరిగి 91.18 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఆసియా మార్కెట్లలో దక్షిణ కొరియా, జపాన్ సూచీలు ప్రతికూలంగా, షాంఘై, హాంకాంగ్ సూచీలు సానుకూలంగా ముగిశాయి. ఐరోపా మార్కెట్లు మిశ్రమంగా కదలాడాయి. బీఎస్ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ.1.67 లక్షల కోట్లు తగ్గి రూ.490.79 లక్షల కోట్ల (5.13 లక్షల కోట్ల డాలర్ల)కు పరిమితమైంది. సెన్సెక్స్ ఉదయం 77,418.97 పాయింట్ల (క్రితం ముగింపు 77,728.16 పాయింట్లు) వద్ద ప్రతికూలంగా ప్రారంభమైంది. ఇంట్రాడేలో ఈ సూచీ 77,575.21 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని, 77,234.36 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని నమోదు చేసింది. చివరకు 492.70 పాయింట్లు నష్టపోయి 77,235.46 పాయింట్ల వద్ద స్థిరపడింది. నిఫ్టీ 50 సూచీ 132.75 పాయింట్లు తగ్గి 24,154.90 పాయింట్ల వద్ద ముగిసింది. సెన్సెక్స్ 30 షేర్లలో 22 నష్టపోయాయి. ఏషియన్ పెయింట్స్ 2.40%, ఇన్ఫోసిస్ 2.02%, హెచ్‌సీఎల్ టెక్ 1.93%, భారతీ ఎయిర్‌టెల్ 1.75%, టీసీఎస్ 1.47%, హెచ్‌యూఎల్ 1.41%, అల్ట్రాటెక్ సిమెంట్ 1.28%, ఇండిగో 1.23%, ఐటీసీ 1.15%, కోటక్ బ్యాంక్ 1.11% తగ్గాయి. యాక్సిస్ బ్యాంక్ 0.89%, పవర్‌గ్రిడ్ 0.66% పెరిగాయి. రంగాల వారీ సూచీలకొస్తే ఫోకస్డ్ ఐటీ, ఐటీ టెక్నాలజీ, స్థిరాస్తి, పీఎస్‌యూ బ్యాంక్, మన్నికైన వినిమయ వస్తువులు, ఎఫ్ఎంసీజీ, లోహ, భారీ యంత్ర పరికరాల సూచీలు డీలాపడ్డాయి. మిడ్‌స్మాల్ ప్రైవేట్ బ్యాంక్స్ క్వాలిటీ టిల్ట్, మిడ్‌స్మాల్ ప్రైవేట్ బ్యాంక్స్, హాస్పిటల్స్, ఆరోగ్య సంరక్షణ రంగాలు రాణించాయి. బీఎస్ఈలో 2,426 షేర్లు ప్రతికూలంగా, 1,890 షేర్లు ప్రతికూలంగా ముగిశాయి. 214 షేర్లలో మార్పు లేదు. విదేశీ మదుపర్ల వాటా పరిమితిని 49.5 శాతంగా ఉంచే ప్రతిపాదనకు స్విగ్గీ వాటాదార్లు ఆమోదం తెలిపారు. ఇండియన్ ఓన్డ్ అండ్ కంట్రోల్డ్ కంపెనీ (ఐఓసీసీ) హోదా పొందేందుకు స్విగ్గీకి ఈ పరిణామం మార్గం చూపనుంది. రాణించిన మిల్కీ మిస్ట్: మిల్కీ మిస్ట్ డెయిరీ ఫుడ్ లిమిటెడ్ షేరు ఇష్యూ ధర రూ.140తో పోలిస్తే, బీఎస్ఈలో 17.85% లాభంతో రూ.165 వద్ద నమోదైంది. చివరకు 29.60% లాభపడి రూ.181.45 వద్ద ముగిసింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.13,968.81 కోట్లుగా నమోదైంది. సన్‌షైన్ పిక్చర్స్ రూ.282 కోట్ల ఐపీఓకు తొలి రోజున 4.33 రెట్ల స్పందన దక్కింది. కంపెనీ 54,86,051 షేర్లను ఆఫర్ చేయగా, 2,37,65,650 షేర్లకు మదుపర్లు బిడ్లు దాఖలు చేశారు. సంస్థాగతేతర మదుపర్ల విభాగంలో 6.23 రెట్లు, రిటెయిల్ విభాగంలో 5.98 రెట్లు, సంస్థాగత మదుపర్ల విభాగంలో 3% స్పందన లభించింది. ఈ నెల 20న ఇష్యూ ముగియనుంది. ధరల శ్రేణి రూ.342-360. లలితా జువెలరీ ఐపీఓ రెండో రోజుకు 3.07 రెట్ల స్పందన లభించింది. కంపెనీ 6,27,61,403 షేర్లను ఆఫర్ చేయగా, 19,25,66,944 షేర్లకు మదుపర్లు బిడ్లు దాఖలు చేశారు. సంస్థాగతేతర మదుపర్ల విభాగంలో 6.46 రెట్లు, రిటెయిల్ విభాగంలో 2.78 రెట్లు, సంస్థాగత మదుపర్ల విభాగంలో 1.02 రెట్ల స్పందన దక్కింది. నేడు (బుధవారం) ఐపీఓ ముగియనుంది. ధరల శ్రేణి రూ.190-201. ఈనెల 24న షేర్లు బీఎస్ఈ, ఎన్ఎస్ఈల్లో నమోదవుతాయి.
ఆగ్మాంట్ ఎంటర్‌ప్రైజెస్ రూ.825 కోట్ల ఐపీఓ ఈ నెల 21న ప్రారంభమై 25న ముగియనుంది. ధరల శ్రేణి రూ.750-788. తాజా షేర్ల జారీ ద్వారా రూ.620 కోట్లు, ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) ద్వారా రూ.205 కోట్ల నిధులు సమీకరించనుంది.

# అదరగొట్టిన బెహారీలాల్ ఇంజినీరింగ్.. 63% ప్రీమియంతో లిస్టింగ్




**ముంబై:** ఐరన్ అండ్ స్టీల్ తయారీ కంపెనీ బెహారీలాల్ ఇంజినీరింగ్ లిమిటెడ్ మదుపర్లకు లాభాల వర్షం కురిపించింది బుధవారం దాదాపు 63 శాతానికి పైగా ప్రీమియంతో ఈ షేర్లు స్టాక్ ఎక్స్ఛేంజీల్లో లిస్ట్ అయ్యాయి. ఇష్యూ ధర రూ.285 కాగా 60.70 శాతం లాభంతో బీఎస్ఈలో రూ.458 వద్ద షేర్లు లిస్టయ్యాయి. ఎన్ఎస్ఈలోనూ 63.15 శాతం ప్రీమియంతో రూ.465 వద్ద ట్రేడింగ్ మొదలెట్టాయి. దీంతో కంపెనీ మార్కెట్ విలువ రూ.2,135.22 కోట్లకు చేరింది. కంపెనీ ఐపీఓకు ఇన్వెస్టర్ల నుంచి కూడా భారీ డిమాండ్ వచ్చింది. చివరి రోజు నాటికి 108.44 రెట్ల సబ్‌స్క్రిప్షన్ అందుకుంది. రూ.302 కోట్ల నిధుల సమీకరణ లక్ష్యంతో ఆగస్టు 12న ఐపీఓకు వచ్చింది. ఆగస్టు 14న సబ్‌స్క్రిప్షన్ ముగిసింది. ఒక్కో షేరు ధర రూ.271-285గా కంపెనీ నిర్ణయించింది.
35% ప్రీమియంతో షిప్ రాకెట్ అరంగేట్రం
ఇ-కామర్స్ ప్లాట్‌ఫామ్ షిప్‌రాకెట్ కూడా వాటాదారులకు మంచి లిస్టింగ్ లాభాలను అందించింది. 35 శాతం ప్రీమియంతో కంపెనీ షేర్లు స్టాక్ ఎక్స్ఛేంజీల్లో లిస్ట్ అయ్యాయి. ఇష్యూ ధర రూ.97గా కంపెనీ నిర్ణయించగా.. బుధవారం బీఎస్ఈలో 33.50 శాతం లాభంతో రూ.129.50 వద్ద షేర్లు లిస్టయ్యాయి. ఎన్ఎస్ఈలో 35 శాతం ప్రీమియంతో రూ.131 వద్ద ట్రేడింగ్ మొదలెట్టాయి. దీంతో కంపెనీ విలువ రూ.9,901.60 కోట్లకు చేరింది. ఈ కంపెనీ రూ.1617.5 కోట్లు నిధుల సమీకరణ లక్ష్యంతో ఆగస్టు 12న ఐపీఓకి వచ్చింది. 14న సబ్‌స్క్రిప్షన్ ముగిసింది. చివరి రోజు నాటికి 99.38 రెట్ల బిడ్డింగ్ నమోదు చేసింది. ధరల శ్రేణి రూ.92-97గా నిర్ణయించింది.

# రైలు, రహదారి మౌలిక సదుపాయాలకు పెద్దపీట

ముఖ్యంగా గూడూరు-గుమ్మిడిపుండి 3, 4వ లైన్లకు కేబినెట్ ఆమోదం తెలిపింది. రూ.2,229 కోట్లతో గూడూరు-గుమ్మిడిపుండి 3, 4వ లైన్లు ఏర్పాటు చేయనున్నారు. అలాగే ఖరగ్‌పూర్-భద్రక్ 4వ లైన్‌కు రూ.3,352 కోట్లు, భద్రక్-హరిదాస్‌పూర్ 4వ లైన్‌కు రూ.1,583 కోట్లు, కటక్-పారాదీప్ 3, 4వ లైన్లకు రూ.2,286 కోట్లు కేటాయించార. రైల్వే ప్రాజెక్టులు పూర్తయితే సరుకు రవాణా సామర్థ్యం గణనీయంగా పెరగనుంది. మొత్తం మీద సుమారు 1.3 కోట్ల టన్నుల అదనపు సరుకు రవాణా సామర్థ్యం అందుబాటులోకి వస్తుందని అంచనా వేస్తున్నారు. ప్రయాణికుల రైళ్ల రాకపోకలు కూడా మరింత సులభతరం కానున్నాయి. లాగే బిహార్‌లోని ముజఫర్‌పూర్-సీతామర్హి-సోన్‌బర్సా హైవే నిర్మాణానికి కూడా కాబినెట్ నుంచి ఆమోదం లభించింది. నాలుగు లైన్లతో నిర్మించే ఈ హైవేకు రూ.3,591 కోట్లు కేటాయించారు. ఈ రహదారి బిహార్ ప్రాంతాలకు మెరుగైన అనుసంధానాన్ని కల్పించడంతో పాటు నేపాల్ సరిహద్దు వైపు రవాణా సౌకర్యాలను బలోపేతం చేయనుంది.

# ఆర్‌బీఐ కొత్త రూల్..

## హోమ్‌లోన్ ఈఎంఐలు మారనున్నాయా?



**న్యూఢిల్లీ:** హోమ్‌లోన్‌లకు సంబంధించి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కీలక ప్రతిపాదనతో ముందుకొచ్చింది. గృహ రుణాల వడ్డీ రేట్ల రీసెట్‌కు సంబంధించి తాజాగా డ్రాఫ్ట్ ఫ్రేమ్‌వర్క్‌ను విడుదల చేసింది. దీనివల్ల ఇప్పటికప్పుడు రుణ గ్రహీతలపై ప్రభావం పడనప్పటికీ.. వచ్చే ఏడాది నుంచి ఈ మార్పు అమల్లోకి రానుంది. ఇంతకీ ఏమిటీ నిబంధన? దీనివల్ల ఏమిటీ ప్రయోజనం? సాధారణంగా హోమ్‌లోన్‌లు ఫ్లోటింగ్ రేట్‌తో ముడిపడి ఉంటాయి. అంటే, ఆర్‌బీఐ కీలక వడ్డీ రేట్లను సవరించినప్పుడు దాన్ని అనుసరించి రుణ రేట్లు మారుతుంటాయి. అయితే, అన్ని బ్యాంకులూ ఒకేసారి మార్చవు. కొన్ని సందర్భాల్లో ఇవి మారడానికి ఏడాది సమయం పడుతోంది. దీనివల్ల తగ్గిన వడ్డీ ప్రయోజనం రుణ గ్రహీతలకు చేరడంలో ఆలస్యమవుతోంది.

**తీసుకొస్తున్న మార్పేంటి?**

ఫ్లోటింగ్ వడ్డీ రేట్ల రీసెట్ సమయం మూడు నెలలకు మించకూడదని ఆర్‌బీఐ తన తాజా నిబంధనల్లో పొందుపరిచింది. అంటే ఆర్‌బీఐ వడ్డీ రేట్లు తగ్గించినప్పుడు వేగంగా ఆ ప్రయోజనం దక్కుతుంది. అదే సమయంలో వడ్డీ రేట్లు పెంచినప్పుడూ ఇదే నియమం వర్తిస్తుంది. దీనిపై సెప్టెంబర్ 11 వరకు అభిప్రాయాలను సేకరిస్తోంది. వచ్చే ఏడాది ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి రానున్నాయి.

**వ్యక్తిగత రుణాలకు వర్తిస్తుందా?:**

ఆర్‌బీఐ తీసుకొస్తున్న నిబంధనలు కేవలం ఫ్లోటింగ్ రేట్ రుణాలకు మాత్రమే. గృహ రుణాలకు మాత్రమే ఈ వడ్డీ రేట్లు ఉంటాయి. వ్యక్తిగత, ఆటో రుణాలకు స్థిర వడ్డీ రేటు అమల్లో ఉంటుంది. కాబట్టి ఆర్‌బీఐ తీసుకొస్తున్న ఈ మార్పు వల్ల వ్యక్తిగత రుణాలపై ప్రభావం ఉండదు. కాబట్టి ఈఎంఐలలో ఎలాంటి మార్పూ ఉండదు. కొత్తగా తీసుకొనే గృహ రుణ వినియోగదారులు, ఇప్పటికే హోమ్‌లోన్ తీసుకున్నవారికే ఈ నిబంధన వర్తించనుంది.


# ఆదివారాల్లోనూ వైద్యసేవలు

## అపోలో ఆసుపత్రుల ఛైర్మన్ డాక్టర్ ప్రతాప్ సి.రెడ్డి

దిల్లీ: దేశవ్యాప్తంగా ఉన్న అపోలో ఆసుపత్రుల్లో, ఆదివారం కూడా అన్ని రకాల వైద్యసేవలు అందుబాటు ఉంటాయని ఆ సంస్థ ఛైర్మన్ డాక్టర్ ప్రతాప్ సి.రెడ్డి వెల్లడించారు. మంగళవారం దిల్లీలో 'ఆల్వేస్ ఓపెన్, ఆల్వేస్ హియర్' (ఎల్లప్పుడు తెరిచే ఉంటుంది, ఎల్లప్పుడు మీ కోసం ఉంటుంది) కార్యక్రమాన్ని డాక్టర్ ప్రతాప్ సి.రెడ్డి ప్రారంభించారు. 'ఆసుపత్రుల్లో క్యాజువాలిటీ అనే పదానికి బదులు ఎమర్జెన్సీ అనే భావన తీసుకొచ్చి, వైద్యానికి కొత్త అర్థం ఇచ్చాం. ఆరోగ్యం, ఆనందం ఇంట్లోనే లభించాలి అనే సంకల్పంతో వైద్య రంగాన్ని ముందుకు తీసుకెళ్తాం. త్వరలో హైదరాబాద్‌లో అత్యాధునిక ప్రోటాన్ థెరపీ సెంటర్ ఏర్పాటు చేయనున్నాం' అని డాక్టర్ ప్రతాప్ సి.రెడ్డి వివరించారు. అత్యధికులకు సెలవు రోజైన ఆదివారం వైద్యసేవలు అందుబాటులో ఉంటే, ఆసుపత్రికి వెళ్లేందుకు/తమవారిని తీసుకెళ్లేందుకు ఉద్యోగులు ప్రత్యేకంగా సెలవు పెట్టాల్సిన అవసరం ఉండదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నీతిఆయోగ్ సభ్యుడు ఎం.శ్రీనివాస్ హాజరయ్యారు.

# రీ సస్టైనబిలిటీ కొనుగోలుకు ఐ స్క్వేర్డ్-వియోలియా పోటీ

## రూ.11,000 కోట్ల వరకు బిడ్ వేసిన కన్సార్షియం



**హైదరాబాద్(జనంసాక్షి):** హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న వ్యర్థాల నిర్వహణ సంస్థ రీ సస్టైనబిలిటీ కొనుగోలుకు అమెరికాకు చెందిన ఐ స్క్వేర్డ్ క్యాపిటల్, ఫ్రాన్స్‌కు చెందిన వియోలియా సంస్థల కన్సార్షియం ఆసక్తి చూపిస్తోంది. రీ సస్టైనబిలిటీ విలువను సుమారు రూ.10,000-11,000 కోట్లుగా అంచనా వేస్తూ ఆ కన్సార్షియం ప్రాథమిక ప్రతిపాదనలు అందించినట్లు ఒక ఆంగ్ల పత్రిక వెల్లడించింది. రీ సస్టైనబిలిటీలో 60% వాటా కలిగిన పెట్టుబడి సంస్థ కేకేఆర్ మాత్రం కనీసం రూ.14,00 0-16,000 కోట్ల విలువ లభిస్తుందని ఆశిస్తోంది. వచ్చే ఆర్థిక సంవత్సరం లో నిర్వహణ లాభానికి 13-15 రెట్లు అధిక విలువ లభిస్తేనే విక్రయించాలని కేకేఆర్ భావిస్తున్నట్లు సమాచారం. అందుకే తాజా ప్రతిపాదనతో పాటు ఇతర ప్రత్యామ్నాయాలనూ కేకేఆర్ పరిశీలిస్తోందని సమాచారం. రీ సస్టైనబిలిటీ భారత్‌పాటు, సింగపూర్, యూఏఈ, సౌదీ అరేబియా, అమెరికా వంటి 100కు పైగా ప్రాంతాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తోంది. సంస్థలో దాదాపు 22,000 మంది సిబ్బంది ఉన్నారు. 2025-26లో ఈ సంస్థ రూ.2,700 కోట్ల ఆదాయం, రూ.930 కోట్ల నిర్వహణ లాభాన్ని గడిచింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.3,400 కోట్ల ఆదాయంపై రూ.1,100 కోట్ల నిర్వహణ లాభం సాధిస్తామని అంచనా వేస్తోంది.

# ఆస్పత్రిలో చికిత్స కోసం వచ్చి.. అగ్నికి ఆహుతై..

## కోల్‌కతా హోటల్‌లో అగ్నిప్రమాదం

## ప్రమాదంలో 9మంది మృతి

## మృతులంతా చికిత్స కోసం వచ్చిన బంగ్లాదేశీయులుగా గుర్తింపు

మృతుల సంఖ్య పెరిగే అవకాశాలు ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. అగ్నిప్రమాదంలో ఓ చిన్నారి సహా 9 మంది మృతి చెందారు. న్యూమార్కెట్ ప్రాంతంలోని ఫ్రీ స్కూల్ వీధిలో అర్ధరాత్రి 2 గంటలకు ఈ ప్రమాదం జరిగింది. ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో పలువురు చిక్కుకుపోయి మరణించారు. ఈ ఘటనలో మృతి చెందిన వారందరూ బంగ్లాదేశీయులేనని అగ్నిమాపక శాఖ తెలిపింది. మెడికల్ ట్రీట్‌మెంట్ కోసం వారు కోల్‌కతాకు వచ్చారని అధికారులు తెలిపారు. ఏసీ పేలడంతో మూడో అంతస్తులో మంటలు చెలరేగి ఉండవచ్చని అధికారులు భావిస్తున్నారు. అయితే, ఘటనకు గల కారణం ఇంకా వెల్లడించలేదు. మంటలు చెలరేగగానే హోటల్‌లోని కొందరు బయటకు పరుగుతీశారు. అగ్నికీలలు చుట్టూ ఉన్న ఇళ్లవైపు వ్యాపించడంతో ప్రజలు హాహాకారాలు చేశారు. ఘటన గురించి తెలియగానే అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. నాలుగు ఫైర్ ఇంజన్ల సాయంతో సిబ్బంది మంటలను అదుపు చేశారు. లోపల చిక్కుకున్న వారిని బయటకు తీసుకొచ్చారు. దట్టమైన పొగ వ్యాపించడంతో సహాయ కార్యక్రమాలకు కాస్త అంతరాయం ఏర్పడిందని ఓ పోలీసు అధికారి తెలిపారు. కాగా రెండు రోజుల క్రితం బిర్భూమ్ జిల్లాలోని ఓ హోటల్ అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో 8 మంది మరణించగా పలువురు గాయపడ్డారు.

# డిసెంబరు కల్లా 5-6 సెమీకండక్టర్ ప్రాజెక్టుల్లో ఉత్పత్తి మొదలు

## ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ కార్యదర్శి




దిల్లీ: దేశంలో సెమీకండక్టర్ తయారీ వ్యవస్థను అభివృద్ధి చేస్తున్నామని, ఈ ఏడాది చివరికి 5-6 సెమీకండక్టర్ ప్రాజెక్టుల్లో వాణిజ్య ఉత్పత్తి ప్రారంభమవుతుందని ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ కార్యదర్శి ఎస్ కృష్ణన్ తెలిపారు. సెప్టెంబరు 17న ప్రారంభం కానున్న సెమీకాన్ ఇండియా అయిదో ఎడిషన్ వివరాలు తెలిపేందుకు మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన ఈ వివరాలు తెలిపారు. ఇండియా సెమీకండక్టర్ మిషన్ (ఐఎస్ఎం 1.0) కింద తొలి దశలో ఆమోదం పొందిన 3 ప్రధాన ప్రాజెక్టులు వాణిజ్య ఉత్పత్తి ప్రారంభించాయని చెప్పారు. వాటిల్లో మొదటి దానిని ప్రధాని నరేంద్రమోదీ ఫిబ్రవరి 28న ప్రారంభించగా.. ఆ తర్వాత మరో రెండు ప్రారంభం అయ్యాయని అన్నారు. ఈ ఏడాది ముగిసేలోపు మరికొన్ని ప్రాజెక్టుల్లో ఉత్పత్తి ప్రారంభమవుతుందని, మొత్తంగా 5-6 ప్రాజెక్టుల్లో వాణిజ్య ఉత్పత్తి ఊపందుకుంటుందని పేర్కొన్నారు. కేంద్ర మంత్రివర్గం ఆమోదించిన ఐఎస్ఎం 2.0 కింద చిప్ డిజైన్, తయారీ, అధునాతన ప్యాకేజింగ్, పరికరాలు, మెటీరియల్స్, ఆర్అండ్‌డీ, నైపుణ్యం కలిగిన ప్రతిభావంతులను తయారు చేయడం వంటి అంశాలపై దృష్టి సారిస్తారని కృష్ణన్ తెలిపారు. దిల్లీలోని యశోభూమి (ఇండియా ఇంటర్నేషనల్ కన్వెన్షన్ అండ్ ఎక్స్‌పో సెంటర్)లో సెమీకాన్ ఇండియా- 2026 అయిదో ఎడిషన్‌ను సెప్టెంబరు 17న ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమంలో 240కి పైగా అంతర్జాతీయ కంపెనీలు, 150 మందికి పైగా ప్రపంచంలోని ప్రముఖ వక్తలు, 40కి పైగా దేశాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రతినిధి బృందాలు పాల్గొంటాయని అంచనా.

# జమ్మూకశ్మీర్ భారతదేశంలో అంతర్భాగం

## కశ్మీర్ సమస్యను అమెరికా పరిష్కరించదు :సీఎం ఒమర్ అబ్దుల్లా

శ్రీనగర్(జనంసాక్షి): కశ్మీర్ సమస్యను అమెరికా పరిష్కరించదని ఆ రాష్ట్ర సీఎం ఒమర్ అబ్దుల్లా అన్నారు. అమెరికా రాయబారి సెర్గియో గోర్ బుధవారం కశ్మీర్ పర్యటన నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. విదేశీ ప్రతినిధుల వద్దకు వెళ్లి తమ దేశం గురించి ఫిర్యాదులు చేసే అలవాటు తనకు లేదన్నారు. దిల్లీలోనే తమ సమస్యలు పరిష్కరించుకుంటామన్నారు. వాషింగ్టన్‌లో కాదని స్పష్టం చేశారు. ఆర్టికల్ 370 రద్దు తర్వాత జమ్మూకశ్మీర్‌లో అమెరికా రాయబారి పర్యటించడం ఇదే తొలిసారి. 2025 పహల్గాం ఉగ్రదాడి తర్వాత భారత్-పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు, ఆపరేషన్ సిందూర్ జరిగిన నేపథ్యంలో గోర్ పర్యటనకు ప్రాధాన్యం ఏర్పడింది. ఉగ్రవాద నిరోధక చర్యలపై కేంద్ర హోంమంత్రి అమిత్ షాతోనూ ఇటీవల ఆయన చర్చించారు.

జరిగిన నేపథ్యంలో అమెరికా రాయబారి జమ్మూకశ్మీర్‌లో ప్రత్యేకంగా పర్యటించడం ఇదే తొలిసారి. 'జమ్మూకశ్మీర్‌కు తొలిసారి రావడం ఆనందంగా ఉంది. ఇది ఎంతో అందమైన ప్రాంతం. ఒమర్‌తో భేటీ చాలా స్నేహపూర్వకంగా, సానుకూలంగా సాగింది. సమావేశంలో చర్చించిన అంశాలను వాషింగ్టన్, దిల్లీలోని సంబంధిత వర్గాలతో ముందుకు తీసుకెళ్తున్నాం. జమ్మూకశ్మీర్‌ను మరింత సురక్షితంగా మార్చేందుకు కేంద్రం, స్థానిక ప్రభుత్వం అద్భుతమైన చర్యలు తీసుకున్నాయి. ఈ నేపథ్యంలో అమెరికా పౌరుల కోసం జారీ చేసిన ప్రయాణ హెచ్చరికను సమీక్షించనున్నాం. ప్రస్తుతం అమెరికా జమ్మూకశ్మీర్‌కు లెవల్-4 డోంట్ ట్రావెల్ హెచ్చరికను జారీ చేసింది. ఈ హెచ్చరికను తక్కువ స్థాయికి మార్చే అంశాన్ని పరిశీలిస్తాం. అమెరికన్లు జమ్మూకశ్మీర్ అందాలను, ఇక్కడి అవకాశాలను ఆస్వాదించేందుకు రావాలని కోరుకుంటారు. అయితే ఈ విషయంలో శ్రీనగర్ నుంచే ఎలాంటి తుది ప్రకటన చేయలేను. అమెరికా ఎప్పటికప్పుడు తన ప్రయాణ హెచ్చరికలను సమీక్షిస్తుంది. జమ్మూకశ్మీర్‌లో భద్రత పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని తాజా పరిస్థితులను పరిశీలిస్తాం' అని సెర్గియో గోర్ పేర్కొన్నారు.

**ఆర్థిక సహకారాలపై చర్చ..**

భారత్-అమెరికా మధ్య ఆర్థిక సహకారాన్ని మరింత విస్తరించడంతో పాటు, ఇరు దేశాలకు పరస్పర ప్రయోజనం కలిగించే అవకాశాలపై ఒమర్ అబ్దుల్లాతో చర్చించినట్లు గోర్ తెలిపారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా పోస్టు చేశారు. " కశ్మీర్ భారతదేశంలో ముఖ్యమైన ప్రాంతం. నేను ఇక్కడికి రావడం ఇదే మొదటిసారి. ఈ ప్రాంతం అద్భుతమైన ప్రకృతి అందాలతో ఎంతో అందంగా ఉంది. ఇక్కడికి రావడం, ఈ ప్రాంతాన్ని కళ్లారా చూడటం ఎంతో సంతోషంగా ఉంది" అని గోర్ అన్నారు. జమ్మూకశ్మీర్‌కు అమెరికా జారీ చేసిన 'లెవల్-4 ట్రావెల్ అడ్వైజరీ హెచ్చరికను పునఃపరిశీలిస్తామని చెప్పారు. భారత్-అమెరికా వ్యూహాత్మక భాగస్వామ్యం మరింత బలపడుతున్న సమయంలో ఆయన పర్యటన జరగడం గమనార్హం. గోర్ గురువారం లద్దాఖ్‌లో పర్యటించనున్నారు. శ్రీనగర్‌లో వాణిజ్య, ఇతర సంఘాల సభ్యులతో సమావేశమయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. అయితే దీనిపై అధికారిక ప్రకటన వెలువడలేదు.

జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం
20 ఆగస్టు 2026

## ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి అక్కడికక్కడే మృతి

**యాచారం,ఆగస్టు 19 (జనం సాక్షి) :** యాచారం పోలీస్ స్టేషన్ పరిధిలోని గడ్డమల్లయ్యగూడ గ్రామం సమీపంలో బుధవారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందాడు. యాచారం ఎస్ఐ మధు తెలిపిన వివరాల ప్రకారం... రంగాపూర్ నుండి గడ్డమల్లయ్యగూడ గ్రామానికి జంగయ్య (35) అనే వ్యక్తి తన బైక్‌పై వస్తున్నాడు. అదే సమయంలో ఇబ్రహీంపట్నం నుండి రంగాపూర్ వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు డ్రైవర్ తీవ్ర నిర్లక్ష్యంతో, అతివేగంగా వచ్చి బైక్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన జంగయ్య అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించి దర్యాప్తు ప్రారంభించినట్లు తెలిపారు.

# యూరియా కోసం చెప్పులనే క్యూలో పెట్టిన రైతులు

**గంభీరావుపేట, ఆగస్టు 19 (జనంసాక్షి):** వ్యవసాయ పనులు ఊపందుకోవడంతో యూరియాకు డిమాండ్ పెరిగింది. అయితే అవసరానికి సరిపడా యూరియా అందుబాటులో లేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండల కేంద్రంలోని పీఏసీఎస్ గోదాం వద్ద మంగళవారం యూరియా కోసం రైతులు బారులు తీరారు. గంటల తరబడి క్యూలో నిలబడాల్సిన పరిస్థితి ఏర్పడటంతో కొందరు రైతులు తమ చెప్పులను వరుసగా పెట్టి క్యూలో తమ స్థానాలను కాపాడుకోవడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. గంభీరావుపేట పీఏసీఎస్‌లో ఆన్‌లైన్ ద్వారా 1,132 యూరియా బస్తాలు అందుబాటులో ఉంచడంతో రైతులు పెద్ద ఎత్తున బుకింగ్ చేసుకున్నారు. దీంతో తెల్లవారుజామున 6 గంటల నుంచే రైతులు గోదాం వద్దకు చేరుకుని యూరియా కోసం ఎదురుచూశారు. సమయం గడిచేకొద్దీ రైతుల సంఖ్య పెరగడంతో గోదాం ముందు భారీగా క్యూలు ఏర్పడ్డాయి.

యూరియా కోసం గంటల తరబడి వేచి ఉండాల్సి రావడంతో కొందరు రైతులు తమ చెప్పులను క్యూలో వరుసగా పెట్టి తమ స్థానాలను గుర్తించుకున్నారు. రైతులు అక్కడే ఉండి గంటల తరబడి వేచి ఉండలేక చెప్పులను పెట్టి తమ వంతు కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో యూరియా కొరత, పంపిణీ తీరుపై రైతుల్లో అసంతృప్తి



వ్యక్తమవుతోంది. ప్రస్తుతం వరి పంట కీలక దశలో ఉండటంతో పంటకు అవసరమైన ఎరువులను సకాలంలో అందించాల్సిన పరిస్థితి ఉంది. యూరియా కోసం రైతులు ఇబ్బందులు పడకుండా తగినంత నిల్వలు అందుబాటులో ఉంచి, పంపిణీ ప్రక్రియను వేగవంతం చేయాలని రైతులు కోరుతున్నారు. మండలంలోని అన్ని పీఏసీఎస్‌లు, ఎరువుల కేంద్రాల్లో యూరియా నిల్వలను పెంచి రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సరఫరా చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## బీర్కూర్‌లో రెండు ఇళ్ల చోరీ కేసు ఛేదన -నిందితుడి అరెస్ట్



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి ఆగస్టు 19 (జనం సాక్షి) :** బీర్కూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఏడాది క్రితం జరిగిన రెండు ఇళ్ల చోరీ కేసును పోలీసులు సాంకేతిక ఆధారాలతో ఛేదించారు. కర్ణాటకకు చెందిన సకత్ గోపిని నిందితుడిగా గుర్తించి అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. 2025 ఆగస్టు 1న సాయంత్రం బీర్కూర్‌లోని రెండు ఇళ్ల తాళాలు పగలగొట్టి చోరీలకు పాల్పడినట్లు ఫిర్యాదులు అందాయి. ఒక ఇంటి నుంచి బంగారం, వెండి ఆభరణాలు, మరో ఇంటి నుంచి రూ.2,000 నగదు అపహరించినట్లు పోలీసులు తెలిపారు. చోరీకి గురైన వస్తువుల మొత్తం విలువ సుమారు రూ.22,000గా నమోదైంది. కేసు దర్యాప్తులో భాగంగా బాన్సువాడ డీఎస్పీ, బాన్సువాడ రూరల్ సీఐ పర్యవేక్షణలో బీర్కూర్ ఎస్సై ఆధ్వర్యంలో ఫింగర్‌ప్రింట్ టెక్నాలజీ, సీసీ కెమెరాల ఆధారాలను పోలీసులు పరిశీలించారు. ఈ క్రమంలో సకత్ గోపిని అనుమానితుడిగా గుర్తించారు.

ఆగస్టు 19న మహారాష్ట్ర నుంచి బోధన్ వైపు వెళ్తున్న సమయంలో బరంగేడిగి గ్రామం వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తున్న సకత్ గోపిని పెట్రోలింగ్ పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. విచారణలో బీర్కూర్ పరిధిలో ఏడాది క్రితం చోరీకి పాల్పడినట్లు వెల్లడించినట్లు పోలీసులు తెలిపారు. అతడి వద్ద నుంచి ఇనుప రాడ్‌ను స్వాధీనం చేసుకున్నారు.

నిందితుడిపై గతంలోనూ నేరచరిత్ర ఉన్నట్లు పోలీసులు తెలిపారు. 2022లో బిచ్కుంద పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన చోరీ కేసులో సైతం అతడు రిమాండ్‌కు వెళ్లినట్లు వెల్లడించారు. సాంకేతిక పరిజ్ఞానం, ఫింగర్‌ప్రింట్ ఆధారాలు, సీసీ కెమెరాల సహాయంతో కేసును ఛేదించిన పోలీసులు, నేరాల నియంత్రణకు ఆధునిక సాంకేతికతను సమర్థంగా వినియోగిస్తున్నామని తెలిపారు. కేసులో మిగిలిన దర్యాప్తు కొనసాగుతోంది.

## ఆర్థోపెడిక్ సమస్యలకు సరైన వైద్యసేవలు అందిస్తాం

### ఆర్థోపెడిక్ స్పెషల్ కన్సల్టెంట్ డాక్టర్ సుఖేష్ రావు



**ఆర్మూర్,ఆగస్టు 19 (జనంసాక్షి):** సికింద్రాబాద్ యశోద హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఆర్మూర్ పట్టణంలోని అపర్ణ హాస్పిటల్ లో ప్రతినెల 3వ బుధవారం ప్రత్యేక ఆర్థోపెడిక్ వైద్య సేవలు అందిస్తున్నామని ఆర్థోపెడిక్ స్పెషల్ కన్సల్టెంట్ డాక్టర్ సుఖేష్ రావు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోబోటిక్ జాయింట్ రీప్లేస్‌మెంట్ పద్ధతి ద్వారా భుజం, మోకాలి మార్పిడి, మోకాళ్లకు కీ హోల్ సర్జరీ, మోకాళ్ల లిగమెంట్ గాయాలు భుజం గూడు తప్పుట,కండరం చిరిగిన సమస్యలు, మృదులాస్థి (కార్టిలేజ్) సర్జరీ,స్పైనల్ చికిత్స తదితర ఆర్థోపెడిక్ సమస్యలకు వైద్య సలహాలు అందిస్తామని వివరించారు.ఆర్థోపెడిక్ సమస్యల తో బాధపడుతున్న వారు స్పెషల్ కన్సల్టేషన్‌ను సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు.

# ఆర్ అండ్ ఆర్ భూ సేకరణ కోసం రూ. 206కోట్ల నిధులు విడుదల

### ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం

**భువనగిరి , ఆగస్టు 19 (జనంసాక్షి ప్రతినిధి) :** బస్వాపూర్ రిజర్వాయర్ ముంపు గ్రామమైన బి.ఎన్. తిమ్మాపురం గ్రామస్థులు ఈ రోజు స్థానిక సర్పంచ్ ఎడ్ల వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో భువనగిరి కుంభం అనిల్ కుమార్ రెడ్డి ని క్యాంపు కార్యాలయంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఆర్‌అండ్‌ఆర్, భూసేకరణ కోసం రూ.206 కోట్ల నిధులు విడుదల కావడంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం ఎమ్మెల్యే తో కలిసి గ్రామస్థులు ర్యాలీగా అంబేద్కర్ చౌరస్తాకు చేరుకుని డా. బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ బస్వాపూర్ రిజర్వాయర్ కోసం భూములు కోల్పోయిన రైతులు, నిర్వాసితులకు పూర్తిస్థాయిలో న్యాయం చేయడమే తన ప్రధాన లక్ష్యమని అన్నారు. గతంలో ఆర్‌అండ్‌ఆర్, భూసేకరణకు అవసరమైన నిధులు సకాలంలో విడుదల కాకపోవడంతో సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం బి.ఎన్. తిమ్మాపురం గ్రామస్థుల సమస్యను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లామని, వెంటనే స్పందించిన ముఖ్యమంత్రి రూ.206 కోట్ల ఆర్‌అండ్‌ఆర్, భూసేకరణ నిధులను విడుదల చేశారని తెలిపారు. ఇందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి భువనగిరి నియోజకవర్గ ప్రజల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

బస్వాపూర్ ప్రాజెక్టు పూర్తయితే భువనగిరి, వలిగొండ, నకిరేకల్, రామన్నపేట, తుంగతుర్తి ప్రాంతాల రైతులకు సాగునీరు అందుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. మూసీ మురుగు నీటిపై ఆధారపడకుండా గోదావరి జలాలతో రైతులు సాగు చేసుకునేలా బస్వాపూర్ ప్రాజెక్టును పూర్తి చేయడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



హయాంలో బస్వాపూర్ రిజర్వాయర్‌లో ఐదు టీఎంసీల నీటిని నింపి రైతులకు సాగునీరు అందించేందుకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. కెనాల్ ద్వారా దిగువ ప్రాంతాలకు నీరు చేరేందుకు నేషనల్ హైవే వద్ద అవసరమైన పనులు చేపట్టామని, బునాదిగాని, ధర్మారెడ్డి, పిల్లాయిపల్లి కాల్వల పనులను కూడా త్వరితగతిన పూర్తి చేస్తామని తెలిపారు.

బస్వాపూర్ ప్రాజెక్టును పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించడంతో పాటు, నిర్వాసితులకు పూర్తిస్థాయిలో న్యాయం చేయడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ తంగళ్లపల్లి శ్రీవాణి-రవికుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ రేఖా-బాబురావు, ఆత్మ చైర్మన్ కృష్ణారెడ్డి, వైస్ ఛైర్‌పర్సన్ పోతంశెట్టి మంజుల-వెంకటేశ్వర్లు,రాజూ చైర్మన్లు సతీష్ పవన్, శ్యామ్ గౌడ్, పట్టణ కౌన్సిలర్లు, భువనగిరి నియోజకవర్గంలోని మండలాల అధ్యక్షులు,ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, బి.ఎన్. తిమ్మాపురం గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు

## బుల్లెట్ ట్రైన్ కోసం చేసే ఏ పోరాటానికైనా బీఆర్ఎస్ పూర్తి మద్దతు




**సూర్యాపేట (జనంసాక్షి):** సూర్యాపేట ప్రజల చిరకాల స్వప్నం కోసం పోరాడుతున్న బుల్లెట్ ట్రైన్ సాధన సమితి చేపట్టే ఏ కార్యక్రమానికైనా బీఆర్ఎస్ పూర్తి మద్దతు ఉంటుందని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్ గౌడ్, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వై.వెంకటేశ్వర్లు లు అన్నారు. బుల్లెట్ ట్రైన్ సాధన సమితి ఆధ్వర్యంలో బుధవారం ఆరవ రోజు రిలే నిరాహార దీక్షలో కూర్చున్న ఆర్యవైశ్యులకు బిఆర్ఎస్ నాయకులతో కలసి మద్దతు తెలిపి మాట్లాడారు.సూర్యాపేటకు రైల్వే మార్గం వస్తే ఈ ప్రాంతమంతా పారిశ్రామికంగా, సామాజికంగా, ఆర్థికంగా ఎంతో అభివృద్ధి చెందుతుందన్నా రు. కేంద్ర ప్రభుత్వం బుల్లెట్ ట్రైన్ అలాట్మెంట్ ను మొదట సూర్యాపేటకు కేటాయించి తర్వాత మార్గాన్ని మార్చడం ఏమిటని ప్రశ్నించారు. జాతీయ రహదారి 65కు సమాంతరంగా బుల్లెట్ ట్రైన్ ఏర్పాటు చేయడంతో పాటు రైల్వే కారిడార్ చేయాలని డిమాండ్ చేశారు.

# విద్య, క్రీడలతో పాటు ఆరోగ్యంపై శ్రద్ధ

- గురుకుల పాఠశాలలో కలెక్టర్ దీపక్ తివారి పరిశీలన
- విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలని ఆదేశం
- ఆయిల్‌పామ్, కూరగాయల సాగుతో అదనపు ఆదాయం
- పీహెచ్‌సీలో నాణ్యమైన వైద్యం అందించాలి

**కుల్కచర్ల, ఆగస్టు 19 (జనం సాక్షి):** విద్యార్థులు చదువుతో పాటు క్రీడలు, ఇతర కార్యక్రమాల్లోనూ నైపుణ్యం సాధించాలని వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారి సూచించారు. బండవెల్కిచెర్లలోని గిరిజన సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలను సందర్శించిన ఆయన విద్యాబోధన, భోజనం, తాగునీరు, పారిశుద్ధ్యం, వసతులను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి చదువు, సౌకర్యాలపై వివరాలు తెలుసుకున్నారు. ఆరోగ్యం, భద్రత, పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. అర్హులకు పథకం ప్రయోజనం సక్రమంగా అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. బండివెల్లికెచెర్లలో రైతు సంజీవరెడ్డి సాగు చేస్తున్న 6.5 ఎకరాల ఆయిల్‌పామ్ తోటను పరిశీలించిన కలెక్టర్, జిల్లాలో ఆయిల్‌పామ్ సాగుకు అనుకూల పరిస్థితులు ఉన్నందున రైతులు ముందుకు రావాలని కోరారు. ప్రభుత్వ రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆయిల్ పామ్ తోటల్లో అంతర పంటల ద్వారా అదనపు ఆదాయం పొందవచ్చన్నారు.



రాంనగర్‌లో మల్చింగ్ విధానంలో సాగు చేస్తున్న బీర, కాకర, చిక్కుడు, టమాట పంటలను పరిశీలించి, కూరగాయల సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను వినియోగించుకోవాలని రైతులకు సూచించారు. అనంతరం కుల్కచర్ల పీహెచ్‌సీని సందర్శించి వైద్య సేవలు, మందుల లభ్యత, పారిశుద్ధ్యాన్ని పరిశీలించారు. రోగులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. అవసరమైన మందులు, పరికరాలు అందుబాటులో ఉంచి ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించాలని వైద్యాధికారులను ఆదేశించారు. కార్యక్రమాల్లో జిల్లా విద్యాధికారి సుధాకర్‌లాల్, జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి ఎం.ఏ. సత్తార్, వ్యవసాయ శాఖ అధికారి కవిత, ప్రిన్సిపాల్ బాల వరలక్ష్మి, ఎంపీడీఓ రామకృష్ణ, తహసీల్దార్ పురుషోత్తం, ఎంఈఓ అబీబ్ అహ్మద్, వైద్యులు సాజీదా బేగం, కిరణ్‌కుమార్, అధికారులు, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

# గచ్చిబౌలిలో భారీగా డ్రగ్స్ స్వాధీనం

- 95.41 గ్రాముల ఎండీఎంఏ, 50 గ్రాముల ఓజీ కుష్ పట్టివేత
- ముగ్గురు డ్రగ్ పెడ్లర్ల అరెస్ట్.. అదుపులో16 మంది వినియోగదారులు
- స్వాధీనం చేసుకున్న మాదకద్రవ్యాల విలువ రూ.16.40 లక్షలు
- డ్రగ్స్‌పై ఉక్కుపాదం.. డీసీపీ సీహెచ్. వై. శ్రీనివాస్

**శేరిలింగంపల్లి, ఆగస్టు 19 (జనంసాక్షి):** గచ్చిబౌలి పోలీసులు, ఎస్ఓటీ సైబరాబాద్ సంయుక్తంగా నిర్వహించిన ఆపరేషన్‌లో ముగ్గురు డ్రగ్ పెడ్లర్లను అరెస్ట్ చేసి భారీగా మాదకద్రవ్యాలను స్వాధీనం చేసుకున్నారు. మొత్తం 95.41 గ్రాముల ఎండీఎంఏ, 50 గ్రాముల ఓజీ కుష్, రెండు సెల్‌ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ.16.40 లక్షలు ఉంటుందని శేరిలింగంపల్లి డీసీపీ సీహెచ్. వై. శ్రీనివాస్ తెలిపారు. బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో కేసు వివరాలను వెల్లడించిన ఆయన.. ఆగస్టు 11న వట్టినాగులపల్లి కింగ్‌డమ్ పబ్ రోడ్ వద్ద తనిఖీలు నిర్వహించగా డ్రగ్ పెడ్లర్ కొరిపెల్ల యశ్వంత్ సాయి షణ్ముఖ్‌తో పాటు 16 మంది వినియోగదారులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. విచారణలో యశ్వంత్‌కు కేరళకు చెందిన మహ్మద్ రజల్ అబ్దుల్ గఫూర్, బెంగళూరుకు చెందిన నవీనా కె.డి. ఎండీఎంఏ సరఫరా చేస్తున్నట్లు వెల్లడైందన్నారు. దీంతో ప్రత్యేక బృందాలను కేరళ, బెంగళూరుకు పంపి నిందితుల కోసం గాలింపు చేపట్టినట్లు తెలిపారు. ఆగస్టు 18న కేరళలోని త్రిస్సూర్‌లో మహ్మద్ రజల్ అబ్దుల్ గఫూర్‌ను అరెస్ట్ చేసి విచారించగా,



యశ్వంత్‌కు 44.41 గ్రాముల ఎండీఎంఏ సరఫరా చేసినట్లు, ఆ డ్రగ్‌ను 'సామ్' అనే నైజీరియన్ వ్యక్తి నుంచి పొందినట్లు వెల్లడైందన్నారు. అదే రోజు బెంగళూరులోని బేగూర్‌లో నవీనా కె.డిని అరెస్ట్ చేసి, ఆమె నివాసంలో తనిఖీలు నిర్వహించగా 51 గ్రాముల ఎండీఎంఏ, 50 గ్రాముల ఓజీ కుష్ లభించినట్లు డీసీపీ తెలిపారు. ఈ మాదకద్రవ్యాలను కేరళకు చెందిన తన స్నేహితుడు అనేశ్వర్ నుంచి పొందినట్లు విచారణలో నవీనా వెల్లడించిందన్నారు. డ్రగ్స్ అక్రమ రవాణా, విక్రయాలు, వినియోగంపై సైబరాబాద్ పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటున్నారని డీసీపీ స్పష్టం చేశారు. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, తల్లిదండ్రులు, విద్యాసంస్థల యాజమాన్యాలు విద్యార్థుల కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. డ్రగ్స్ లేదా గంజాయి అక్రమ రవాణాపై సమా చారం తెలిసిన వారు డయల్-100 లేదా సైబరాబాద్ పోలీసుల వాట్సాప్ నంబర్ 8712663061కు సమాచారం ఇవ్వాలని, సమాచారదాతల వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

## టిమ్స్‌కు వెళ్లకుండా ఎమ్మెల్యే తలసాని హౌస్ అరెస్ట్

### జూబ్లీహిల్స్ నివాసంలో పోలీసుల నిర్బంధం



**సనత్‌నగర్, ఆగస్టు 19 (జనం సాక్షి):** టిమ్స్ నిర్మాణానికి సంబంధించిన వాస్తవాలను ప్రజల ముందుంచేందుకు సనత్‌నగర్ టిమ్స్‌ను సందర్శించేందుకు సిద్ధమైన మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ ను పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. టిమ్స్ ప్రారంభోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు వాస్తవాలకు దూరం గా ఉన్నాయని ఆరోపిస్తూ బుధవారం ఉదయం టిమ్స్‌ను సందర్శించేందుకు తలసాని సిద్ధమ య్యారు. దీంతో జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసానికి చేరుకున్న పోలీసులు ఆయనను బయటకు వెళ్లకుండా నిర్బంధించారు. తలసాని పిలుపు మేరకు టిమ్స్‌కు వెళ్లేందుకు సిద్ధమైన మాజీ కార్పొరేటర్ శేషుకుమారిని సైతం పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. బీకే గూడలోని ఆమె నివాసంలో ఎస్ఆర్‌నగర్ పోలీసులు ఆమెను నిర్బంధించారు. ఈ సందర్భంగా శేషు కుమారి మాట్లాడుతూ టిమ్స్ నిర్మాణానికి సంబ ంధించిన వాస్తవాలను ప్రజలకు వెల్లడించేం దుకు బీఆర్ఎస్ బాధ్యతాయుతంగా వ్యవహరి స్తుంటే, ప్రభుత్వం పోలీసుల ద్వారా అడ్డుకోవ డం ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. ప్రజల కు వాస్తవాలను తెలియజేయకుండా తమను అడ్డుకోవడం ఎందుకని ఆమె ప్రశ్నించారు.

## బెల్ట్‌షాపుల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి

### ఎస్ఐ విమలకు వినతిపత్రం అందజేసిన వీఎచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కావలి నర్సిములు

**బంట్వారం, ఆగస్టు 19 (జనం సాక్షి):** మండలంతో పాటు కర్ణాటక సరిహద్దు ప్రాంతాల్లోని మారుమూల గ్రామాల్లో బెల్ట్‌షాపుల ద్వారా జరుగుతున్న మద్యం విక్రయాలను నియంత్రించేందుకు పోలీసులు, ఎక్సైజ్ అధికారులు చర్యలు తీసుకోవాలని వీఎచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కావలి నర్సిములు కోరారు. ఈ మేరకు బంట్వారం ఎస్ఐ విమలకు వినతిపత్రం అందజేశారు. సరిహద్దు ప్రాంతాల్లో బెల్ట్‌షాపులు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయని ఆయన అన్నారు. రోజంతా కష్టపడి పనిచేసే రైతులు, వ్యవసాయ కూలీలు సాయంత్రం మద్యానికి బానిసవుతూ అనారోగ్యం పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రశాంత వాతావరణం నెలకొల్పేందుకు బెల్ట్‌షాపులపై కఠిన చర్యలు తీసుకుని అక్రమ మద్యం విక్రయాలను అరికట్టాలని పోలీసు, ఎక్సైజ్ అధికారులను కోరారు. దీనిపై ఎస్ఐ విమల స్పందిస్తూ బెల్ట్‌షాపుల నియంత్రణకు తమవంతు చర్యలు తీసుకుంటామని తెలిపారు. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయాలు నిర్వహిస్తున్న వారిని గుర్తించి కేసులు నమోదు చేసి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.


## తండ్రి వేధింపులు తట్టుకోలేక కృష్ణలోకి దూకిన యువతి.. కాపాడిన మత్స్యకారులు



**జోగులాంబ గద్వాల ప్రతినిధి, (జనం సాక్షి) :** "నాన్న తాగుడు, చిత్రహింసలు ఇక భరించలేను" అంటూ ఒక యువతి బీచుపల్లి కృష్ణానదిలోకి దూకి ఆత్మహత్యకు యత్నించిన ఘటన మంగళవారం ఉదయం కలకలం రేపింది.గద్వాల జిల్లా పులికల గ్రామానికి చెందిన బోయ జమేశ్వరి తండ్రి మద్యం మత్తులో రోజూ వేధిస్తున్నారని ఆవేదన చెందింది. ఇంట్లో జరిగే హింస గురించి అయిజ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా న్యాయం జరగలేదని తీవ్ర మనస్తాపానికి గురైంది.విరక్తితో ఇంటి నుంచి బయటకు వచ్చిన ఆమె బీచుపల్లి వద్ద కృష్ణానదిలోకి దూకేసింది.అదే సమయంలో అక్కడ ఉన్న కొండపేట మత్స్యకారులు గమనించి వెంటనే నదిలోకి దూకారు. ప్రాణాలకు తెగించి ఆమెను రక్షించి ఒడ్డుకు చేర్చారు.సమాచారం అందుకున్న ఇటిక్యాల ఎస్ఐ రవి తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకున్నారు. జమేశ్వరిని విచారించి, ఆమెను కుటుంబ సభ్యులకు అప్పగించారు."పోలీసులకు చెప్పినా ఫలితం లేదు. ఇక బతికి ఏం లాభం" అంటూ జమేశ్వరి కన్నీరు పెట్టుకున్నట్లు సమాచారం.ఒకవైపు మత్స్యకారుల మానవత్వం ప్రాణం కాపాడగా, మరోవైపు గృహహింసకు గురవుతున్న ఆడపిల్లల రక్షణపై మరోసారి చర్చకు తెరతీసింది ఈ ఘటన.

# ఎరువుల కొరత.. రైతులపై ధరల వాత!

- హాకా, ఆగ్రోస్, డీసీఎంఎస్ కేంద్రాల్లో అదనపు వసూళ్లు
- ఎంఆర్‌పీకి రవాణా ఛార్జీలు అదనం.. రైతులపై భారం
- యూరియా బస్తా రూ.350కు పైగా విక్రయిస్తున్నారనే ఆరోపణలు
- వ్యవసాయ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదంటున్న రైతులు



**కోహీర్, ఆగస్టు 18, జనం సాక్షి:** ఎరువుల కొరతను ఆసరాగా చేసుకుని కొందరు వ్యాపారులు రైతుల నుంచి అధిక ధరలు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వ అనుబంధ సంస్థలైన హాకా, ఆగ్రోస్, డీసీఎంఎస్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న కొన్ని ఎరువుల విక్రయ కేంద్రాల్లోనూ యూరియా, డీఏపీకి ఎంఆర్‌పీ కంటే అదనంగా రవాణా ఛార్జీల పేరుతో వసూళ్లు చేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు.

ఎంఆర్‌పీపై రవాణా ఛార్జీలు అదనంగా వసూలు చేసుకునేందుకు ప్రభుత్వం తమకు అనుమతి ఇచ్చిందని కొందరు దుకాణ నిర్వాహకులు చెబుతున్నట్లు సమాచారం. అయితే ఇందుకు సంబంధించి అధికారిక ఉత్తర్వులు తమకు చూపించలేదని రైతులు అంటున్నారు. ప్రభుత్వ రంగ సంస్థల అనుబంధ కేంద్రాలు కావడంతో నిర్వాహకులు చెప్పేది నిజమేనని భావించి రైతులు అదనపు మొత్తాన్ని చెల్లించాల్సి వస్తోందని వాపోతున్నారు.

### యూరియా బస్తాకు రూ.350కు పైగా?

యూరియా బస్తా ఎంఆర్‌పీ రూ.288.50గా ఉండగా, కొన్ని కేంద్రాల్లో రూ.300కు పైగా వసూలు చేస్తున్నారని రైతులు చెబుతున్నారు. మరికొన్ని చోట్ల బస్తాకు రూ.100 నుంచి రూ.200 వరకు రవాణా ఛార్జీల పేరుతో అదనంగా తీసుకుంటున్నారని ఆరోపణలు ఉన్నాయి. మారుమూల ప్రాంతాల్లో యూరియా బస్తా రూ.350కు పైగా విక్రయిస్తున్నారనే ఫిర్యాదులు కూడా వినిపిస్తున్నాయి.

డీఏపీ విషయంలోనూ ఇదే పరిస్థితి నెలకొన్నట్లు రైతులు చెబుతున్నారు. ఎరువుల కొరతను ఆసరాగా చేసుకుని ఇష్టారీతిన ధరలు నిర్ణయిస్తున్నారని, అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో దుకాణ నిర్వాహకులు తమకు నచ్చిన విధంగా వసూళ్లు చేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### 'మౌఖిక ఆదేశాలు' అంటూ..

ఇటీవల ఎరువుల సరఫరా, రవాణా వ్యవహారాల్లో మార్పులు చోటుచేసుకున్న నేపథ్యంలో కొందరు దుకాణ నిర్వాహకులు 'మౌఖిక ఆదేశాలు వచ్చాయి' అంటూ అదనపు రవాణా ఛార్జీలు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అయితే ప్రభుత్వం నుంచి స్పష్టమైన అధికారిక ఉత్తర్వులు జారీ అయ్యాయా? లేదా? అన్నది వ్యవసాయ శాఖ అధికారులు వెల్లడించాల్సి ఉంది.

ఇప్పటివరకు ఆగ్రోస్, హాకా, డీసీఎంఎస్ అనుబంధ కేంద్రాలకు ఎరువులను మార్క్‌ఫెడ్ సంస్థ సరఫరా చేస్తూ, రవాణా ఖర్చులను భరించేదని సంబంధిత వర్గాలు చెబుతున్నాయి. తాజాగా రవాణా ఖర్చుల భారం విషయంలో మార్పులు రావడంతో ఆ భారాన్ని రైతులపై మోపుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

### యాప్ విధానం.. రైతులకు ఇబ్బందులు

ఇదిలా ఉండగా ఈ నెల నుంచి ఎరువుల విక్రయాలను యాప్ ద్వారా నిర్వహించే విధానం అమల్లోకి రావడంతో గ్రామీణ ప్రాంత రైతులు మరిన్ని ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెబుతున్నారు. యాప్‌లో నమోదు, కొనుగోలు ప్రక్రియపై అవగాహన లేకపోవడం, సాంకేతిక సమస్యలు తదితర కారణాలతో రైతులు ఎరువుల కోసం ఇబ్బందులు పడుతున్నారని సమాచారం.

### చర్యలు తీసుకోవాలని డిమాండ్

ప్రభుత్వం నిర్ణయించిన ఎంఆర్‌పీ కంటే అధికంగా వసూలు చేస్తున్న కేంద్రాలపై వ్యవసాయ శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించాలని రైతులు కోరుతున్నారు. రవాణా ఛార్జీల పేరుతో అదనపు వసూళ్లకు అనుమతి ఉంటే దానికి సంబంధించిన అధికారిక ఉత్తర్వులను బహిర్గతం చేయాలని, అనుమతి లేకుండా అధిక ధరలకు విక్రయాలు జరుగుతున్నట్లయితే సంబంధిత నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

ఎరువుల కొరతను ఆసరాగా చేసుకుని రైతులపై అదనపు భారం పడకుండా అధికారులు కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని రైతులు పేర్కొంటున్నారు.

# అటవీ సంరక్షణకు సమష్టి కార్యాచరణ

- అటవీ భూముల ఆక్రమణలపై కఠిన చర్యలు
- వన్యప్రాణుల రక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలి
- చెక్‌డ్యామ్‌లు, మొక్కల పెంపకానికి ప్రాధాన్యం
- అనువైన ప్రాంతాలను పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేయాలి



**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి, ఆగస్టు 19 (జనం సాక్షి):** జిల్లాలో అటవీ ప్రాంత పరిరక్షణ, విస్తరణకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ భవేష్ మిశ్రా అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో బుధవారం ఆయన అధ్యక్షతన జరిగిన జిల్లా స్థాయి అటవీ సంరక్షణ కమిటీ సమావేశంలో అటవీ భూముల ఆక్రమణల నిరోధం, వన్యప్రాణుల సంరక్షణ, వనమహోత్సవం, జల సంరక్షణ, వాల్టా చట్టం అమలు, అటవీ ప్రాంతాలను పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేయడం తదితర అంశాలపై సమీక్షించారు. అటవీ భూములను ఆక్రమించే వారిపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు ప్రజలకు చట్టాలపై విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు.

జిల్లాలో 86,947.11 హెక్టార్లలో, 20 శాతానికి పైగా అటవీ ప్రాంతం విస్తరించి ఉందని జిల్లా అటవీ అధికారి ప్రశాంత్ పాటిల్ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. సిరికొండ, కమ్మర్‌పల్లి, కాల్పోల్ తండా, డీబీ తండా, చందూర్ తదితర ప్రాంతాల్లో అటవీ భూములు ఆక్రమణలకు గురవుతున్నాయని తెలిపారు. ఆక్రమణలను అడ్డుకునేందుకు పోలీసు, రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖల సహకారం అవసరమని పేర్కొన్నారు. స్పందించిన కలెక్టర్.. అటవీ భూముల పరిరక్షణకు అన్ని శాఖల నుంచి పూర్తి సహకారం అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సెప్టెంబర్ 1 నుంచి ఆయా గ్రామాల్లో విస్తృత సమావేశాలు నిర్వహించి అటవీ భూముల ఆక్రమణల వల్ల కలిగే నష్టాలు, చట్టపరమైన చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు.


వన్యప్రాణుల సంరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. చిరుతలు, ఇతర వన్యప్రాణులు రోడ్లు దాటే ప్రాంతాల్లో ప్రమాదాల నివారణకు వాహనాల వేగాన్ని నియంత్రించేలా తగిన ఏర్పాట్లు చేయాలని అన్నారు. అటవీ సంపద పరిరక్షణకు అవసరమైన సరిహద్దు ప్రాంతాల్లో చెక్‌పోస్టుల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపాలని సూచించారు. అటవీ ప్రాంతాల్లో జల సంరక్షణ, భూగర్భ జలాల పెంపునకు చెక్‌డ్యామ్‌లు నాణ్యతతో నిర్మించాలని, వనమహోత్సవంలో విస్తృతంగా మొక్కలు నాటాలని ఆదేశించారు.

జిల్లాలోని అటవీ ప్రాంతాలను పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ తెలిపారు. ఆర్మూర్ నగర వాటిక, నిజామాబాద్ ఖిల్లా, నందిపేటలోని ఎస్సారెస్పీ బ్యాక్‌వాటర్ ప్రాంతం, అంకాపూర్ మోడల్ స్కూల్ తదితర ప్రాంతాలను అటవీ శాఖ ఆధ్వర్యంలో అభివృద్ధి చేసే ప్రతిపాదనలకు జిల్లా యంత్రాంగం పూర్తి సహకారం అందిస్తుందని చెప్పారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వి. భుజంగరావు, ఆర్మూర్ సబ్‌కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియ, అదనపు డీసీపీ శుభం నగ్రాలే, ట్రైనీ కలెక్టర్ సురేష్, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్‌కుమార్, జెడ్పీ సీఈవో సాయాగౌడ్, డీఆర్‌డీవో సాయన్న, ఆర్డీవోలు రాజేంద్రకుమార్, విజయకుమారి, ట్రైనీ ఆర్డీవో సందీప్, ఏసీపీలు ప్రకాశ్, శ్రీనివాస్, వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




# ఎడపల్లి సహకార సంఘంలో ఎరువుల కుంభకోణం

- చేతివాటం ప్రదర్శించిన సెల్స్ మెన్లు
- రూ 28 లక్షల రూపాయల దుర్వినియోగం
- ప్రత్యేక అధికారి రమావతి హయాంలో బట్టబయలు



**ఎడపల్లి, ఆగస్టు 19 (జనంసాక్షి) :**

ఎడపల్లి మండల కేంద్రంలోని సహకార సంఘంలో ఎరువుల విక్రయానికి సంబంధించి 28 లక్షల రూపాయల దుర్వినియోగం అయినట్లు ప్రాథమిక విచారణలో తేలింది. సహకార సంఘం పాలకవర్గం నియమించుకున్న ముగ్గురు సేల్స్ మెన్లు ఈ నిధులు దుర్వినియోనికి పాల్పడినట్లు సమాచారం. ఎడపల్లి సహకార సంఘం ప్రత్యేక అధికారి ఫీల్డ్ ఆఫీసర్ అయిన రమావతి ఈ ఎరువుల కుంభకోణంను బట్టబయలు చేసినట్లు సమాచారం. ఇక వివరాలోకి వెళ్తే వెళితే ఎడపల్లి మండల కేంద్రంలోని సహకార సంఘంలో కోట్లల్లో ఎరువుల క్రయవిక్రయాలు జరుగుతుంటాయి. అయితే ఇందుకు సంబంధించి ఎడపల్లి సహకార సంఘం పరిధిలోని ఎడపల్లి, కుర్నాపల్లి, తానాకలాన్, ధర్మారం మంగళ్ పాడు గ్రామాలలో గల సహకార సంఘం గోదాములకు సంబంధించి ఎరువులను రైతులకు విక్రయిస్తుంటారు. అందులో భాగంగా ఎడపల్లి సహకార సంఘం నియమించుకున్న ముగ్గురు సేల్స్ మెన్లు ఎరువులకు సంబంధించిన లావాదేవీలను చూసే విధంగా సంబంధిత శాఖ అధికారులు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. అయితే ఇదే అదునుగా భావించిన సేల్స్ మెన్లు మొత్తం 28 లక్షల వరకు ఎరువుల విక్రయానికి సంబంధించిన నిధులను పక్కదారి పట్టించి తమ స్వంతానికి వాడుకున్నట్లు అధికారులు స్పష్టం చేశారు. ఒక్క సేల్స్ మెన్ 25 లక్షలు, మరో సెల్స్ మెన్ 3 లక్షలు, మరో సేల్స్ మెన్ రెండు లక్షల 80 వేల వరకు వాడుకున్నట్లు ఎడపల్లి సహకార సంఘం కార్యదర్శి రాజారాం స్పష్టం చేశారు. కాగా ఇందులో రెండు లక్షల 80వేల రూపాయలు వరకు వాడుకున్న సేల్స్ మెన్ తిరిగి సంఘంకు డబ్బులు చెల్లించినట్లు సమాచారం. అయితే సహకార సంఘంలో ఇంత పెద్ద మొత్తంలో ఎరువుల కుంభకోణం జరుగుతుండగా సంబంధిత అధికారులు దుర్వినియోగం అయ్యేవరకు గుర్తించకపోవడంలో గల మతలబు ఏమిటో ఎవరికి అర్థం కావడం లేదు. ప్రత్యేక అధికారిగా వ్యవహరించిన రమావతి హయాంలో ఈ కుంభకోణం బట్టబయలు అయినట్లు సమాచారం.

కోట్లాది రూపాయల టర్నోవర్ అయ్యే ఎడపల్లి సహకార సంఘం లావాదేవీల విషయంలో సంబంధిత అధికారులు ఆశించినంత దృష్టిసారించకపోవడంతోనే కిందిస్థాయి సిబ్బంది చేతివాటం ప్రదర్శించారనే ఆరోపణలు లేకపోలేదు. అయితే సదరు సేల్స్ మేన్లపై రికవరీ చర్యలు తీసుకోవాలని కోరుతూ పాలకవర్గం తీర్మానం చేసి జిల్లా సహకార సంఘం అధికారులకు సమర్పించినట్లు సమాచారం.

## నిధులను రికవరీ చేసి చర్యలు తీసుకుంటాం

**జిల్లా సహకార సంఘం అధికారి శ్రీనివాస్ రావు**

ఈ విషయమై జనంసాక్షి జిల్లా సహకార సంఘం అధికారి శ్రీనివాస్ రావును వివరణ కోరగా, ఎడపల్లి సహకార సంఘంలో ఎరువుల విక్రయానికి సంబంధించి నిధులు దుర్వినియోగం అయిన మాట వాస్తవమేనని స్పష్టం చేశారు. అయితే సంబంధిత సేల్స్ మెన్ల నుండి డబ్బులను తిరిగి చెల్లిస్తామని వారితో సంతకం తీసుకోవడం జరిగిందన్నారు. ఇప్పటికే వారి వేతనంను సంఘంకు అందించే విధంగా చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. అయితే పూర్తి నివేదిక వచ్చిన తర్వాత సదరు సేల్స్ మెన్లు రికవరీ డబ్బులు చెల్లించకుంటే వారి ఆస్తులు జప్తు చేసి నిధులను జమ చేయడం జరుగుతుందని జిల్లా సహకార సంఘం అధికారి శ్రీనివాస్ రావు వివరించారు. మునుముందు ఇలాంటి చర్యలు జరగకుండా పకడ్బంది చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన అన్నారు.



## 8 కిలోల భారీ ఓవేరియన్ సిస్ట్ తొలగింపు

**మెట్ పల్లి, ఆగస్టు 19 (జనం సాక్షి) :**

శ్రీ శ్రీనివాస మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో ఓ మహిళకు ఏర్పడిన సుమారు 8 కిలోల భారీ ఓవేరియన్ సిస్ట్‌ను శస్త్రచికిత్స ద్వారా విజయవంతంగా తొలగించారు. పెద్ద పరిమాణంలో ఉన్న ఈ సిస్ట్‌కు వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం శస్త్రచికిత్స చేయాలని వైద్యులు నిర్ణయించారు. అనంతరం డా.పి రవి, ఎమ్ ఎస్, జనరల్, ల్యాప్రోస్కోపిక్ సర్జన్ ఆధ్వర్యంలో శస్త్రచికిత్స నిర్వహించి సుమారు 8 కిలోల బరువున్న సిస్ట్‌ను తొలగించారు. శస్త్రచికిత్స అనంతరం రోగిని వైద్యుల పర్యవేక్షణలో ఉంచి అవసరమైన చికిత్స అందిస్తున్నారు. శ్రీ శ్రీనివాస మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్, మెట్పల్లి వైద్య బృందం సమన్వయంతో ఈ శస్త్రచికిత్స విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు.

## శాతవాహనలో ఆరు నూతన రెగ్యులర్ పీజీ కోర్సులు

**కరీంనగర్ కల్చరల్, ఆగస్టు 19 (జనంసాక్షి) :** శాతవాహన విశ్వవిద్యాలయంలో 2026-27 విద్యా సంవత్సరం నుంచి ఆరు నూతన పోస్ట్‌గ్రాడ్యుయేషన్ (పీజీ) కోర్సులను రెగ్యులర్ విధానంలో ప్రారంభించేందుకు అనుమతి లభించింది. ఉపకులపతి ఆచార్య యు. ఉమేష్ కుమార్ ప్రత్యేక చొరవతో పంపిన ప్రతిపాదనలను పరిశీలించిన తెలంగాణ ప్రభుత్వ కళాశాల విద్య కమిషనర్ ఎ. శ్రీదేవసేన, ఐఏఎస్ కోర్సులకు అనుమతులు మంజూరు చేశారు. కొత్తగా ఎంబీఏ (రిటైల్ మేనేజ్‌మెంట్) 60 సీట్లు, ఎంకామ్ (ఫైనాన్స్ టెక్నాలజీ) 40, ఎంఎస్సీ (ఫోరెన్సిక్ సైన్స్) 30, ఫుడ్ సైన్స్ అండ్ న్యూట్రిషన్ 30, ఎంఎస్‌డబ్ల్యూ 40, ఎంబీఏ (బిజినెస్ అనలిటిక్స్) 60 సీట్లతో కోర్సులు అందుబాటులోకి రానున్నాయి. ఈ సందర్భంగా వీసీ ఆచార్య ఉమేష్ కుమార్ మాట్లాడుతూ బిజినెస్ అనలిటిక్స్, ఫైనాన్షియల్ టెక్నాలజీ, ఫోరెన్సిక్ సైన్స్, ఫుడ్ సైన్స్ వంటి ఉపాధి అవకాశాలు ఉన్న కోర్సులను రెగ్యులర్ విధానంలో అందించడం ద్వారా స్థానిక, గ్రామీణ విద్యార్థులకు ఎంతో ప్రయోజనం కలుగుతుందన్నారు. ఉన్నత విద్యలో కొత్త కోర్సులను ప్రవేశపెడుతూ విశ్వవిద్యాలయాన్ని మరింత అభివృద్ధి దిశగా తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు.

# హాజరైన కేంద్రమంత్రి బండి సంజయ్, ఎమ్మెల్యే గంగుల కమలాకర్

**కరీంనగర్ బ్యూరో, ఆగస్టు 19 (జనంసాక్షి) :**



కరీంనగర్ జిల్లా కేంద్రంలోని గాంధీ రోడ్‌లో ఉన్న ప్రతిష్టాత్మక వైశ్య భవన్‌ను అత్యాధునిక హంగులతో నూతన కన్వెన్షన్ హాల్‌గా పునర్నిర్మించేందుకు శ్రీకారం చుట్టారు. ఈ మేరకు చేపట్టిన భూమిపూజ కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకకు కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్, కరీంనగర్ శాసనసభ్యులు గంగుల కమలాకర్ ముఖ్య అతిథులుగా విచ్చేశారు. గాంధీ రోడ్‌లోని వైశ్య భవన్ ప్రాంగణానికి చేరుకున్న కేంద్రమంత్రి బండి సంజయ్, ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌లకు వైశ్యసేవ కేంద్రం నిర్వాహకులు, ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. వారికి పుష్పగుచ్ఛాలు అందించి, శాలువాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించి, నూతన కన్వెన్షన్ హాల్ నిర్మాణానికి అంకురార్పణ చేస్తూ, భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా నూతన కన్వెన్షన్ హాల్‌కు సంబంధించిన వివరాలతో కూడిన కరపత్రాలను అతిథులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఆర్యవైశ్యుల సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాలకే కాకుండా ప్రజలందరికి వేదికగా నిలిచే ఈ భవనాన్ని మరింత ఆధునిక వసతులతో కూడిన కన్వెన్షన్ హాల్‌గా తీర్చిదిద్దడం అభినందనీయమ న్నారు. ఈ భవన నిర్మాణ పనులకు తమ వంతు పూర్తి సహకారం ఉంటుందని ఈ సందర్భంగా వారు భరోసానిచ్చారు. ఈ కార్యక్ర మంలో వైశ్యసేవ కేంద్రం అధ్యక్షులు చిదుర సురేష్, కార్యదర్శి విద్యాసాగర్, కోశాధికారి రమేష్‌తో పాటు పలువురు ప్రముఖ ఆర్యవైశ్యులు, సంఘం నాయకులు, సభ్యులు పాల్గొన్నారు

## వేములవాడలో 30 క్వింటళ్ల అక్రమ పిడిఎస్ బియ్యం సీజ్

**వేములవాడ రూరల్:** వట్టెంల గ్రామంలో అక్రమంగా తరలిస్తున్న 30 క్వింటళ్ల పిడిఎస్ బియ్యాన్ని పట్టుకున్నట్లు వేములవాడ రూరల్ ఎస్ఐ వెంకట్రాజం తెలిపారు. గ్రామంలోని ఒక గుడిసెలో నిల్వ చేసిన 20 క్వింటళ్లు, రెండు ఆటోల్లో తరలిస్తున్న మరో 10 క్వింటళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. తక్కువ ధరకు బియ్యం కొని నల్గొండకు తరలిస్తున్న వానరసి శ్రీనివాస్, మోతె భాను ప్రసాద్, గుంట ఎల్లయ్యలపై కేసు నమోదు చేసి, రెండు ఆటోలను సీజ్ చేశారు. సమర్థవంతంగా వ్యవహరించి బియ్యాన్ని పట్టుకున్న ఎస్ఐ వెంకట్రాజం, కానిస్టేబుల్ దేవరాజు, సిబ్బందిని వేములవాడ రూరల్ సిఐ శ్రీనివాస్ అభినందించారు.

# నాణ్యత లేని ఆసుపత్రి నిర్మాణం.. అధికారుల పర్యవేక్షణ ఏదీ?

- రూ.7.63 కోట్లతో నిర్మిస్తున్న మెట్‌పల్లి ప్రభుత్వ ఆసుపత్రి భవనం
- పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదంటున్న స్థానికులు
- కాంట్రాక్టర్ ఇష్టారాజ్యం.. అధికారుల పర్యవేక్షణపై విమర్శలు
- నిర్మాణాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించాలని ప్రజల డిమాండ్





**జగిత్యాల జిల్లా ప్రతినిధి, ఆగస్టు 19 (జనం సాక్షి):** మెట్‌పల్లి ప్రభుత్వ సామాజిక ఆసుపత్రి నూతన భవన నిర్మాణ పనులపై నాణ్యతా ప్రమాణాల పై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చిస్తున్నప్పటికీ.. నిర్మాణ పనుల్లో నాణ్యతపై సంబంధిత అధికారులు దృష్టి సారించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. మెట్‌పల్లి ప్రభుత్వ సామాజిక ఆసుపత్రి నూతన భవన నిర్మాణానికి ప్రభుత్వం రూ.7.63 కోట్లు మంజూరు చేసి పనులు చేపట్టింది.

అయితే నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదని, కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంగా పనులు నిర్వహిస్తున్నా సంబంధిత అధికారులు, క్వాలిటీ కంట్రోల్ సిబ్బంది తగిన స్థాయిలో పర్యవేక్షించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. కోట్లాది రూపాయల ప్రజాధనంతో నిర్మిస్తున్న ఈ భవనం భవిష్యత్‌లో దశాబ్దాల పాటు ప్రజలకు వైద్య సేవలు అందించాల్సి ఉన్నందున నిర్మాణంలో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని వారు పేర్కొంటున్నారు. నిర్మాణ పనుల తీరుపై సంబంధిత అధికారులను ఫోన్ ద్వారా సంప్రదించేం దుకు స్థానికులు ప్రయత్నించినప్పటికీ సరైన స్పందన లభించలేదని తెలిపారు. నిర్మాణ పనులపై వస్తున్న ఆరోపణల నేపథ్యంలో ఉన్నతాధికారు లు వెంటనే క్షేత్రస్థాయిలో తనిఖీ నిర్వహించి, నాణ్యతా ప్రమాణాలను పరిశీలించాలని ప్రజలు కోరుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా పనులు జరిగితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, అవసరమైతే నాణ్యత లేని పనులను తొలగించి ప్రమాణాలకు అనుగుణంగా పునర్నిర్మించాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వ నిధులతో నిర్మిస్తున్న ఆసుపత్రి భవనం భవిష్యత్‌లో ఎలాంటి ఇబ్బందులకు తావులేకుండా పటిష్టంగా నిర్మించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# యూసీఎఫ్ ప్రతిపాదనలు భేష్..

- కరీంనగర్ అభివృద్ధికి భారీ ప్రణాళిక : కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్
- రూ.630 కోట్లతో 50 కి.మీ. మేర మోడల్ రోడ్లు
- మూడు ఫుట్‌ఓవర్ బ్రిడ్జిలు.. బస్‌స్టేషన్‌లో స్కైవాక్
- రూ.130 కోట్లతో 80 కి.మీ. డ్రైనేజీ వ్యవస్థ
- రూ.80 కోట్లతో డంపింగ్ యార్డుకు శాశ్వత పరిష్కారం



**కరీంనగర్ బ్యూరో, ఆగస్టు 18 (జనంసాక్షి):** అర్బన్ ఛాలెంజ్ ఫండ్ (యూసీఎఫ్) ద్వారా కేంద్రం మంజూరు చేసిన రూ.840 కోట్లతో కరీంనగర్ రూపురేఖలు మార్చేందుకు రూపొందించిన అభివృద్ధి ప్రతిపాదనలపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ సంతృప్తి వ్యక్తం చేశారు. నగరాన్ని అభివృద్ధిలో తెలుగు రాష్ట్రాలకు రోల్‌మోడల్‌గా తీర్చిదిద్దేలా పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కరీంనగర్ ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో బుధవారం నగర మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, ఎస్ఈ సంపత్‌రావు, డీఈ దేవేందర్‌రెడ్డి తదితరులతో ఆయన సమావేశమై యూసీఎఫ్ కింద చేపట్టనున్న పనులపై సమీక్షించారు.

యూసీఎఫ్ నిధుల్లో రూ.630 కోట్లతో 50 కిలోమీటర్లకు పైగా మోడల్ రోడ్లను అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు అధికారులు వివరించారు. జిల్లా కోర్టు, సివిల్ ఆసుపత్రి, గీతాభవన్ వద్ద మూడు ఫుట్‌ఓవర్ బ్రిడ్జిలు నిర్మించడంతో పాటు కరీంనగర్ బస్‌స్టేషన్ వద్ద హైదరాబాద్ ఉప్పల్ తరహాలో స్కైవాక్ ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. నగరంలోని ప్రధాన ట్రాఫిక్ జంక్షన్లను గుర్తించి వాటిని ఆధునికంగా అభివృద్ధి చేయడంతో పాటు 130 ఎలక్ట్రిక్ వాహనాలను అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు.

నగరంలో స్వల్ప వర్షానికే రోడ్లపై నీరు నిలిచిపోతున్న నేపథ్యంలో రూ.130 కోట్లతో 80 కిలోమీటర్ల మేర డ్రైనేజీ వ్యవస్థను అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదనలు రూపొందించారు. వర్షపు నీరు సాఫీగా తరలిపోయేలా కాలువల నిర్మాణం, ఆధునీకీకరణ చేపట్టనున్నారు. అదే విధంగా నగరానికి దీర్ఘకాలిక సమస్యగా మారిన డంపింగ్ యార్డుకు శాశ్వత పరిష్కారం చూపేందుకు రూ.80 కోట్లతో సమగ్ర ఘన వ్యర్థాల నిర్వహణ ప్రాజెక్టును ప్రతిపాదించారు. ఇందులో బదిలీ కేంద్రాలు, చెత్త వేర్పాటు, ప్రాసెసింగ్, రీసైక్లింగ్, శాస్త్రీయ పద్ధతిలో వ్యర్థాల నిర్వహణకు అవసరమైన మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేయనున్నారు. ప్రతిపాదనలపై సంతృప్తి వ్యక్తం చేసిన బండి సంజయ్‌కుమార్ కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్, రాష్ట్ర మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి శ్రీదేవి, ఈఎన్సీ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. యూసీఎఫ్ ప్రతిపాదనలను యుద్ధప్రాతిపదికన పరిశీలించి ఆమోదించడంతో పాటు సాంకేతిక అనుమతులు మంజూరు చేయాలని కోరారు. అనుమతులు వచ్చిన వెంటనే టెండర్ ప్రక్రియ పూర్తి చేసి పనులు ప్రారంభించాలని మున్సిపల్ కమిషనర్‌కు సూచించారు. యూసీఎఫ్ నిధులతో కరీంనగర్ రూపురేఖలు పూర్తిగా మారనున్నాయని, మౌలిక వసతుల అభివృద్ధిలో నగరాన్ని తెలుగు రాష్ట్రాల్లోనే రోల్‌మోడల్‌గా నిలపాలని అధికారులను కోరారు.

## రసాయానిక ఎరువుల వాడకం తగ్గించాలి

**మంథని ఏడిఈ అంజని మిశ్రా**

**మంథని, ఆగస్టు 19, (జనంసాక్షి) :**

రసాయానిక ఎరువుల వాడకం తగ్గించాలని ఏడిఈ అంజని మిశ్రా అన్నారు. పెద్దపల్లి జిల్లా మంథని మండలం సూరయ్యపల్లి రైతు వేదికలో బుధవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ నూనె గింజల సాగు, ప్రకృతి వ్యవసాయం కిచెన్ గార్డెనింగ్ మీద అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏడిఈ అంజనీ మిశ్రా, కె. వి. కె శాస్త్రవేత్త డాక్టర్ వినోద్, వ్యవసాయ విస్తరణ అధికారులు, రైతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ సహాయ సంచాలకులు అంజనీ మాట్లాడుతూ.. కృత్రిమ ఎరువుల వాడకం తగ్గించాలని ప్రకృతి వ్యవసాయం వైపు రైతులు మొగ్గు చూపాలని తెలిపారు. మండల వ్యవసాయ అధికారి డాక్టర్ నవ్య మాట్లాడుతూ.. నూనె గింజల సాగు, కిచెన్ గార్డెన్ మీద రైతులకి అవగాహన కల్పించారు. కె.వి.కె శాస్రవేత డాక్టర్ వినోద్ మాట్లాడుతూ.. కూరగాయల విస్తీర్ణం పెంచాలని మీద అలాగే పప్పు దినుసుల పెంపకం గురించి వివరించారు.

# సర్క్యులర్ ఎకానమీకి కొత్త బాట

**ఈపీఆర్ అమలుతో వ్యర్థాల నుంచి విలువైన ఖనిజాల రికవరీ**

- 2030 నాటికి ప్రజా రవాణా విద్యుదీకరణే లక్ష్యం
- రీపర్పస్, సెకండ్ లైఫ్ వినియోగానికి ప్రాధాన్యం
- బ్యాటరీ వ్యర్థాలను వనరులుగా మార్చే దిశగా కార్యాచరణ


**హైదరాబాద్, ఆగస్టు 19 (జనం సాక్షి):**

బ్యాటరీ వ్యర్థాలను సమస్యగా కాకుండా విలువైన వనరులుగా మార్చే దిశగా తెలంగాణ అడుగులు వేస్తోంది. సర్క్యులర్ ఎకానమీని బలోపేతం చేయడం, బ్యాటరీల నుంచి కీలక ఖనిజాలను తిరిగి వెలికితీయడం, ఎక్స్‌టెండెడ్ ప్రొడ్యూసర్ రెస్పాన్సిబిలిటీ (ఈపీఆర్)ను సమర్థంగా అమలు చేయడంపై రాష్ట్రం దృష్టి సారించింది. ఈ అంశాలపై తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి (టీజీపీసీబీ), ఐఐటీ హైదరాబాద్ సమన్వయంతో, కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి (సీపీసీబీ) సహకారంతో బుధవారం సనత్‌నగర్‌లోని టీజీపీసీబీ కార్యాలయంలో 'పవరింగ్ సర్క్యులారిటీ' పేరుతో వర్క్‌షాప్ నిర్వహించారు. బ్యాటరీ తయారీ సంస్థలు, రీసైక్లర్లు, పరిశోధనా సంస్థలు, విద్యావేత్తలు, పరిశ్రమల నిపుణులు, అధికారులు కలిపి 90 మందికి పైగా పాల్గొన్నారు. టీజీపీసీబీ మెంబర్ సెక్రటరీ మాట్లాడుతూ 'తెలంగాణ రైజింగ్ 2047' విజన్‌లో భాగంగా నెట్-జీరో ఉద్గారాలు, పునరుత్పాదక ఇంధనం, సర్క్యులర్ ఎకానమీకి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నారు. 2030 నాటికి ప్రజా రవాణాను పూర్తిగా విద్యుదీకరించడంతో పాటు 2047 నాటికి రాష్ట్రంలో పచ్చదనాన్ని గణనీయంగా పెంచే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని తెలిపారు. బ్యాటరీ వ్యర్థాల నిర్వహణలో ఈపీఆర్‌ను అమలు చేయడమే కాకుండా, అవసరమైన సాంకేతిక, సంస్థాగత సామర్థ్యాలను అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు.

సీఎస్ఐఆర్-ఎన్ఎంఎల్ శాస్త్రవేత్త డాక్టర్ ప్రతిమా మేష్రామ్ మాట్లాడుతూ ముడి పదార్థాల సేకరణ నుంచి బ్యాటరీ తయారీ, వినియోగం, సేకరణ, రీసైక్లింగ్, ఖనిజాల రికవరీ వరకు సమగ్ర వ్యవస్థను అభివృద్ధి చేయాలని సూచించారు. 'గ్రేవ్-టు-క్రేడిల్' విధానంతో స్వయం సమృద్ధి కలిగిన బ్యాటరీ ఎకోసిస్టమ్‌ను నిర్మించవచ్చన్నారు. సీఎస్ఐఆర్-సీఈసీఆర్ఐకి చెందిన డాక్టర్ సుందర్ మాయవన్ మాట్లాడుతూ 2030 తర్వాత భారీగా వినియోగం ముగిసిన బ్యాటరీలు వ్యర్థ ప్రవాహంలోకి వచ్చే అవకాశం ఉందన్నారు. అందువల్ల ఇప్పటి నుంచే రీసైక్లింగ్ మౌలిక సదుపాయాలను బలోపేతం చేయాలని సూచించారు. బ్యాటరీలను వెంటనే రీసైక్లింగ్‌కు పంపకుండా ముందుగా రీపర్పస్, సెకండ్-లైఫ్ వినియోగానికి అవకాశాలను పరిశీలించాలని తెలిపారు. బ్యాటరీలు భూమిలో వ్యర్థాలుగా చేరకుండా ప్రభుత్వం, పరిశ్రమలు సమన్వయంతో చర్యలు చేపట్టాలని అన్నారు. సీపీసీబీ ప్రాంతీయ డైరెక్టర్ వరలక్ష్మి పాల్గొన్న ఈ వర్క్‌షాప్‌లో బ్యాటరీ తయారీ, రీసైక్లింగ్, క్రిటికల్ మినరల్స్ రికవరీ, ఈపీఆర్ అమలు, సెకండ్-లైఫ్ వినియోగంపై నిపుణులు చర్చించారు. సమావేశంలో వచ్చిన సూచనలు, సిఫార్సులతో నివేదికను రూపొందించి డబ్ల్యూసీఈఎఫ్-2026లో తెలంగాణ తరఫున సమర్పించేందుకు సీపీసీబీకి పంపనున్నట్లు మెంబర్ సెక్రటరీ తెలిపారు.

## సింగరేణి కార్మికుల సొంతింటి కల సాకారం దిశగా కృషి

**సొంత ఇంటి పథకంపై మంత్రి పొంగులేటి సానుకూల హామీ : జనక్‌ప్రసాద్**



**గోదావరిఖని, జనంసాక్షి:** సింగరేణి కార్మికులు, ఉద్యోగుల చిరకాల వాంఛ అయిన సొంతింటి కలను సాకారం చేసేందుకు ఐఎన్‌టీయూసీ నిరంతరం కృషి చేస్తోందని ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ డాక్టర్ బి. జనక్‌ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు ఆయన ఆధ్వర్యంలో ఐఎన్‌టీయూసీ ప్రతినిధి బృందం హైదరాబాద్‌లో రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని ఆయన నివాసంలో కలిసి సింగరేణి కార్మికులు, ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించింది. ఈ సందర్భంగా కార్మికుల సంక్షేమానికి సంబంధించిన పలు కీలక అంశాలపై మంత్రితో ప్రతినిధి బృందం సమగ్రంగా చర్చించింది. ముఖ్యంగా సింగరేణి కార్మికులకు సొంతింటి పథకాన్ని అమలు చేయాల్సిన ఆవశ్యకతను మంత్రి దృష్టికి తీసుకెళ్లింది. కార్మికుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వడంతోపాటు పెండింగ్ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఐఎన్‌టీయూసీ నాయకులు కోరారు. ప్రతినిధి బృందం ప్రస్తావించిన సమస్యలపై మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సానుకూలంగా స్పందించారు. సింగరేణి కార్మికుల సంక్షేమం, వారి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ముఖ్యంగా కార్మికుల సొంతింటి కలను సాకారం చేసే దిశగా వీలైనంత త్వరగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా డాక్టర్ బి. జనక్‌ప్రసాద్ మాట్లాడుతూ కార్మికుల హక్కులు, సంక్షేమం, పెండింగ్ సమస్యల పరిష్కారం కోసం ఐఎన్‌టీయూసీ నిరంతరం ప్రభుత్వంతో చర్చలు జరుపుతోందన్నారు. కార్మికులకు ఇచ్చిన హామీలు అమలయ్యే వరకు, వారికి న్యాయం జరిగే వరకు ఐఎన్‌టీయూసీ పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. సమావేశంలో ఐఎన్‌టీయూసీ సెంట్రల్ సీనియర్ వైస్‌ప్రెసిడెంట్లు నరసింహారెడ్డి, ధర్మపురి, కాంపెల్లి సమ్మయ్య, త్యాగరాజన్, చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ నరేందర్, జనరల్ సెక్రటరీ వికాస్‌కుమార్ యాదవ్, వైస్‌ప్రెసిడెంట్ వడ్డేపల్లి దాస్ తదితరులు పాల్గొన్నారు.

## మెడికో ప్రియాంక కేసులో పోలీసుల కస్టడీలోకి నిందితులు

### ముమ్మరంగా విచారణ



**జోగులాంబ గద్వాల ప్రతినిధి, ఆగస్టు 19 (జనం సాక్షి) :** ఆంధ్రప్రదేశ్, రాజమండ్రి, ప్రకాష్ నగర్ లో గల మెడికల్ కాలేజీ మేడికో ప్రియాంక మరణం రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టించిన వైద్య విద్యార్థిని ప్రియాంక కేసు దర్యాప్తులో కీలక పురోగతి నమోదైంది. ఆగస్టు 3వ తేదీన జరిగిన ఈ ఘోర ఘటనకు సంబంధించి నిందితులను ప్రకాశ్ నగర్ పోలీసులు బుధవారం ఎట్టకేలకు తమ కస్టడీలోకి తీసుకున్నారు. కోర్టు అనుమతితో నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు, నేరానికి సంబంధించిన పూర్తి వివరాలను రాబట్టేందుకు ముమ్మరంగా విచారిస్తున్నారు. బుధవారం ఉదయం 11 గంటల నుంచి ప్రారంభమైన ఈ పోలీసు కస్టడీ విచారణ, ఈ నెల 21వ తేదీ ఉదయం 11 గంటల వరకు నిరంతరాయంగా కొనసాగనుంది. కేసు తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ఉన్నతాధికారులు స్వయంగా రంగంలోకి దిగి విచారణను పర్యవేక్షిస్తున్నారు. సీఐ బాలాజీ లాల్, అదనపు ఎస్పీ, డీఎస్పీల ఉమ్మడి ఆధ్వర్యంలో ఈ విచారణ ప్రక్రియ అత్యంత గోప్యంగా సాగుతోంది. నిందితులను విడివిడిగా, అలాగే అందరినీ కలిపి కూర్చోబెట్టి వేర్వేరు కోణాల్లో అధికారులు ప్రశ్నల వర్షం కురిపిస్తున్నారు. ఘటన జరిగి కొన్ని రోజులు గడుస్తున్న నేపథ్యంలో, కేసును కోర్టులో బలంగా నిలబెట్టేందుకు అవసరమైన శాస్త్రీయ, సాంకేతిక మరియు భౌతిక ఆధారాలను సేకరించడంపైనే పోలీసులు ప్రధానంగా దృష్టి సారించారు. నేరం జరిగిన తీరు, దానికి దారితీసిన పరిస్థితులు, ఘటన సమయంలో నిందితుల కదలికలకు సంబంధించిన పూర్తి వివరాలను రాబట్టేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. ఈ మూడు రోజుల కస్టడీ గడువులోగా నిందితులను ఘటన జరిగిన ప్రాంతానికి తీసుకెళ్లి క్రైమ్ సీన్ పునర్నిర్మాణం చేసే అవకాశం కూడా ఉందని సమాచారం.

## మంథనిని మెరిపిస్తాం

- రూ.800 కోట్లతో మంథని రోడ్ల పనులను 18 నెలల్లో పూర్తి చేస్తా
- రోడ్డు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి
- ప్రతి 15 రోజులకు మంథని రహదారి పనులపై సమీక్ష
- రూ.20 కోట్లతో నాక్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్
- కమాన్‌పూర్-మంథని నాలుగు లేన్ల రహదారికి రూ.200 కోట్లు మంజూరు చేసేందుకు సీఎం ఆమోదం తీసుకుంటాం
- ప్రత్యామ్నాయ పంటలు, ఆయిల్‌పామ్ సాగు వైపు రైతులు దృష్టి సారించాలి
- మంథనిలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మంత్రులు కోమటిరెడ్డి, తుమ్మల, శ్రీధర్ బాబు



**మంథని, ఆగస్టు 19 ( జనంసాక్షి) :** మంథని నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం భారీగా నిధులు మంజూరు చేస్తోందని, గత రెండున్నరేళ్లలో సుమారు రూ.800 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు నిధులు కేటాయించామని, ఈ పనులను 18 నెలల్లో పూర్తి చేస్తామని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. మంథనిలోని గంగాపురి వద్ద రూ.20 కోట్లతో నాక్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్, మంథని-రామగుండం నాలుగు లేన్ల రహదారి విస్తరణ పనులకు రూ.21 కోట్లు, ఇతర ఆర్‌అండ్‌బీ రహదారి పనులకు రూ.97 కోట్లు, మంథని పట్టణంలో మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో రూ.15 కోట్లతో బీటీ రోడ్లు, రూ.9 కోట్లతో అంతర్గత సీసీ రోడ్ల అభివృద్ధి పనులకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ, జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్‌తో కలిసి బుధవారం శంకుస్థాపన చేశారు. మంథని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహించిన బహిరంగ సభలో నాలుగు మండలాల లబ్ధిదారులకు రేషన్ (స్మార్ట్) కార్డులు, కళ్యాణలక్ష్మి/షాదీ ముబారక్ చెక్కులు, సీఎంఆర్ఎఫ్ చెక్కులు, మైనార్టీలకు కుట్టుమిషన్లు, మహిళా స్వశక్తి సంఘాలకు చెక్కులను మంత్రులు పంపిణీ చేశారు. ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ దేశ ఆర్థిక వ్యవస్థను నిలబెట్టిన మహనీయుడు పీవీ నరసింహారావు, అజాతశత్రువు దుద్దిల శ్రీపాదరావు ప్రాతినిధ్యం వహించిన మంథని నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనడం తన అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. మంథని నియోజకవర్గంలో రహదారుల అభివృద్ధికి రూ.800 కోట్లకు పైగా నిధులు మంజూరు చేశామని మంత్రి తెలిపారు. నల్గొండలో కూడా ఇంత భారీగా నిధులు మంజూరు కాలేదన్నారు. గోదావరి నదిపై హై లెవల్ బ్రిడ్జికి రూ.125 కోట్లు, బైపాస్ రహదారికి రూ.162 కోట్లు, హెచ్ఏఎం రహదారులకు రూ.203 కోట్లు, మంథని-ఓడేడు రహదారికి రూ.60 కోట్లు తదితర పనులకు నిధులు మంజూరు చేశామని చెప్పారు. మంథని నియోజకవర్గంలోని అన్ని రహదారి పనులను 18 నెలల్లో పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు. ప్రతి 15 రోజులకు మంథని రహదారి పనులపై సమీక్ష నిర్వహిస్తామని చెప్పారు. ప్రజలందరికీ డబుల్ రోడ్డు సౌకర్యం అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కమాన్‌పూర్ నుంచి మంథని మున్సిపాలిటీ వరకు నాలుగు లేన్ల రహదారి నిర్మాణానికి సుమారు రూ.200 కోట్లు మంజూరు చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆమోదం తీసుకుని, వచ్చే 15 రోజుల్లో ప్రక్రియను పూర్తి చేస్తామని మంత్రి వెల్లడించారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. కష్టకాలంలో కూడా మంథని ప్రజలు తమ వెంట ఉన్నారని తెలిపారు. రైతు భరోసా కింద రూ.36 వేల కోట్లు అందించామని, రూ.1 లక్ష కోట్ల విలువైన పంటలను కొనుగోలు చేశామని చెప్పారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కోసం రూ.10 వేల కోట్లు ఖర్చు చేస్తున్నామని తెలిపారు. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మాట్లాడుతూ మంథని ప్రాంతానికి గత రెండున్నరేళ్లలో సుమారు రూ.800 కోట్ల అభివృద్ధి పనులకు నిధులు మంజూరయ్యాయని తెలిపారు. మంథని పట్టణంలోని బ్రిడ్జి నుంచి బస్ డిపో వరకు రూ.15 కోట్లతో రోడ్డు విస్తరణ పనులు చేపడుతున్నామని, మానేరు నదిపై కూడా వంతెన మంజూరైందని చెప్పారు. గోదావరి నదిపై హై లెవల్ బ్రిడ్జి, అవసరమైన రహదారి విస్తరణ పనులకు నిధులు మంజూరు చేసిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. అవసరమైన భూసేకరణ ప్రక్రియను త్వరగా పూర్తి చేసి, రహదారి పనులను వేగంగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని మంత్రి తెలిపారు. మంథని ప్రాంతంలో ఈ ఏడాది తక్కువ వర్షపాతం నమోదవుతున్న నేపథ్యంలో నీటిని పొదుపుగా వినియోగించాలని మంత్రి సూచించారు. సూపర్ ఎల్‌నినో పరిస్థితుల దృష్ట్యా రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు దృష్టి సారించాలని, వరి సాగును తగ్గించాలని కోరారు. పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ మాట్లాడుతూ గత పదేళ్లలో పెద్దపల్లి జిల్లాలో ఆశించిన స్థాయిలో అభివృద్ధి జరగలేదని అన్నారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, గ్రంథాలయ సంస్థ చైర్మన్ అన్నయ్య గౌడ్, మంథని మున్సిపల్ చైర్మన్ ఒడ్నాల శ్రీనివాస్, వైస్ చైర్మన్ సహేందర్ రెడ్డి, రామగుండం మేయర్ ఎం. స్వామి, డిప్యూటీ మేయర్ పారుపల్లి ఎల్లయ్య, విద్యుత్ శాఖ సలహాదారు కాచే శశిభూషణ్, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



## విరహత్ అలీకి మాతృవియోగం

- పరామర్శించిన పలువురు ప్రముఖులు
- అంత్యక్రియలో పాల్గొన్న జర్నలిస్టులు, నాయకులు

**జగదేవ్ పూర్ ఆగస్టు 19 (జనం సాక్షి) :** తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం అధ్యక్షుడు కాజా విరహత్ అలీకి మాతృ వియోగం జరిగింది. బుధవారం తెల్లవారుజామున విరహత్ అలీ మాతృ మూర్తి అయిన బాషారత్ ఉన్నిసాబేగం (86) అనారోగ్యంతో కన్నుమూశారు. విషయం తెలుసుకున్న పలువురు ప్రముఖులు, రాష్ట్రంలోని ఆయా జిల్లాలకు చెందిన జర్నలిస్టులు గజ్వేల్ లోని విరహత్ అలీ నివాసానికి పెద్ద సంఖ్యలో తరలివచ్చి బాషారత్ ఉన్నిసాబేగం పార్థివ దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం విరహత్ అలీ తోపాటు ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో ప్రెస్ అకాడమీ చైర్మన్ కే శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్సీ లు డాక్టర్ యాదవ రెడ్డి, దేశపతి శ్రీనివాస్, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ఫారుక్ హుస్సేన్ ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ మాజీ అధ్యక్షుడు దేవులపల్లి అమర్, కేంద్ర సాహిత్య అవార్డు గ్రహీత నందిని సిద్ధారెడ్డి, రాష్ట్ర బేవరేజస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవి ప్రసాద్, టి యు డబ్ల్యూ జే మాజీ అధ్యక్షుడు నగునూరి శేఖర్,, గజ్వేల్ నియోజకవర్గం బిఆర్ఎస్ ఇంచార్జ్ వంటేరు ప్రతాప్ రెడ్డి, గజ్వేల్ మున్సిపల్ చైర్మన్ గంగి శెట్టి చందన రవీందర్, మాజీ చైర్మన్ ఎన్ సి రాజమౌళి, పలువరు మున్సిపల్ కౌన్సిలర్లు, జర్నలిస్ట్ సంఘం నాయకులు రంగాచారి, ఫైసల్ అహ్మద్, యాదగిరి, కె రాజిరెడ్డి, వెంకటేష్, గజ్వేల్ ప్రెస్ క్లబ్ సభ్యు లు వై సురేందర్, పి. ఎల్లారెడ్డి, విజయా నంద రెడ్డి, కృపాకర్ రెడ్డి, విజయరావు, డి కృష్ణ, సయ్యద్ మునీర్, బాల్ నర్సయ్య, పరమేశ్వర్, బాలకృష్ణారెడ్డి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

### కేటీఆర్ సంతాపం

తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజే) అధ్యక్షులు కె.విరాహత్ అలీ మాతృమూర్తి బాషారత్ ఉన్నిసా బేగం మృతి తీవ్రంగా కలచివేసిందని కేటీఆర్ పేర్కొన్నారు. విరాహత్ అలీకి, వారి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియపరిచారు. వారికి మనోధైర్యాన్ని భగవంతుడు ప్రసాదించాలని, బాషారత్ ఉన్నిసా బేగం ఆత్మకు శాంతి చేకూరాలని పేర్కొన్నారు.




## సూర్యాపేటకు రైల్వే లైన్ సౌకర్యం కల్పించాలి

**సూర్యాపేట (జనంసాక్షి):** జాతీయ రహదారి 65కు సమాంతరంగా యధావిధిగా మొదటి అలైన్మెంట్ ప్రకారం సూర్యాపేటకు రైల్వే లైన్ సౌకర్యం కల్పించాలని కోరుతూ రైల్వే సాధన సమితికి మద్దతుగా సూర్యాపేట ఇండియన్ మెడికల్ అసోసియేషన్, జ్యువెలరీ అసోసియేషన్, పట్టణ స్వర్ణకార సంఘం జిల్లా కేంద్రంలోని కల్నల్ సంతోష్ బాబు విగ్రహం నుంచి కొత్త బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు మాట్లాడుతూ వందే భారత్ హైస్పీడ్ రైలు సౌకర్యం కల్పించాలని కోరారు. ట్రైన్ అలైన్మెంట్ రద్దును వెంటనే కేంద్ర ప్రభుత్వం విరమించుకోవాలని లేనిపక్షంలో ప్రజాసంఘాలు, అనేక పార్టీల సహకారంతో పెద్ద ఎత్తున ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. మొదటి అలైన్మెంట్ ప్రకారం రైల్వే సౌకర్యం సూర్యాపేటకు కేటాయించకుండా తీరని అన్యాయం చేశారని ఆక్షేపించారు. రైల్వే సౌకర్యంతో సూర్యాపేట పట్టణం ఎంతో అభివృద్ధి చెందుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో రైల్వే సాధన సమితి కన్వీనర్ దేగల జనార్ధన్, కో కన్వీనర్లు రాచూరి ప్రతాప్, డాక్టర్.రమేష్ చంద్ర, ఐఎంఏ అధ్యక్ష కార్యదర్శులు సల్వాది రమేష్ కుమార్, ఆనందరావు ,కోశాధికారి ఉపేందర్ సింగ్, సూర్యాపేట ఐఎంఏ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ ఊర రామ్మూర్తి యాదవ్, ఆనంద్, జ్యువెలరీ అసోసియేషన్ అధ్యక్షులు అంతటి విజయ్, కార్య దర్శి సింహాద్రి, కోశాధికారి బూర్లె మధుసూదన్, స్వర్ణకా రుల సంఘం అధ్యక్షుడు తొగిటి మురళి, పలువురు ప్రజా సంఘాల నాయకులు, డాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

## నకిలీ వాట్సాప్ ప్రొఫైల్‌తో కోటి మోసం

- 10 రోజుల్లోనే బాధితునికి డబ్బు పునరుద్ధరణ



**శేరిలింగంపల్లి, ఆగస్టు 19 (జనంసాక్షి) :** వాట్సాప్‌లో యజమాని పేరుతో నకిలీ ప్రొఫైల్ సృష్టించి కోటి రూపాయల సైబర్ మోసానికి పాల్పడిన కేసులో ఉత్తరప్రదేశ్‌లోని లక్నోకు చెందిన దీపక్ కుమార్(37) ను సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేశారు. దీనికి సంబంధించిన వివరాలను బుధవారం సైబరాబాద్ పోలీస్ డాక్టర్ ఎం రమేష్ వెల్లడిస్తూ ఈనెల 4వ తేదీన ఒక చీరల రిటైల్ సంస్థలో పనిచేస్తున్న అకౌంటెంట్‌కు సంస్థ యజమాని పేరుతో రూపొందించిన నకిలీ వాట్సాప్ ప్రొఫైల్ నుంచి ఆర్థిక లావాదేవీకి సంబంధించిన సందేశం వచ్చిందని తెలిపారు. ఆ సందేశం సంస్థ యజమానే పంపారని నమ్మిన అకౌంటెంట్, సంస్థకు చెందిన కరూర్ వైశ్య బ్యాంక్ ఖాతా నుంచి కోటి రూపాయలను ఇండస్‌ఇండ్ బ్యాంక్ ఖాతాకు బదిలీ చేశారని తెలిపారు. అయితే ఆ ఖాతా నకిలీది అని తేలడంతో సదరు వ్యక్తినుండి ఫిర్యాదు అందిన వెంటనే సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు రంగంలోకి దిగి దర్యాప్తు ప్రారంభించారని ఆయన తెలియజేశారు. దర్యాప్తులో మోసపూరితంగా బదిలీ అయిన మొత్తం రాయల్ మోద ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో నిర్వహిస్తున్న కార్పొరేట్ కరెంట్ ఖాతా ద్వారా మళ్లించబడినట్లు గుర్తించామని తెలిపారు. ఈ ఖాతాను మోసపూరితంగా వచ్చిన నిధులను తరలించేందుకు మ్యూల్ అకౌంట్ గా ఉపయోగిస్తున్నట్లు పోలీసు అధికారుల ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైందని సైబరాబాద్ సీపీ రమేష్ వివరించారు. బ్యాంకు లావాదేవీలు, నిధుల కదలిక మరియు ఇతర దర్యాప్తు ఆధారాలను విశ్లేషించి నిందితుడి ఆచూకీని గుర్తించామని పోలీస్ బాస్ తెలిపారు. దీపక్ కుమార్‌ను ఉత్తరప్రదేశ్‌లోని లక్నో ప్రాంతంలో ఈనెల 8వ తేదీన అదుపులోకి తీసుకున్నామని, అనంతరం అతడిని లక్నోలోని సంబంధిత న్యాయస్థానంలో హాజరుపరచి ట్రాన్సిట్ రిమాండ్ పొందామని సిపి తెలిపారు. ఆతర్వాత నిందితుడిని సైబరాబాద్‌కు తీసుకువచ్చి కూకట్‌పల్లిలోని 9వ అదనపు మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచడం జరిగిందని, న్యాయస్థానం నిందితుడిని జ్యుడీషియల్ కస్టడీకి రిమాండ్ ఉత్తర్వులు జారీ చేసిందని వివరించారు.

పోలీసుల వేగవంతమైన చర్యలు మరియు న్యాయస్థానం సకాలంలో జోక్యం చేసుకోవడం వల్ల మోసపోయిన కోటి రూపాయలను సురక్షితం చేయగలిగామన్నారు. రంగారెడ్డి పిడిజె మార్గదర్శకత్వంలో విలువైన ఉత్తర్వులను కేవలం ఒక రోజులో పొందడం ద్వారా న్యాయస్థానం ప్రతిష్ట మరింత ఇనుమడించడంతోపాటు బాధితునికి వేగంగా న్యాయం లభించినట్టు అయిందన్నారు. తద్వారా ఘటన జరిగిన 10 రోజుల్లోనే మోసపోయిన మొత్తాన్ని బాధితుడికి అందజేయడం సాధ్యపడిందని, ఈ మొత్తం పునరుద్ధరణ చట్టబద్ధమైన న్యాయ ప్రక్రియకు అనుగుణంగా జరిగిందని సిపి రమేష్ మీడియాకు తెలియజేశారు. ఎన్సిఆర్పి పోర్టల్ ద్వారా నిర్వహించిన తదుపరి విశ్లేషణలో నిందితుడి బ్యాంకు ఖాతాకు ఇతర రాష్ట్రాల్లో నమోదైన సైబర్ క్రైమ్ కేసులతో సంబంధాలు ఉన్నట్లు గుర్తించామని అన్నారు. ఈ కేసులో మిగిలిన నిందితులను గుర్తించడం, వారి పాత్రలను నిర్ధారించడం మరియు పూర్తి మనీ ట్రయిల్‌ను గుర్తించేందుకు దర్యాప్తు కొనసాగుతోందని చెప్పారు. ఈ కేసును ఇన్‌స్పెక్టర్ ఎ. మన్మోహన్, ఎస్ఐ శ్రీనివాసులు బృందం దర్యాప్తు చేయడం జరిగిందని, సైబర్ క్రైమ్స్, సైబరాబాద్ డిసిపి కె. పుష్ప, మార్గదర్శకత్వంలో, సైబర్ క్రైమ్స్, సైబరాబాద్ ఏసిపి ఎ. రవీందర్ రెడ్డి పర్యవేక్షణలో దర్యాప్తు కొనసాగిందని తెలియజెప్పారు. ఈ సందర్భంగా అధిక మొత్తంలో డబ్బు బదిలీ చేయాలని వచ్చే ప్రతి ఆర్థిక అభ్యర్థనను డబ్బు పంపే ముందు ప్రత్యామ్నాయ కమ్యూనికేషన్ మార్గం ద్వారా తప్పనిసరిగా ధృవీకరించుకోవాలని ప్రజలకు సిపి సూచించారు. వాట్సాప్ సందేశాలు, ప్రొఫైల్ ఫోటోలు లేదా డిస్‌ప్లే నేమ్‌ను మాత్రమే ఆధారంగా చేసుకుని ఆర్థిక అభ్యర్థన చేస్తున్న వ్యక్తి గుర్తింపును నిర్ధారించకూడదని తెలిపారు. సైబర్ ఆర్థిక మోసానికి గురైన వెంటనే 1930కు కాల్ చేయాలని లేదా నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేయాలని తెలిపారు. వెంటనే ఫిర్యాదు చేయడం ద్వారా మోసపోయిన నిధులను త్వరగా సురక్షితం చేసే అవకాశం ఉంటుందని చెప్పారు.










Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370